ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం
సోమవారం 14, అక్టోబరు 2024

గ్రామ సభల్లో 31వేలకుపైగా పనుల గుర్తింపు

ఉపాధి హామీ పథకం మెటీరియల్ నిధుల అనుసంధానంతో సిమెంటు, తారురోడ్లు, డ్రైన్లు ఇతర భూ, నీటి సంరక్షణ పనులు చేయాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. వీటి గుర్తింపు కోసం ఈ ఏడాది ఆగస్టు 23న రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజు గ్రామసభలు నిర్వహించింది. అప్పుడు గుర్తించిన పనులకు అధికారులు గత నెల 2 వరకూ అంచనాలు రూపొందించారు. వాటికి కలెక్టర్ ఆమోదం తెలిపి పరిపాలనా ఉత్తర్వులు ఇచ్చారు. అలా జిల్లాలోని 729 గ్రామాల్లో సభలు నిర్వహించగా అన్ని రకాలు కలిపి సుమారు రూ.286.22 కోట్ల విలువైన 31వేలకు పైగా పనులు చేపట్టాల్సి ఉందని గుర్తించారు. అందులో దాదాపు రూ.112 కోట్ల విలువైన వెయ్యి వరకు సిమెంట్ రోడ్లు ఉన్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో పెద్దఎత్తున మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పల్లె పండుగ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించింది. సోమవారం నుంచి ఊరూరా సంబరంలా ప్రారంభమయ్యే కార్యక్రమం వారంరోజులపాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా రోడ్లు, డ్రెయిన్లు, ఇతరత్రా అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేయనున్నారు. అందుకోసం జిల్లాకు ప్రభుత్వం సుమారు రూ.126 కోట్లు మంజూరు చేసింది. పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని నిర్దేశించింది. డ్వామా పర్యవేక్షణలో ఆ శాఖతోపాటు పంచాయతీరాజ్ అధికారులు, సిబ్బంది ఈ పనులు చేపట్టనున్నారు.

ఊరూరా అభివృద్ధి సంబరం

నేటి నుంచి 'పల్లె పండుగ'



నేడు జిల్లాలో 170 పనులకు భూమి పూజ

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో జిల్లాలోని 57 గ్రామ పంచాయతీల్లో 170 పనులకు సోమవారం భూమి పూజ చేస్తున్నట్లు డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పల్లె పండుగలో భాగంగా ఈ పనులను కొండపి, కనిగిరి, దర్శి, సంతనూతలపాడు, ఒంగోలు, గిద్దలూరు, ఎర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గాల్లో జిల్లాకు చెందిన మంత్రి స్వామి, శాసనసభ్యులు ప్రారంభిస్తారన్నారు.



ఒంగోలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్లు, ఇతరత్రా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. యంత్రాంగం గ్రామాల వారీ పనులను గుర్తించి అంచనాలు తయారు చేయగా వాటిని అనుమతులు కూడా ఇచ్చింది. వీటిని సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని నిర్దేశించింది. వీటి ప్రారంభం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 14నుంచి20 వరకు వారం రోజులపాటు పల్లె పండుగ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. విధివిధానాలు, కార్యక్రమ నిర్వహణ, పనుల పూర్తి తదితర అంశాలపై ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మార్గదర్శకం చేశారు. సోమవారం కొండపి మండలం పెట్లూరులో మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి లాంఛనంగా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఎక్కడికక్కడ శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

- రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యక్రమం
- వారం రోజులపాటు భారీగా శంకుస్థానలు
- జిల్లాలో సుమారు రూ.126 కోట్ల పనులు
- సిమెంటు రోడ్లు, డ్రెయిన్లు అధికం
- పెట్లూరులో ప్రారంభించనున్న మంత్రి స్వామి
- ఎక్కడికక్కడ పాల్గొననున్న ప్రజాప్రతినిధులు
- సంక్రాంతి నాటికి పనుల పూర్తే లక్ష్యం

ప్రజాప్రతినిధులు సూచించిన వారికే పనులు

ప్రతిపాదిత పనుల్లో అత్యధికం రూ.5 లక్షల నుంచి 20 లక్షల విలువైనవి ఉన్నాయి. వీటిని ఎక్కడికక్కడ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సూచించిన వారికి కట్టబెట్టే అవకాశం ఉంది. ఎక్కువ పనులకు పల్లె పండుగలో ఎమ్మెల్యేలే నేరుగా శంకుస్థాపనలు చేసేలా వారం రోజుల షెడ్యూల్‌ను డ్వామా అధికారులు రూపొందించారు. వీటిని సంక్రాంతి నాటికి పూర్తి చేసి అప్పుడు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఒకేసారి భారీగా పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఇసుక, సిమెంటు, ఇతరత్రా సామగ్రి కొరత లేకుండా చూడాలని కలెక్టర్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఉపాధి మెటీరియల్ నిధుల కేటాయింపు

జిల్లాలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ నిధులు సుమారు రూ.170 కోట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిని నియోజకవర్గానికి రూ.15 కోట్ల వంతున గత నెలలో కలెక్టర్ కేటాయించారు. పనులను మంజూరు చేశారు. వాటిలో రూ.126.19కోట్ల విలువైన 1,168 పనులకు పల్లెపండుగ సందర్భంగా భూమి పూజ చేయనున్నారు. అందులో సిమెంట్ రోడ్లు, బీటీ రోడ్లు, డబ్ల్యూఎంరోడ్లు, కల్వర్టులు తదితర పనులు ఉన్నాయి. దీంతో తక్షణం ఆ పనులు చేపట్టే విధంగా క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై డ్వామా, పంచాయతీరాజ్ అదికారులు దృష్టి సారించారు.

లక్కీ వైన్స్!

ఒంగోలు (క్రైం), అక్టోబరు 13 : మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ ప్రక్రియను సోమవారం నిర్వహించనున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను ఎక్సైజ్ అధికారులు పూర్తి చేశారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో ఉదయం 8 గంటలకు ప్రక్రియను ప్రారంభించనున్నారు. లక్కీ లాటరీ తగిలిన వారికి షాపులను కేటాయించనున్నారు. తొలుత ఎన్‌జీవో హోంలో ఏర్పాట్లు చేశారు. అక్కడ ప్రైవేటు కార్యక్రమాలు ఉండటంతో వేదికను అంబేడ్కర్ భవన్‌కు మార్చారు. లాటరీ నిర్వహణకు రెండు టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఆదివారం కలెక్టర్, ఎక్సైజ్ అధికారులు డమ్మీ లాటరీ తీసి పరిశీలించారు.

171 దుకాణాలకు 3,466 దరఖాస్తులు

జిల్లాలో మొత్తం 171 దుకాణాలకు నోటిఫికేషన్ ఇవ్వగా 3,466 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు ఫీజు ద్వారా రూ 69.32 కోట్ల మేర ఆదాయం లభించింది. లాటరీకి రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఒంగోలు, చీమకుర్తి, సింగరాయకొండ, పొదిలి, దర్శి సర్కిళ్లకు ఒకటో నంబర్ టేబుల్, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, కంభం, యర్రగొండపాలెం రెండో నంబర్ టేబుల్‌పై లాటరీ తీయనున్నారు. అదృష్టం వరించిన వారికి అక్కడికక్కడే దుకాణాన్ని కేటాయించనున్నారు. వీరు ఈనెల 16 నుంచి షాపును తెరిచి వ్యాపారం చేసుకోవచ్చు. మద్యం దుకాణం కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఆథరైజేషన్‌తో ఎవరినైనా లాటరీకి అనుమతిస్తారు. వారికి టోకెన్లు ఇస్తారు. కలెక్టర్‌తో కలిసి ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్‌నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఏఈఎస్‌లు డి.బాలయ్య, వై.వెంకట్, ఎ.జనార్దన్‌రావు సిబ్బంది అబేడ్కర్ భవన్‌లో ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు.

అన్ని ఏర్పాట్లు చేశాం

ఖాజామోహిద్దీన్, ఎక్సైజ్ ఈఎస్

మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ ప్రక్రియ సోమవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్ తెలిపారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. ప్రాంగణమంతా వాటర్ ప్రూఫ్ టెంట్లు వేయించడంతోపాటు దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని లాటరీ ప్రక్రియను తిలకించేందుకు ఎల్ఈడీ స్క్రీన్‌లను కూడా ఏర్పాటు చేశామన్నారు.

సింగరాయకొండ సర్కిల్‌లో ఎక్కువ..

జిల్లాలో మొత్తం 171 మద్యం దుకాణాలకు 3,466 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో షాపునకు సగటున 27.57 అందాయి. సింగరాయకొండ సర్కిల్‌లో 14 దుకాణాలకు ఒక్కోదానికి సగటున 27.57 చొప్పున అత్యధికంగా 386 వచ్చాయి. అతి తక్కువగా దర్శి సర్కిల్‌లో 23 దుకాణాలకు 382 (సగటున 16.60) దాఖలయ్యాయి. ఒంగోలులో 34 దుకాణాలకు 607, గిద్దలూరులో 13 షాపులకు 232 దరఖాస్తులు అందాయి. ఈ రెండు సర్కిళ్లలోనూ ఒక్కో షాపునకు సగటున 17.85 దాఖలయ్యాయి. మార్కాపురంలో 13 దుకాణాలకు 327 (25.15), కంభంలో 10 షాపులకు 240 (సగటున 24) దరఖాస్తులు వచ్చాయి. కనిగిరి సర్కిల్ పరిధిలో 19 దుకాణాలకు 391 (20.57), చీమకుర్తి సర్కిల్‌లో 16 మద్యం దుకాణాలకు 353 (22.06) దరఖాస్తులు సమర్పించారు. పొదిలి సర్కిల్ పరిధిలో 16 దుకాణాలకు 297 (18.56), యర్రగొండపాలెంలో 13 షాపులకు 255(20.27) దాఖలు చేశారు.

- నేడు మద్యం దుకాణాలకు లాటరీ
- ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో
- రెండు కౌంటర్లు ఏర్పాటు
- నమూనా విధానాన్ని పరిశీలించిన
- కలెక్టర్ అన్సారియా, అధికారులు


నమూనా లాటరీ తీస్తున్న కలెక్టర్ అన్సారియా

ఉత్సాహంగా దసరా


ఒంగోలులోని గొడుగుపాలెంలో పార్వేటలో పాల్గొన్న భక్తులు

- ముగిసిన శరన్నవరాత్రులు
- ఘనంగా పార్వేట ఉత్సవాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. దసరాను శనివారం జిల్లావ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే ఆలయాల వద్ద పెత్తఎత్తున బారులు తీరారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు సాయంత్రం పలుచోట్ల ఉత్సాహంగా పార్వేట ఉత్సవాలను నిర్వహించారు. ఒంగోలులోని గొడుగుపాలెం సెంటర్ జనసందోహంగా మారింది. వివిధ దేవాలయాల నుంచి ఉత్సవమూర్తులను మేళతాళాలతో నగరోత్సవంగా స్థానిక జమ్మిచెట్టు బజారు వరకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు అడుగడుగునా కర్పూర హారతులతో స్వామివారికి, అమ్మవార్లకు మంగళ నీరాజనాలు అర్పించారు. - ఒంగోలు కల్చరల్

కంభంలో కరెన్సీ కన్యకాపరమేశ్వరి

కంభం : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం కంభం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు ధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ కమిటీ రూ.1.13 కోట్ల కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. ఆ ధనలక్ష్మిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు.


కంభంలో రూ.1.13 కోట్లతో అమ్మ వారిని అలంకరించిన దృశ్యం

జిల్లాకు భారీ వర్ష సూచన

ఒంగోలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సోమవారం నాటికి అల్పపీడనం, ఆతర్వాత వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆ ప్రభావంతో మంగళ, బుధవారాల్లో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తీరప్రాంత మండలాల అధికారులను కలెక్టర్ అన్సారియా అలర్ట్ చేశారు. ఆయా మండలాలకు జిల్లా అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించి తక్షణ చర్యలకు ఆదేశించారు. ఆ వెంటనే రంగంలోకి దిగిన కొందరు మండలాల్లో సమావేశాలు కూడా నిర్వహించారు.

- రేపు, ఎల్లుండి కురిసే అవకాశం
- వాతావరణ శాఖ హెచ్చరిక
- యంత్రాంగం అప్రమత్తం
- తీరప్రాంత మండలాలకు
- ప్రత్యేకాధికారుల నియామకం
- కలెక్టరేట్‌లో 1077తో కంట్రోల్ రూం
- నాలుగు రోజులుగా ముసురు వాతావరణం

కలెక్టరేట్‌లో కంట్రోలు రూం ఏర్పాటు

జిల్లాకు భారీ వర్ష సూచన నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. దానికి టోల్‌ఫ్రీ నంబర్ 1077 కేటాయించారు. రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య, రోడ్లు భవనాలు, విద్యుత్, వైద్యశాఖ అధికారులు కంట్రోలు రూంలో నిరంతరం విధులు నిర్వహించనున్నారు.

నాలుగు రోజుల నుంచి జల్లులు

జిల్లా వార్షిక వర్షపాతంలో నాల్గోవంతుకు పైగా ఈనెలలోనే కురుస్తుంది. అలా ఈనెలలో సాధారణ వర్షపాతం 205.50 మి.మీ. కాగా ఇప్పటి వరకు 61.4 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అందులో గడిచిన నాలుగు రోజుల్లోనే సుమారు 46.0మి.మీ కురిసింది. జిల్లా అంతటా నాలుగు రోజులుగా వాతావరణం పూర్తిగా చల్లబడి తెరలు, తెరలుగా జల్లులు పడుతున్నాయి. కొన్నిచోట్ల ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఈనెల 11,12,13తేదీల్లో జిల్లాలో సగటున 36.0 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈమూడు రోజుల్లో ఒంగోలులో గరిష్ఠంగా 106.0 మి.మీ వర్షం కురిసింది. టంగుటూరులో 92.20, మద్దిపాడులో 79.0, నాగులుప్పలపాడులో 76.0, సీఎస్‌పురంలో 65.20, తర్లుపాడులో 56.2, మార్కాపురంలో 51.0, తాళ్లూరులో 50.60, చీమకుర్తిలో 50.0 మి.మీ నమోదైంది. ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, దొనకొండ, ముండ్లమూరు, పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి, హనుమంతునిపాడు, కనిగిరి, సంతనూతలపాడు, కొత్తపట్నం, జరుగుమల్లి, సింగరాయకొండ మండలాల్లో 25నుంచి 50 మి.మీ కురిసింది.


కంట్రోల్ రూంలో వివిధశాఖల సిబ్బంది

నేడు 'మీ కోసం' రద్దు

ఒంగోలు (కలెక్టరేట్), అక్టోబరు 13 : ఒంగోలులోని కలెక్టరేట్‌లో ప్రతి వారం నిర్వహించే మీ కోసం (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని ఈ సోమవారం తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మద్యం షాపుల కేటాయింపు కోసం సోమవారం లాటరీ ప్రక్రియ నిర్వహించాల్సి ఉందన్నారు. అందులో కలెక్టర్ తమీమ్ అన్సారియాతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొంటున్నందున మీ కోసం కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించి దూర ప్రాంతాల నుంచి ఒంగోలు రావద్దని శ్రీలత కోరారు.

పల్లెపండుగ వారోత్సవాలకు దూరంగా చీమకుర్తి

మండలానికి నిధులను కేటాయించని ఎమ్మెల్యే

మండల పరిషత్ నిధులు వినియోగంలో రాజకీయ ప్రతిష్టంభన

గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కానరాని మార్గం


పల్లామల్లిలో దుర్భరంగా ఉన్న శ్మశానం


అధ్వానంగా ఉన్న ఆర్ఎల్‌పురంలో రహదారి

చీమకుర్తి, అక్టోబరు 13: మునుపెన్నడూ జరగని విధంగా గ్రామపంచాయతీల అభివృద్ధి అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి ప్రభుత్వం పల్లెపండుగ పేరుతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నది. అయితే పల్లె పండగ వారోత్సవాల సందడికి చీమకుర్తి మండలం సుదూరంగా ఉండటం మండలవాసులను కలవరపరుస్తుంది. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సమాధానంగా ప్రభుత్వం చేపడుతున్న ఈ బృహత్తర కార్యక్రమం నిర్వహణకు నిధులు కేటాయింపు జరగకపోవటంతో మండల పరిధిలోని 24 పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి వీలులేకుండాపోయింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పంచాయతీలకు నిధుల మంజూరు చేయకపోవటంతో గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే అపరిష్కృతికంగా పేరుకుపోయాయి. అధ్వానంగా ఉన్న రహదారులు, లింక్ రోడ్లు, అస్తవ్యస్తంగా డ్రైనేజీ, దుర్భరంగా ఉన్న శ్మశానాలను సరిచేయటానికి నిధులు లేక అభివృద్ధికి నోచుకోక కునారిల్లుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం పల్లె ప్రగతికి పట్టం కడుతూ పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించింది. ఉపాధి హామీ పథకం కాంపోనెంట్ మెటీరియల్ నిధుల కింద పంచాయతీల అభివృద్ధికి నియోజకవర్గం వారిగా నిధులు కేటాయించింది. వీటిని వినియోగించి చేపట్టాల్సిన అత్యవసర పనులపై ఆగస్టు 21న ప్రతి పంచాయతీ పరిధిలో గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు చేశారు. ఈ మేరకు నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు రూ.15కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. వాటితో సోమవారం నుంచి పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రతి గ్రామంలో సీసీరోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతోపాటు నీటి సంరక్షణా ట్రెంచ్‌లను ఏర్పాటు చేయనున్నారు. అయితే ఈ కార్యక్రమంలో చీమకుర్తి మండలానికి చోటుదక్కకపోవటం చర్చనీయాంశంగా మారింది. దీంతో మండల పరిధిలో సమస్యల పరిష్కారానికి మార్గం మూసుకుపోయినట్లయింది. బహుశా రాష్ట్రంలోనే పల్లెపండుగ సందడి లేని మండలం చీమకుర్తి ఒక్కటే కన్పిస్తోంది. దీనికి కారణం నియోజకవర్గానికి కేటాయించిన రూ.15కోట్ల నిధుల కేటాయింపులో చీమకుర్తిని పక్కన పెట్టారు. మండల పరిషత్‌కు గ్రానైట్ సెస్ రూపంలో సమకూరే నిధులు పుష్కలంగా ఉండటంతో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ చీమకుర్తి మండలాన్ని మినహాయించి మిగతా మూడు మండలాలకు కేటాయించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈక్రమంలో పల్లెపండుగ కార్యక్రమాన్ని మండ ల పరిధిలో అమలు చేయలేని పరిస్థితి నెలకొంది.

మండల నిధులు ఉన్నా..

చీమకుర్తి మండల పరిషత్ ఖాతాలో దాదాపు రూ.18 కోట్ల వరకు నిధులు ఉన్నాయి. వీటిని వినియోగించి మండలంలో నెలకొన్న అత్యవసర సమస్యలన్నింటినీ చక్కగా పరిష్కరించవచ్చు. కానీ వాటి వినియోగానికి రాజకీయ గ్రహణం పట్టింది. మండల పరిషత్ పాలకవర్గం వైసీపీ చేతిలో ఉండటం, రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఉండటంతో సమస్య తలెత్తింది. మండల పరిషత్ నిధులతో తాము అభివృద్ధి పనులు నిర్వహించాలి కానీ.. టీడీపీ నాయకుల పెత్తనం ఏమిటని మండల పాలకవర్గం భావిస్తుండగా, ప్రభుత్వం తమది అయితే మీ ప్రమేయం ఏమిటనే భావనలో టీడీపీ నాయకులు ఉండటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈక్రమంలో ఈ నిధుల వినియోగానికి ప్రతిపాదనలు పెట్టే సాహసం చేయటం లేదు. ఒకవేళ అధికారులు ఎమ్మెల్యే బీఎస్ సూచించిన పనులను అజెండాలో చేర్చాలని తెలిపినా మండల పాలకవర్గం తిరస్కరిస్తుంది. అదేవిధంగా మండల పాలకవర్గం చేపట్టిన అభివృద్ధి పనులకు టెక్నికల్ అనుమతులు ఇవ్వకుండా అధికారులు మోకాలడ్డుతున్నారు. అంతేకాకుండా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన ప్రభుత్వ కార్యక్రమాలకు సైతం ప్రజాప్రతినిధులుగా ఉన్న తమకు కనీస సమాచారం కూడా అధికారులు ఇవ్వటం లేదని పాలకవర్గం ఆవేదనలో ఉన్నారు. దీంతో రెంటికీ చెడ్డ రేవడిగా మారి చీమకుర్తి మండలం పల్లె పండుగకు నోచుకోలేని దుస్థితి నెలకొంది. మరోవైపు మండల పరిధిలో పలు గ్రామాల్లో సమస్యలు పరిష్కారానికి నోచుకోక పేరుకుపోయి ఉన్నాయి. గ్రామాల్లో అంతర్గత రహదారులు చిన్నాభిన్నం అయ్యాయి. శ్మశానాలు దుర్భరంగా మారి చివరి మజిలీకి కూడా చిక్కులు ఏర్పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అభివృద్ధి కాముకుడుగా పేరొందిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఇరువర్గాల మధ్య సయోధ్య ఏర్పరచి మండల అభివృద్ధికి బాటలు వేయాలని మండలవాసులు కోరుతున్నారు.


సంతనూతలపాడు శ్రీఅంకాళమ్మతల్లి ఆలయంలో ఊరేగింపు


మైనంపాడులోని ఆళ్లవారి దసరా వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎన్


గొడుగుపాలెంలో అమ్మవారు


జమ్మిచెట్టు చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

కోలాహలంగా పార్వేట


ఆయుధపూజలో పాల్గొన్న ఎస్పీ దామోదర్ దంపతులు


పార్వేటలో అమ్మవారి ప్రతిమతో చిన్నారుల సందడి


ఒంగోలులో ఆటవస్తువులు కొంటున్న ప్రజలు

ముగిసిన దసరా శరన్నవరాత్రులు

మాజీ మంత్రి శిద్దా ఆధ్వర్యంలో అన్నదానం

ఒంగోలు(కల్చరల్), అక్టోబరు 13: దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజులు అమ్మవారికి రోజుకో అలంకారంతో వైభవంగా పూజలు నిర్వహించారు. ప్రజలు పెద్దసంఖ్యలో అమ్మవారిని వివిధ ఆలయాలలో దర్శనం చేసుకున్నారు. ఇక ఎన్నో సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తున్న దసరా పార్వేట ఉత్సవం శనివారం ఒంగోలులో కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా నగరంలోని వివిధ దేవాలయాల నుంచి ఉత్సవ మూర్తులను మేళతాళాలతో ఊరేగిస్తూ స్థానిక జమ్మి చెట్టు బజారు వరకు తీసుకువచ్చారు. ప్రజలు అడుగడుగునా కర్పూర హారతులతో స్వామివారికి, అమ్మవార్లకు మంగళ నీరాజనాలు అర్పించారు. ఇక శనివారం సాయంత్రం పార్వేట ఉత్సవానికి నగర ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావటంతో స్థానిక గొడుగుపాలెం సెంటర్ జనసందోహంతో నిండిపోయింది. వివిధ రకాల తినుబండారాలు, బొమ్మలు అమ్మేవారు. కొనేవారితో సందడిగా కనిపించింది. అదేవిధంగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతుల ఆధ్వర్యంలో స్థానిక లాయర్‌పేట సాయిబాబా మందిరం దగ్గర నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. అనంతరం శిద్దా దంపతులు సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకబృందం వారికి వేద ఆశీర్వచనం అందజేశారు.

ఎస్పీ ఆయుధపూజ

ఒంగోలు(క్రైం): విజయదశమి పండగను పురస్కరించుకుని శనివారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఆయుధపూజ జరిగింది. ఈ సందర్భంగా పోలీసులు ఉపయోగించే ఆయుధాలను దుర్గామాత వద్ద ఉంచి ప్రత్యేక ఎస్పీ దామోదర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్బీ సీఐ రాఘవేంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సంతనూతలపాడు మండలంలో..

సంతనూతలపాడు: దసరా పండుగను పురస్కరించుకుని శనివారం మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతనూతలపాడులోని త్రిపురాంతకస్వామి ఆలయం, బాపట్లబజారులోని శ్రీఅంకాళమ్మ తల్లి ఆలయంలో అమ్మవార్లను వైభవంగా ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ జరిగింది. ఇక అంబేడ్కర్‌నగర్‌లోని శ్రీపోలేరమ్మతల్లి వద్ద ఆలయకమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం చేశారు.

మైనంపాడులో..

ఆళ్ల వారి ఆధ్వర్యంలో మైనంపాడులో శనివారం రాత్రి నిర్వహించి పార్వేట అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారుల కోలాటం కార్యక్రమాన్ని తిలకించారు. భక్తులకు అన్నదానం జరిగింది. కార్యక్రమంలో ఆళ్ల సుబ్బారావు, ఆళ్ల ఆంజనేయులు, ఆళ్ల రాము, రవి, ఉప్పలపాటి ప్రభాకరరావు, మాదాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి : దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. విజయదశమి రోజున చీమకుర్తి పట్టణంలోని హరిహరక్షేత్రంలో నిర్వహించిన పార్వేట మహోత్సవంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు, శిద్దా పాండురంగారావు, శిద్దా సుధావళి కుటుంబసభ్యులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఇక గాంధీనగర్ కోదండరామస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారం భక్తులకు దర్శనమిచ్చారు. భారీ ఊరేగింపుగా విగ్రహన్ని నిమజ్జనానికి తరలించారు. సాక్షి రామలింగేశ్వర, వీరభద్ర ఆలయం, మండలవ్యాప్తంగా పలు ఆలయాల్లో దసరా వేడుకలు జరిగాయి.


గాంధీరోడ్డులో అమ్మవారి ప్రత్యేక అలంకరణ


ఒంగోలులో చిన్నారుల హేల


హరిహరక్షేత్రంలో జరిగిన పార్వేటలో శిద్దా రాఘవరావు


నృత్యం చేస్తున్న కళాకారులు






ఒంగోలు నగరం గొడుగుపాలెంలో స్వామివార్లకు హారతులు ఇస్తున్న భక్తులు

రచ్చబండను ప్రారంభించిన ఎమ్మెల్యే


రచ్చబండను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, అక్టోబరు 13: సంతనూతలపాడులో ఒంగోలుకు చెందిన ప్రముఖవైద్యులు కొమ్మి నరసింగరావు, శాంతిప్రియ దంపతులు చెరుకూరి సుబ్బారావు, చిరంజీవి జ్ఞాపకార్థం ప్రజల సౌకర్యార్థం రచ్చబండ, చేతిపంపును ఏర్పాటు చేయగా ఆదివారం ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. అలాగే శ్రీఅంకాళమ్మతల్లి ఆలయం జరిగిన దసరా పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు తన్నీరు శ్రీను, ఆర్.అంకారావు, ఆర్.సురేష్, ఎన్.మాధవీలత, ఎం.రంగనాయకమ్మ, ఎస్.సుబ్బారావు, బి.శంకర్, డి.కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాధవరావుకు పురస్కారం ప్రదానం


పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు(కల్చరల్), అక్టోబరు 13: శ్రీఅభయ కళారాధన సాంస్కృతిక సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మద్దాలి మాధవరావును సకల కల్చరల్ అకాడమీ, ఎల్‌సీఎస్ ఫౌండేషన్ వారు మహాత్మా గాంధీ జీవనసాఫల్య పురస్కారం, చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తి సేవా పురస్కారంతో ఘనంగా సన్మానించారు. ఆదివారం ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేతులమీదుగా ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సినీ నటి శ్వేత, నేషనల్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు జాడ సురేష్‌బాబు, నాట్య గురువు రాజేశ్వరి, సినీ గేయ రచయిత డాక్టర్ మధురశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి తిరువీధి ఉత్సవం


కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఒంగోలు(కల్చరల్), అక్టోబరు 13: ఒంగోలు నగరం శ్రీగిరిలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో తిరువీధి ఉత్సవం ఘనంగా జరిగింది. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పూలతో అలంకరించి ప్రత్యేక వాహనంపై ఉత్సవాన్ని నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అద్దంకి స్వర్ణ సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రదర్శించిన కోలాట ప్రదర్శన విశేషంగా అలరించింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఆలూరు ఝాన్సీరాణి, ధర్మకర్తలు ఆలూరు లక్ష్మీకుమారి, జైశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఒంగోలు(కల్చరల్), అక్టోబరు 13: జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. అధ్యక్షుడు బేతంశెట్టి హరిబాబు ఆధ్వర్యంలో ప్రముఖ దివంగత కళాకారుల గురించి పలువురు వక్తలు ప్రసంగించారు. అనంతరం గాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ నాగేశ్వరమ్మ, ఏల్చూరి అనంతలక్ష్మి, తులసి కోటేశ్వరరావు, తాళ్లూరి శ్రీదేవి, యశోద తదితరులు తమ పాటలతో ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో చల్లా నాగేశ్వరమ్మ, దేనువకొండ వెంకటసుబ్బారావు, ఎంవీవీపీ బాబురావు, రాయపాటి ఆశీర్వాదం, జాలాది మోహన్ పాల్గొన్నారు.

అమ్మవారి ఆరాధనతో అసురశక్తులు అంతం



ప్రసంగిస్తున్న పొన్నూరి శ్రీనివాసులు

ఒంగోలు (కల్చరల్), అక్టోబరు 13: నవ దుర్గలుగా అమ్మవారికి చేసే ఆరాధనతో లోకంలోని అసురశక్తులు నశించి ధర్మం నెలకొంటుందని ప్రరసం అధ్యక్షుడు, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరి వెంకటశ్రీనివాసులు ఉద్బోధించారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం శ్రీశైల దేవస్థానం ధర్మనిధి వేదికపై ఆయన శరన్నవరాత్రి వైభవంపై ప్రసంగించారు. అమ్మవారి ఆరాధనతో మానవుల్లో ఉన్న దుర్గుణాలు నశిస్తాయని, ఆరాధన వాక్కుని, శక్తిని, ఐశ్వర్యాన్ని, యశస్సును ఇస్తుందన్నారు. అనంతరం దేవస్థాన అధికారులు అమ్మవారి శేషవస్త్రంతో వేంకటశ్రీనివాసులును సత్కరించి ప్రసాదాలను అందజేశారు.

నేటి నుంచి 'పల్లెపండుగ'

ఒంగోలు(రూరల్), అక్టోబరు13: ఒంగోలు మండలంలో ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు పల్లెపండుగ కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీడీవో కె.రాజశేఖరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 14న గుండాయపాలెం, దేవరంపాడు దళితవాడ, దేవరంపాడు, బీవీపాలెం, 15న ఉలిచి, కరవది, చేజర్ల, 16న దశరాజుపల్లి, మండవవారిపాలెం, 17న సర్వేరెడ్డిపాలెం, యరజర్లలో జరుగుతాయని, ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొంటారని పేర్కొన్నారు.

జిల్లాలో 12.8 మి.మీ వర్షపాతం

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 13: జిల్లాలో ఒక మోస్తరు నుంచి మంచి వర్షమే కురిసింది. శనివారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 12.8 మి.మీ వర్షపాతం నమోదైంది. సీఎస్‌పురం మండలంలో 61.0, ఒంగోలు 50.4, టంగుటూరు 36.8, జరుగుమల్లి 32.0, తర్లుబాడు 30.8, చీమకుర్తి 27.4, మార్కాపురం 26.4, మద్దిపాడు 20.8, సింగరాయకొండ 20.4, సంతనూతలపాడు 17.2, దోర్నాల 14.8, పెద్దారవీడు 12.6, అర్ధవీడు 12.4, యర్రగొండపాలెం 12.2, పామూరు 10.4, హనుమంతునిపాడు 10. మి.మీ వర్షం కుసింది. ఇతర మండలాల్లో 1.0 నుంచి 9.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకం

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 13: ఎస్సీ వర్గీకరణ అంశం రాజ్యాంగ వ్యతిరేకమని మాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ దేవిప్రసాద్ పేర్కొన్నారు. ఒంగోలు అంబేడ్కర్‌భవన్‌లో శనివారం జరిగిన జేఏసీ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 26న రాజ్యాంగ ఆమోదదినోత్సవం రోజున విజయవాడలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అశోక్‌బాబు, మల్లేశ్వరి, నీలం నాగేంద్రరావు, శ్రీరాములు, వెంకట్, గోపీనాథ్, జనార్దన్, జాలయ్య, శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ దుకాణంలో చోరీకి యత్నం

నాగులుప్పలపాడు, అక్టోబరు 13: ఉప్పుగుండూరులోని గంగమ్మ హోటల్ కూడలి వద్ద మెకానిక్ దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. స్థానిక అంబేడ్కర్ కాలనీకి చెందిన బైక్ మెకానిక్ సూదనగుంట సలోమోన్‌కు చెందిన దుకాణం షట్టర్ తాళాలను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అయితే చి షట్టర్ పైకి వెళ్లకపోవడంతో వెనుదిరిగారు. ఆదివారం ఉదయాన్నే ఈ విషయాన్ని గుర్తించిన మెకానిక్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వివరాలు సేకరించారు.

సుప్రీంకోర్టు తీర్పును పునఃపరిశీలించాలి

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 13: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును పునఃపరిశీలించి రద్దు చేయాలని పలువురు డిమాండ్ చేశారు. అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక సీపీఐ కార్యాలయంలో దళిత కవి చప్పిడి కోటేశ్వరరావు అధ్యక్షతన సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా దళిత మహాసభ జాతీయ ప్రధానకార్యదర్శి నూకతోటి బాబురావు, దళిత సంఘాల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంగళరావు ప్రసంగించారు. కార్యక్రమంలో నాయకులు చప్పిడి రవిశంకర్, బిళ్లా వసంతరావు, ధర్నాశి చిరంజీవి, దండెల కృష్ణ, అంబటి కొండలరావు, బండ్ల డేవిడ్, వేమా బాలకోటి, పిల్లి కోటేశ్వరరావు, పలతోటి ఆంజనేయ ప్రసాద్, ఎద్దు శశికాంత్‌భూషణ్, నాగార్జున, మురళీ, దాసరి సుందరం, మాల్యాద్రి పాల్గొన్నారు.

మెడికల్ విద్యార్థినికి బీవీఎస్ఆర్ ట్రస్ట్ చేయూత


నగదును అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

చీమకుర్తి, అక్టోబరు 13 : చీమకుర్తి పట్టణం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పేద మెడికల్ విద్యార్థినికి బీవీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చేయూతనందించింది. కర్నూల్ మెడికల్ కళాశాలలో మెరిట్ కోటాలో సీటు సాధించిన విద్యార్థిని బత్తుల నిత్యశ్రీకి ఆదివారం చీమకుర్తిలో జడ్పీచైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు రూ.50వేల నగదును అందజేశారు. కౌన్సిలర్ బాబురావు పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

మద్దిపాడు, అక్టోబరు 13: మోటార్‌సైకిల్ ఢీకొని మహిళకు గాయాలైన సంఘటన ఆదివారం లింగంగుంట రోడ్డు జరిగింది. ఒంగోలు నగరం గోపాలనగర్‌కు చెందిన ఆర్.యశోదమ్మ పెదకొత్తపల్లి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా మోటార్‌సైకిల్ ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని రిమ్స్‌కు తరలించారు.

అలుపెరగని పోరాటయోధుడు సాయిబాబా

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 13: అలుపెరగని పోరాట యోధుడు ప్రొఫెసర్ సాయిబాబా అని పలువురు కొనియాడారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఉన్న మంచి పుస్తకం షాపు వద్ద సాయిబాబా సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చుండూరి రంగారావు, కోటి, బి.సుబ్బారావు, ఎం.జార్జి, దాసరి సుందరం, పిన్నిక శ్రీనివాస్, ఆవుల సుబ్రహ్మణ్యం, అంకయ్య, నరసింహారావు, సుబ్బారావు, అప్పారావు, రాజేంద్ర పాల్గొన్నారు. అలాగే ప్రొఫెసర్ జీఎస్.సాయిబాబా మృతి పట్ల సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.

తీరప్రాంత గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలి : డీపీవో

కొత్తపట్నం(ఒంగోలునగరం), అక్టోబరు 13: తుఫాన్ నేపథ్యంలో మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో అందరూ అప్రమత్తంగా ఉండాలని డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు పేర్కొన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం నేపథ్యంలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురవనున్న దృష్ట్యా ఆయన ఆదివారం కొత్తపట్నం మండలంలోని పలు తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించారు. మత్స్యకారులతో మాట్లాడారు. ఆర్డీవో లక్ష్మీప్రసన్న కూడా తీరంలో పర్యటించారు. మత్స్యకారులతో మాట్లాడారు. వేటకు వెళ్ళవద్దని ఆదేశించారు. గ్రామాల్లోని తుఫాన్ షెల్టర్లను పరిశీలించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, పోలీసు, సచివాలయలం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో, ఆర్డీవోలు మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా ఇళ్లు కూలిపోయే అవకాశం ఉంటుందన్నారు. ముంపు గ్రామాలను ముందుగా గుర్తించి వారిని తగిన సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు ఇబ్బందులు పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు జిల్లా కేంద్రానికి సమాచారం అందించాలన్నారు. మత్స్యకార గ్రామాల్లో చాటింపు వేయించాలని వారు ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీవో శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

72 బస్తాల రేషన్‌బియ్యం పట్టివేత

నాగులుప్పలపాడు, అక్టోబరు 13: మద్దిరాలపాడులో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసి లారీలో తరలిస్తుండగా స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఒంగోలు తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో శని వారం అర్ధరాత్రి ఓ నివాస గృహంలో అక్రమంగా నిల్వచేసిన 79 రేషన్‌బియ్యం బస్తాలను లారీలో తరలిస్తుండగా స్థానికులు గుర్తించి తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ ఆంజనేయులు తన సిబ్బందితో అక్కడకు చేరుకొని రేషన్‌బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిత తెలిపారు. కాగా రేషన్‌మాఫియాను నిర్వహిస్తున్న ఒంగోలుకు చెందిన వైసీపీ మహిళా నాయకురాలు అక్కడకు చేరుకొని బియ్యం తరలిస్తున్న లారీని విడిపించుకొనే ప్రయత్నాలు చేయగా స్థానికులు ఎదురుతిరగడంతో అక్కడ నుంచి ఉడాయించినట్లు తెలిసింది.

నేడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ రాక

మద్దిపాడు, అక్టోబరు 13: మండలంలో మద్దిపాడు, బవసన్నపాలెం, ఇనమెనమెళ్లూరు గ్రామంలో సోమవారం పల్లెపండగ కార్యక్రమాలు జరగనున్నాయి. ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ ఆయా గ్రామాల్లోని కార్యక్రమాలకు విచ్చేయనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ మండవ రంగారావు ఆదివారం ఓ ప్రకటపలో తెలిపారు. కార్యకర్తలు, నాయకులు, హాజరుకావాలని పిలుపునిచ్చారు.


పల్లకీ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పల్లామల్లిలో పల్లకీ మహోత్సవం

చీమకుర్తి, అక్టోబరు 13: పల్లామల్లి గ్రామంలో శనివారం సాయిబాబా సమాధి అయిన రోజు, శరత్‌బాబు గురూజీ జయంతిని పురస్కరించుకొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. దాదాపు 22 మంది యువకులు రక్తదానాన్ని చేశారు. గ్రామంలో పల్లకి మహోత్సవాన్ని ఊరేగింపుగా భక్తులు వేడుకగా జరుపుకున్నారు. సాయిసత్సంగకేంద్రంలో విశేషపూజలు జరిపారు.

ఇది కష్టానికి గుర్తింపు

- సత్య అభినందన సభలో మంత్రి స్వామి
- కొండపిలో భారీ ర్యాలీ
- పూలమాలలతో సన్మానించిన నాయకులు
- నియోజకవర్గ అభివృద్ధిలో ఆయనది ప్రముఖపాత్ర

కొండపి, అక్టోబరు 13 : కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్న దానికి నిదర్శనమే దామచర్ల సత్య అని రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. కొండపిలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య సన్మాన కార్యక్రమంలో మంత్రి స్వామి మాట్లాడుతూ 40 ఏళ్లుగా దామచర్ల కుటుంబం టీడీపీకి అంకితమై పనిచేస్తోందన్నారు. గడచిన ఐదేళ్లలో పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు దామచర్ల కుటుంబం చేసిన సేవలు రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ కీలకమైనవని చెప్పారు. ఉత్తరాంధ్ర బాధ్యతలు, మహానాడు నిర్వహణ లాంటి కార్యక్రమాలను విజయవంతం చేయడంలో సత్య పాత్ర ఎనలేనిదన్నారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించినందునే అనతికాలంలోనే సీఎం చంద్రబాబు, యువనేత లోకేష్‌లు సత్యకు మంచి పదవిని అప్పగించారని తెలిపారు. దామచర్ల కుటుంబం కాని, తాను కాని ఎవరిపైనా కక్ష సాధింపులకు పాల్పడింది లేదని, అది తమ నైజం కాదని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఎస్సీ కార్పొరేషన్, వెలుగు శాఖల ద్వారా త్వరలోనే ఎస్సీలకు, మహిళలకు 50శాతం సబ్సిడీతో పథకాలను అందించనున్నట్లు చెప్పారు. సన్మాన గ్రహీత రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ తమ కుటుంబానికి ఆకలి అంటే అన్నం పెట్టడం, ఆపద అంటే ఆదుకోవడం మాత్రమే తెలుసునన్నారు. నియోజకవర్గ ప్రజలు తనకు అండగా నిలిచినందుకు తమ కుటుంబం తరఫున ధన్యవాదాలు తెలిపారు. వ్యవసాయ ప్రధానమైన నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. సింగరాయకొండ మండలంలోని పాకలలో ఫిష్ ఇన్‌ల్యాండ్ సెంటర్ ఏర్పాటు, పాకలను టూరిజం స్పాట్‌గా తయారు చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా కొత్తపట్నం వద్ద ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో 450 కోట్ల రూపాయలతో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. తొలుత కొండపిలో స్వామి, సత్యలకు టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. కార్యక్రమంలో కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, జరుగుమల్లి, మర్రిపూడి, కొండపి, టంగుటూరు మండలాల పార్టీ అధ్యక్షులు పోకూరి రవీంద్రబాబు, చేరెడ్డి నరసారెడ్డి, బొడ్డపాటి యల్లమంద నాయుడు, కామని విజయకుమార్, నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు, యర్రమోతు శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ బెల్లం సత్యనారాయణ, పోటు శ్రీనివాసమురళి, ఏలూరి రాంబాబు, మండవ ప్రసాద్, కర్నా కోటిరెడ్డి, అనుమోలు సుధాకర్, కొమ్మాలపాటి కృష్ణ, గోరంట్ల పున్నయ్య, గుజ్జుల శ్రీనివాసరెడ్డి, పేముల విజయనిర్మల, దాసరి వెంకటేశ్వర్లు, బ్రహ్మానందం, మహిళా నాయకురాలు ప్రసన్న, రావిపాటి సీతమ్మ, బీజేపీ నాయకుడు బాలకోటయ్య, జనసేన నాయకుడు కనపర్తి మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.



కొండపిలో భారీ ఊరేగింపులో పాల్గొన్న స్వామి, సత్య (ఇన్‌సెట్లో) అభినందన సభలో జ్ఞాపికలతో సన్మానిస్తున్న కొండపి మండల నాయకులు

సీసీ రోడ్లు సకాలంలో పూర్తి చేస్తే వెంటనే బిల్లులు : మంత్రి స్వామి

కొండపి, అక్టోబరు 13 : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నిర్మించనున్న సీసీరోడ్లను వచ్చే జనవరిలోపు నిర్మిస్తే బిల్లులు ఫిబ్రవరి నెలలోపు చెల్లిస్తామని రాష్ట్ర సాంఘికసంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. కొండపిలో ఆదివారం జరిగిన రాష్ట్ర మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య అభినందన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ప్రస్తుతం 17 కోట్ల రూపాయల చొప్పున సీసీరోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయన్నారు. సోమవారం నుంచి జరిగే పల్లె పండుగ కార్యక్రమంలో సీసీరోడ్లకు శంకుస్థాపన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గతంలో సీసీరోడ్ల నిర్మాణ పనులు చేసినా బిల్లులు సకాలంలో చేయడంలో సాంకేతిక సమస్యల వల్ల బిల్లుల రాక ఇబ్బందులు పడ్డారని, ఈదఫా ఆ పరిస్థితి ఉండబోదని చెప్పారు.

నేడు పెట్లూరు కార్యక్రమంలో మంత్రి

పల్లెపండుగ కార్యక్రమం ప్రారంభం సందర్భంగా మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సోమవారం పెట్లూరులో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారు. పెట్లూరులో దాదాపు 30 లక్షల రూపాయలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు.

మద్యం మత్తులో గొంతు కోసుకున్న రౌడీషీటర్


ఆసుపత్రిలో రౌడీషీటర్ శివ రమేష్

సింగరాయకొండ, అక్టోబరు 13 : మద్యం మత్తులో రౌడీషీటర్ గొంతు కోసుకున్నాడు. ఈ సంఘటన సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని డ్రైవర్‌పేటలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. డ్రైవర్‌పేటకు చెందిన తన్నీరు శివ మహేష్ శనివారం పూటుగా మద్యం తాగారు. షైకంలో బ్లేడ్‌తో గొంతు కోసుకున్నాడు. గొంతు నుంచి రక్తం అధికంగా కారుతుండటంతో వెంటనే డయల్ 112కు ఫోన్‌చేశాడు. సమాచారం అందుకున్న ఏఎస్సై షేక్ మహబూబ్ బాషా, హెడ్ కానిస్టేబుల్ షాకీర్ సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రుడ్ని ఆటోలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం 108లో ఒంగోలు రిమ్స్‌కి తరలించారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

టంగుటూరు, అక్టోబరు 13 : టంగుటూరులో ఓ మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ జరిగింది. పమిడి రంగమ్మ శుక్రవారం పోలేమ్మ గుడికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న ఆమెను గుర్తు తెలియని వ్యక్తులు ఏదో చిరునామా అడుగుతున్నట్లు నటించి మెడలో మూడు సవర్ల బంగారు గొలుసు లాక్కొని మోటారు సైకిల్‌పై ఉడాయించారు. విషయం తెలియగానే ఎస్సై నాగమల్లేశ్వరరావు సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఊరేగింపులో కత్తిపోట్లు

మండలంలోని కారుమంచిలో శనివారం రాత్రి దసరా పండుగ నేపథ్యంలో అమ్మవారి ఊరేగింపులో యువకులు కత్తిపోట్లకు గురయ్యారు. పాతకక్షలు మనస్సులో పెట్టుకొని నిందితులు ఈ దాడులకు పాల్పడ్డారని సమాచారం. డాలు యశ్వంత్, వల్లూరు రాజులను బత్తుల శ్రీను మరికొందరితో కలసి కత్తితో పొడిచాడు. అలాగే వంశీని కర్రతో కొట్టారు. బాధితులంతా ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిలో చేరి పోలీసులకు రిపోర్టు ఇచ్చారు. యశ్వంత్ ఫిర్యాదు మేరకు ఎస్సై నాగమల్లీశ్వరరావు కేసు నమోదు చేశారు.


విద్యుత్ కాంతులతో వల్లూరమ్మ ఆలయం, మహిషాసురమర్దనిగా అమ్మవారు

వైభవంగా దసరా వేడుకలు

వల్లూరు(టంగుటూరు) అక్టోబరు 13 : మండలంలోని వల్లూరమ్మ దేవస్థానం ఆవరణలో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ప్రత్యేకంగా రుద్రాభిషేకం, గుడి ఉత్సవం జరిపారు. రాత్రివేళ సాంస్కృతిక కార్యక్రమాలతో హోరెత్తించారు. నవరాత్రుల్లో ప్రతి రోజూ వేలాది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఏడాది కొత్తగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం గమనార్హం.


జండా ఆవిష్కరణలో సీపీఎం నాయకులు

రాగాయ కుంటను చెరువుగా అభివృద్ధి చేయాలి

టంగుటూరు, అక్టోబరు 13 : టంగుటూరులో 26 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రాగాయ కుంటను చెరువుగా అభివృద్ధి చేసి గ్రామంలో నెలకొన్న తాగునీటి ఇక్కట్లను తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. టంగుటూరుకు ఏటా తాగునీటి అవస్థలు వస్తున్నాయని తెలిపారు.ఆదివారం టంగుటూరులో సీపీఎం జెండా ఆవిష్కరణలో మండల కన్వీనర్ మోజెస్ మాట్లాడుతూ గ్రామంలో ట్రాఫిక్ సమస్యను పూర్తిగా తొలగించేందుకు రైల్వే గేటుపై ఫ్లైఓవర్ నిర్మించాలని కోరారు. కొత్త కాలనీలో కనీస మౌలిక వసతులు లేవన్నారు. అనంతరం సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శిగా టంగుటూరు వెంకట్రావుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సిహెచ్. వినోద్, ఎంయానాది, ఎల్. కొండయ్య ఎం. వెంకటేశ్వర్లు, వెంకట్రావు, సురేష్, శ్రీను పాల్గొన్నారు.


శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలో రహదారిపై నిలిచిన వర్షపు నీరు

ఒంగోలు-కొప్పోలు రోడ్డు అధ్వానం

- కదలని వర్షపునీరు

ఒంగోలు(రూరల్), అక్టోబరు 13: ఒంగోలులోని కొప్పోలురోడ్డులో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు నిలిచి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. స్థానిక బైపాస్ వంతెన దగ్గర నుంచి కొప్పోలు వరకు డ్రైనేజీ సౌకర్యం లేక వర్షపునీరు, సమీపంలోని కాలనీల్లోని మురుగు నీరు రోడ్డుపై చేరుతోంది. దీంతో రోజులు తరబడి నీరు నిలిచి రోడ్డుపై గుంతలు పడుతున్నాయి. వాహనాదారులు తెలియక వాటిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై నీరు నిలువకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

కళాకారులకు 50శాతం రాయితీతో వైద్య సేవలు

ఒంగోలు(కల్చరల్), అక్టోబరు 13: కళాకారులు తమ కళల ద్వారా సమాజ చైతన్యానికి ఎంతో కృషిచేస్తారని, అటువంటి కళాకారులకు తమ ఆస్పత్రిలో 50 శాతం రాయితీతో వైద్య సేవలు అందించాలని నిర్ణయించినట్లు ఒంగోలు లక్ష్మీసూపర్ స్పెషాలిటీస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మన్నె రవీంద్ర పేర్కొన్నారు. స్వరఝరి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక సీవీఎన్ రీడింగ్ రూములో ఏర్పాటు చేసిన సంగీత విభావరి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్ర మాట్లాడుతూ కళాకారులకు ఓపీ, అన్ని రకాల వైద్యపరీక్షలు, శస్త్రచికిత్సలో 50శాతం రాయితీ ఇస్తామన్నారు. అనంతరం ఆయన ఘనంగా సత్కరించారు. ఇక గాయకులు ఎస్‌కే.అంజిబాబు, హరిబాబు, డాక్టర్ మల్లిఖార్జునరావు, శ్రీనివాస్, అంజుస్వామి, సుహాసిని తదితరులు పలు గీతాలను ఆలపించారు. సంస్థ అధ్యక్షురాలు, గాయని తాళ్లూరి శ్రీదేవి ఆధ్వర్యంలో ఆస్పత్రి డయాగ్నస్టిక్ మేనేజర్, గాయకులు డి.కోటేశ్వరరావు, గుర్రం కృష్ణ, మద్దుల నరసింహారావు, డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ, పెండ్యాల సాయిమాస్టర్, ఎన్నూరి నాగేశ్వరరావు, జానకిరామ్, పెద్దిశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పాకల తీరంలో సందడి

- భారీగా తరలొచ్చిన పర్యాటకులు

సింగరాయకొండ, అక్టోబరు 13 : మండలంలోని పాకల సముద్ర తీరంలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. ఉదయం నుంచే తీరానికి భారీగా తరలొచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి సముద్రంలో స్నానాలు ఆచరించారు. అలల తాకిడిని అస్వాదిస్తూ ఫొటోలు, సెల్ఫీలు దిగారు. పిల్లలు, పెద్దలు సరదగా గడిపారు. భారీ వర్ష సూచనతో ప్రమదాలు జరగకుండా మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


పాకల తీరంలో పర్యాటకులు

విస్తారంగా వర్షాలు

నాగన్నవాగులో కారుతో సహా కొట్టుకుపోయిన వ్యక్తి
రక్షించిన స్థానికులు

నాగులుప్పలపాడు అక్టోబరు 13: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఉప్పుగుండూరు గ్రామీణ ఆరోగ్యకేంద్రం వద్దనున్న నాగన్న వాగు నేలచప్టాపైకి వరద నీరు చేరింది. చప్టాకి ఇరువైపులా ఉన్న రైయిలింగ్ దిమ్మెలు సైతం నీట మునిగాయి. శనివారం బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం నీలాయిపాలెం గ్రామానికి చెందిన గుడివాడ రాజేంద్ర ఉప్పుగుండూరులో పనులు ముగించుకొని వినుకొండలో వివాహానికి వెళ్లేందుకు తన కారులో నాగన్న వాగు దాటేందుకు ప్రయత్నించాడు. అయితే వరద ఉధృతికి కారుతో సహా రాజేంద్ర వాగులో కొద్ది దూరం కొట్టుకుపోయాడు. స్థానికంగా ఉన్న ఓ మహిళ గమనించి కేకలు వేయగా చుట్టుపక్కల వారు పరుగులు తీసి తాడు సాయంతో అతి కష్టం మీద రాజేంద్రను కారులో నుంచి బయటకు తీసి రక్షించారు. అనంతరం స్థానికులే వాగుకు ఇరువైపులా ఆటోలను అడ్డుగా పెట్టి ఎవరినీ అటుగా వెళ్లకుండా పర్యవేక్షించారు.

కాగా వాగులో చిక్కుకున్న కారును క్రేన్‌సహాయంతో బయటకు తీసే సహాయచర్యలను తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షించి పంచనామ నమోదు చేశారు.


వాగులో కొట్టుకుపోయిన కారు

పొంగిన వాగులు

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు నాగులుప్పలపాడు-తిమ్మనపాలెం రహదారిలోని హనుమాపురం, కొత్తకోట వాగులు పొంగి ప్రవహించడంతో అటుగా రాకపోకలు నిలిచిపోయాయి. ఆ రెండు వాగుల వద్ద పోలీసులు చెక్ పోస్టు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. వర్షాలకు పొలాలు చెరువులను తలపిస్తున్నాయి.

పంజాబీ డ్రస్ వేసుకుందని భార్యను చంపిన భర్త

- కూరగాయల కత్తితో అతి కిరాతకంగా హత్య
- హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఘటన

దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భార్య తన మాట వినకుండా పంజాబీ డ్రస్ వేసుకుందన్న ఆగ్రహంతో ఓ భర్త ఆమెను కిరాతకంగా హతమార్చాడు. కూరగాయలు కోసే కత్తితో ఆమెను విచక్షణారహితంగా పొడిచి చంపేశాడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఆదివారం జరిగింది. ప్రకాశం జిల్లాకు చెందిన భార్యభర్తలు గుంజి వెంకటేశ్ (42), సోను (32) కొంతకాలంగా సరూర్‌నగర్‌లోని సరస్వతీనగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. వెంకటేశ్ తాపీ మేస్త్రీగా పని చేస్తుండగా, సోను ఇళ్లలో పనిచేస్తోంది. వెంకటేశ్‌కు తన భార్య పంజాబీ డ్రస్ వేసుకోవడం ఇష్టం లేదు. ఈ విషయం గురించి పలుమార్లు భార్యతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఆదివారం సోను పంజాబీ డ్రస్ ధరించింది. ఈ విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తీవ్ర కోపోద్రిక్తుడైన వెంకటేశ్ కూరగాయలు కోసే కత్తితో భార్యపై దాడి చేశాడు. వీపుపై, పొట్టలో బలంగా పొడిచాడు. తీవ్ర రక్తస్రావం జరగడంతో సోను అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని సోను మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. పెనుగులాటలో గాయపడిన వెంకటేశ్‌కు చికిత్స అందించి అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతర్

- నూనె ధరలు పెంచి విక్రయం

చీరాలటౌన్, అక్టోబరు 13 : అనూహ్యంగా పెరిగిన వంట నూనెల ధరలను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు తక్కువ ధరకే అందించాలని అధికారులు కంకణం కట్టుకున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఇది అమలు జరగడం లేదు. ప్రత్యేక కౌంటర్‌లలో సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.125, పామాయిల్ రూ.115కు విక్రయించాలని సూచించారు. దీనిపై ఆంధ్రజ్యోతి పరిశీలించగా పట్టణంలోని మహాలక్ష్మీ ఆయిల్ అండ్ జనరల్ ట్రేడర్స్, సాయి ఆయిల్ ట్రేడర్స్ వారు రూ.125కు బదులు రూ.135కు విక్రయిస్తున్నారు. దీనిపై నిర్వాహకులను వివరణ కోరగా అధికారుల సూచనలను తోసిపుచ్చారు. గిట్టుబాటు కాని ధరలకు అమ్మకాలు చేయలేమంటూ సమర్థించుకుంటున్నారు. అధికారులు వీటిపై దృష్టి సారించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- డీపీవో వెంకటనాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో వెంకటనాయుడు

నాగులుప్పలపాడు అక్టోబరు 13: తుఫాన్ రానున్న నేపథ్యంలో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు ఆదేశించారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవడంతో పాటు తుఫాన్‌గా మారే ప్రమాదం ఉందని, అందువల్ల తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. దగ్గరలోని పునరావాస కేంద్రాలను సిద్ధంగా ఉంచాలని, అన్ని వసతులను కల్పించాలని సూచించారు. ఈనెల 14 నుంచి తుఫాన్ తీవ్రత ఉన్నందున పూరిళ్లు, మట్టితో నిర్మించిన, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి అందులో నివశించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. అత్యవసర వస్తువులు, సరుకులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం కనపర్తిలోని జడ్పీ పాఠశాల పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో వై.మహాలక్ష్మి, ఏపీవో రవిబాబు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ఒంగోలు(క్రైం) అక్టోబరు 13: ఆత్మహత్యానికి పాల్పడిన యువకుడి పోలీసులు సకాలంలో స్పందించి కాపాడారు. ఈ సంఘటన ఈనెల 12వ తేదీన ఒంగోలులో జరిగింది. వివరాలలోకి వెళితే.. కుటుంబ సమస్యలతో సతమతమవుతున్న స్థానిక జక్రయ్యఆసుపత్రి వద్ద నివాసం ఉండే రమేష్ తాను చనిపోతున్నాంటూ రైల్వే ట్రాక్ మీద నుంచి కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. దీంతో ఆందోళన చెందిన రమేష్ కుటుంబసభ్యులు వెంటనే టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావుకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన సీఐ రమేష్ లొకేషన్ కనుగొని రక్షక్ మొబైల్‌వాహనంలో ఉన్న పోలీసులను వెంటనే అక్కడకు పంపించి రమేష్‌ను కాపాడారు. ఈ మేరకు రక్షక్ మొబైల్ కానిస్టేబుళ్ళు ఆంజనేయులు, కిషోర్, ఐటీకోర్ టీమ్ సభ్యులతోపాటుగా సీఐ శ్రీనివాసరావును ఎస్పీ దామోదర్ అభినందించారు.

18న కొత్తపట్నం మండల సమావేశం

కొత్తపట్నం(ఒంగోలు నగరం), అక్టోబరు 13: కొత్తపట్నం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 18వ తేదీన జరగనుందని ఎంపీడీవో శ్రీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం జరగనుందని, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల వెల్లువ

- చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 24 షాపులకు 451
- పలువురు మహిళలూ దాఖలు

చీరాల, అక్టోబరు 13 : మద్యం దుకాణాల లైసెన్స్‌లకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. అందులో మహిళలు కూడా దరకాస్తుదారులుగా ఉండడం విశేషం. తొలుత సిండికేట్లుగా మారి ఎక్కువ దరఖాస్తులు రాలేదని, దరఖాస్తు గడవును ప్రభుత్వం రెండు రోజులు పెంచింది. ఈ క్రమంలో నిర్ణీత అంచనాలకు దగ్గరదగ్గరగా దరఖాస్తులు అందాయి.

చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో చీరాల అర్బన్, చీరాల, వేటపాలెం, చినగంజాం, కారంచేడు మండలాల పరిధిలో మొత్తం 24 మద్యం దుకాణాల లైసెన్స్‌కు దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ క్రమంలో కొన్ని దుకాణాలకు మహిళలు కూడా దరఖాస్తు చేయడం విశేషం. మొత్తం 24 దుకాణాలకుగాను 451 దరఖాస్తులు అందాయని, అందులో 41 ఆఫ్‌లైన్లో, 410 ఆన్‌లైన్‌లో అందాయని, వీటిలో మహిళల పేరుపై కూడా దరఖాస్తులు అందాయని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం లాటరీ పద్ధతిలో దుకాణాల లైసెన్స్‌లను ఎంపిక చేస్తారు. వెంటనే తాత్కాలిక లైసెన్స్‌ను మంజూరు చేస్తారు. 16వ తేదీ నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి వస్తుంది. నిర్ణీత నిబంధనలన్నీ పూర్తయిన తరువాత పూర్తి లైసెన్స్‌లు మంజూరు చేస్తారు. ఈ క్రమంలో తమకే తాము కోరుకున్న షాపులకు లైసెన్స్ రావాలని వారివారి ఇష్టదైవాలను దరఖాస్తుదారులు వేడుకుంటున్నారు. ఇదిలావుంటే కొందరు లాటరీ పద్ధతిలో చేతివాటం ప్రదర్శించి తమ పేర్లు వచ్చేలా ఏమన్నా మార్గం ఉందా అనే కోణంలో కూడా చర్చలు జరుపుకుంటున్నారు.

3 కిలోమీటర్లు రోడ్డు లేక 30 కిలోమీటర్ల ప్రయాణం

● ఐదేళ్ల పాలనలో మరమ్మతులు కూడా చేయని వైసీపీ ప్రభుత్వం

● చాపలమడుగు- చెన్నంపల్లి- దొనకొండ రహదారి అధ్వానం

పుల్లలచెరువు, అక్టోబరు 13 : 'ఏ రోడ్డు చూసినా ఏమున్నది గర్వకారణం' అన్నట్టుంది మండలంలోని రోడ్ల దుస్థితి. ఎటు చూసినా మూరకో గుంత, బారకో బురద కయ్య దర్శనమిస్తున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్లు బురదచేలను తలపిస్తున్నాయి. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్లలో ప్రయాణం చేయాలంటే వాహనదారులు బంబేలెత్తుతున్నారు.

చాపలమడుగు-దొనకొండ రోడ్డు ఐదేళ్లుగా గుంతలమయం

చాపలమడుగు- చెన్నంపల్లి- దొనకొండకు టీడీపీ ప్రభుత్వ హయంలో నిధులు కేటాయించి పంచాయతీ రాజ్ రోడ్డును ఆర్అండ్‌బీ రోడ్డుగా మార్చారు. 70 ఏళ్లుగా రోడ్డులేక పడుతున్న ఇబ్బందులను చూసి అప్పటి టీడీపీ ప్రభుత్వం చాపలమడుగు నుంచి చెన్నంపల్లికి 3 కిలోమీటర్లు, త్రిపురాంతకం మండలం మిట్టపాలెం నుంచి చెన్నంపల్లి సమీపంలోని పొలాల వరకు 6 కిలోమీటర్లు రోడ్డు పనులు చేపట్టింది. మొత్తం 9 కిలోమీటర్ల రోడ్డు మధ్యలో నిధుల కొరతతో 3 కిలోమీటర్లు నిలిచిపోయింది. దీంతో నిత్యం త్రిపురాంతకం, పుల్లలచెరువు వెళ్లే ప్రయాణికులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. మూడు కిలోమీటర్లు రోడ్డు వేయకపోవడంతో వర్షం పడినప్పుడు ఈ రోడ్డు బురదతో మాగాణి పొలాన్ని తలపిస్తోంది. దీంతో మూడు కిలోమీటర్లు ప్రయాణం చేయలేక వాహనదారులు ఎర్రగొండపాలెం మీదుగా 30 కిలోమీటర్లు ప్రయాణించి అవతలి గ్రామాలకు చేరుకుంటున్నారు.


అధ్వానంగా చాపలమడుగు- దొనకొండ ఆర్అండ్‌బీ రోడ్డు

ఈ రోడ్లలో ప్రయాణం నరకయాతనే

మండలంలోని ముటుకుల-గుట్లపల్లి, గంగవరం-పుల్లలచెరువు, రంగనపాలెం-కుందంపల్లి, మానేపల్లి-అయ్యగానిపల్లె, ముటుకుల-రెంటపల్లి, ముటుకుల-పుల్లలచెరువు, చాపలమడుగు-సికోత్తపల్లి రోడ్డుల్లో ప్రయాణం చేయాలంటే నరకయాతన పడుతున్నారు. ఏళ్లుగా మరమత్తులకు నోచుకోవడం లేదు. ఈ రోడ్లలో బారకు ఒక గుంత ఉండటంతో ప్రయాణించాలంటే ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పంజాబీ డ్రస్ వేసుకుందని...

● భార్యను చంపిన భర్త

● కూరగాయల కత్తితో అతి కిరాతకంగా హత్య

● హైదరాబాద్‌లో ఘటన



దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భార్య తన మాట వినకుండా పంజాబీ డ్రస్ వేసుకుందన్న ఆగ్రహంతో ఓ భర్త ఆమెను కిరాతకంగా హతమార్చాడు. కూరగాయలు కోసే కత్తితో ఆమెను విచక్షణారహితంగా పొడిచి చంపేశాడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఆదివారం జరిగింది. ప్రకాశం జిల్లాకు చెందిన భార్యభర్తలు గుంజి వెంకటేశ్ (42), సోను (32) కొంతకాలంగా సరూర్‌నగర్‌లోని సరస్వతీనగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. వెంకటేశ్ తాపీ మేస్త్రీగా పని చేస్తుండగా, సోను ఇళ్లలో పనిచేస్తోంది. వెంకటేశ్‌కు తన భార్య పంజాబీ డ్రస్ వేసుకోవడం ఇష్టం లేదు. ఈ విషయం గురించి పలుమార్లు భార్యతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఆదివారం సోను పంజాబీ డ్రస్ ధరించింది. ఈ విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తీవ్ర కోపోద్రిక్తుడైన వెంకటేశ్ కూరగాయలు కోసే కత్తితో భార్యపై దాడి చేశాడు. వీపుపై, పొట్టలో బలంగా పొడిచాడు. తీవ్ర రక్తస్రావం జరగడంతో సోను అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని సోను మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. పెనుగులాటలో గాయపడిన వెంకటేశ్‌కు చికిత్స అందించి అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురంలోని ఏబీఎం హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 1998-99లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుని ఉపాధ్యాయులు దేవరకొండ లజారస్, సరోజినిదేవి, వరప్రసాద్, వసంతరాజకుమారి, జ్యోతిప్రకాశ్, రామకృష్ణలను సన్మానించారు. పూర్వ అనుభవాలను గుర్తుచేసకున్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

మార్కాపురం వన్‌టౌన్ : రెడ్డి సంక్షేమ సేవా సంఘం మార్కాపురం నియోజకవర్గ కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సుబ్బారెడ్డి జన్మదినం పురష్కరించుకుని 120 మంది నిరుపేదలకు రానున్న చలికాలం దృష్టిలో ఉంచుకుని దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న రీడింగ్ రూమ్ కార్యవర్గం

అథ్లెటిక్స్ విద్యార్థికి ఆర్థిక సాయం

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక ఎస్‌సీవీకే రీడింగ్ రూమ్‌లో అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన పట్టణానికి చెందిన చిన్నం ఆదినారాయణను పలువురు సన్మానించారు. ఎస్‌సీవీకే నిలయం కార్యదర్శి గుంటక సుబ్బారెడ్డి ఆదినారాయణకు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు.


ప్రేమజంటకు వివాహం జరిపించిన ఎంఆర్‌పీఎస్ నాయకులు

ప్రేమజంటకు వివాహం

గిద్దలూరు : రాచర్ల మండలంలోని నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవాలయంలో శనివారం ఎంఆర్‌పఋఎస్ నాయకులు ప్రేమజంటకు వివాహం జరిపించారు. అర్ధవీడుకు చెందిన అరుణ్‌కుమార్, మార్కాపురానికి చెందిన అరుణ నాలుగేళ్లుగా కంభం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీరి పరిచయం ప్రేమగా మారింది. ఇరువురి సామాజిక వర్గాలు వేరుకావడంతో వీరి ప్రేమపెళ్లికి పెద్దలు ఒప్పుకోలేదు. ఎంఆర్‌పీఎస్ నాయకులు షాలెంరాజు, జయరాజ్ తదితరులు పెద్దలుగా ఉండి రంగ నాయకస్వామి దేవాలయంలో ప్రేమ జంటకు వివాహం జరిపించారు.

కొండచిలువ కలకలం

గిద్దలూరు : పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహానికి వెళ్లే రోడ్డులో కొండచిలువ కలకలం సృష్టించింది. రోడ్డుకు అడ్డంగా గతవారంలో ఒక పర్యాయం కొండ చిలువ వెళ్లగా తాజాగా శనివారం రాత్రి మరోసారి ఇదే రోడ్డుకు అడ్డంగా కొండచిలువ వెళ్లింది. స్థానికులు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. సమీప కంపచెట్లలోకి కొండచిలువ వెళ్లగా ఆ ప్రాంతంలో నివాసం ఉండేవారు భయభ్రాంతులకు గురవుతున్నారు. వారం రోజుల వ్యవధిలోని రెండు కొండచిలువలు కనిపించడంతో ఆ రోడ్డున వెళ్లాలంటే జనం జంకుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

7 దుకాణాలకు 120 దరఖాస్తులు

● మార్కాపురంలో స్పందన నామమాత్రం

● అధికార పార్టీ ఒత్తిళ్లు.. వ్యాపారుల సిండికేట్ కారణం

మార్కాపురం, అక్టోబరు 13 : మద్యం దుకాణాల దరఖాస్తులకు స్పందన నామమాత్రంగా ఉంది. మండల పరిధిలో మొత్తం 7 దుకాణాలకు 120 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఐదేళ్ల తర్వాత మళ్లీ పాత పద్ధతి కావడం, కమీషన్ పెంచడం తదితర కారణాల వల్ల దరఖాస్తుల సంఖ్య పెరుగుతుందని అధికారులు భావించారు. కానీ మార్కాపురం పట్టణ, మండల పరిధిలోని దుకాణాలకు అతి తక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. మార్కాపురం సర్కిల్ పరిధిలోని పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాల పరిధిలోని ఒక్కో దుకాణానికి 30కి మించి దరఖాస్తులు అందాయి. మార్కాపురంలో మాత్రం సరాసరిన 20లోపు మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా రూ.2.40 కోట్ల మేర మాత్రమే ఆదాయం సమకూరింది. ముఖ్యంగా పట్టణ పరిధిలోని దుకాణాలకు భారీ డిమాండ్ ఉంటుందని భావించినా అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు, వ్యాపారులు సిండికేట్ కావడం దరఖాస్తుల సంఖ్య తగ్గినట్టు తెలుస్తోంది.

● నేతల ఒత్తిళ్లే కారణమా..?

మార్కాపురం పట్టణంతోపాటు మండల పరిధిలోని దుకాణాలకు తక్కువ దరఖాస్తులు రావడానికి ప్రధాన కారణం అధికార పార్టీ నేతల ఒత్తిళ్లే అని తెలుస్తోంది. గతంలో పట్టణంలోని దుకాణాలకు ఇదే విధంగా దరఖాస్తులు ఆహ్వానిస్తే వందల సంఖ్యలో దాఖలయ్యాయి. పొదిలి లాంటి చిన్నపాటి పట్టణంలోనే ఐదు దుకాణాలు ఉన్నాయి. కానీ మార్కాపురంలో కేవలం నాలుగు దుకాణాలకు మాత్రమే అనుమతిచ్చారు. అయినా కేవలం 74 దరఖాస్తులు మాత్రమే అందడం అనుమానాలకు తావిస్తోంది. 10వ తేదీ వరకు కేవలం 4 నుంచి 5 దరఖాస్తులే వచ్చాయి. చివర్లో జనసేన పార్టీకి చెందిన కొందరు సిండికేట్‌గా మారి పట్టణంలోని అన్ని దుకాణాలకు సుమారు 30 వరకు దరఖాస్తులు దాఖలు చేసినట్లు తెలిసింది. ప్రభుత్వం నూతన మద్యం పాలసీని ప్రకటించిన కొత్తలో కూటమి పార్టీలకు చెందిన కొందరు ఔత్సాహికులు నేతలను కలిశారు. ఈ విషయంలో దూరంగా ఉండాలని వారిని వారించినట్లు సమాచారం. ఆ కారణంగానే ఈ వ్యవహారానికి దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాక మరీ తక్కువ దరఖాస్తులు వస్తే అనుమానం వస్తుందని చివరి రెండు రోజుల్లో కొంతమేర సంఖ్యను పెంచినట్లు స్పష్టమౌతోంది.


కంభాలపాడులోని గ్రామోత్సవంలో అమ్మవారి పల్లకి మోస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి


తర్లుపాడులో వేణుగోపాలస్వామికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


గిద్దలూరులో హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

వైభవోపేతంగా...

గిద్దలూరు, మర్కాపురం నియోజకవర్గాల్లో ఘనంగా ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

గిద్దలూరు, మర్కాపురం నియోజకవర్గాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఆలయాలు భక్తుల దైవనామస్మరణతో మార్మోగాయి. పూజలు, అభిషేకాలు, అర్చనలు, గ్రామోత్సవాలు, పార్వేటలు విశేషంగా జరిగాయి.

పొదిలి : శరన్నవరాత్రుల్లో భాగంగా శనివారం మండలంలో పలు దేవాలయాల్లో దసరా మహోత్సవాలు వైభవంగా జరిగాయి. మండంలోని కంభాలపాడులోని అంకాలపరమేశ్వరి దేవాలయంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి పల్లకి మోస్తూ గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అంకాలమ్మతల్లి దేవాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మహాలక్ష్మమ్మ దేవాలయంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనీల్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మార్కాపురం అడ్డరోడ్డు సమీపంలోని విజయదుర్గాంబికా అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. పార్వతీ సమేత నిర్మామహేశ్వరస్వామి దేవాలయంలో దుర్గాదేవి అలంకరణలో పార్వతీపరమేశ్వరులు పార్వేటకు బయలుదేరుతున్నట్లు అర్చకులు తెలిపారు.

వైభవంగా పోలేరమ్మ జాతర

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లతో నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు.

● **బేస్తవారపేట :** బేస్తవారపేటలో ఆదివారం ఉదయం వాసవీ కన్యాకపరమేశ్వరీదేవి అమ్మవారి ఊరేగింపు కన్నులపండువగా జరిగింది. పూరవీధులో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆలయాల్లో ఎమ్మెల్యే పూజలు

గిద్దలూరు టౌన్ : ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పట్టణంలోని పలు దేవాలయాల్లో శనివారం అభిషేకాలు, హోమాల్లో పాల్గొన్నారు. పట్టణంలోని షరాఫ్ బజారులోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో హోమంలో పాల్గొని అనంతరం స్వామికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. రాచర్ల రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవస్థాన కమిటీ ఏర్పాటు చేసిన గ్రామోత్సవాన్ని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ట్రాక్టర్ నడిపి ప్రారంభించారు.

వైభవంగా చెన్నకేశవునికి పార్వేట

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా పార్వేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవస్వామి మోతకాపుల గోవిందనామస్మరణల మధ్య ఆలయం నుంచి చెరువు సమీపంలోని దసరా మండపం వద్దకు ధనుర్బాణాలు ధరించి మండపంలో వేంచేశారు. ఆలయ ఈఓ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు.

వేణుగోపాలస్వామి పార్వేట

తర్లుపాడు : తర్లుపాడులోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేణుగోపాలస్వామి, రుక్మిణి సత్యభామ స్వాములకు అర్చకులు కారంపూడి వెంకటరమణాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం వేణుగోపాల స్వామి ఉత్సవ విగ్రహాలతో తర్లుపాడు పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామ శివార్లులోని జమ్మిచెట్టు వద్ద పూజలు చేసి పార్వేట నిర్వహించారు.

కన్నుల పండువగా గ్రామోత్సవం


రాజరాజేశ్వరి అలంకారంలో సింహవాహనంపై అమ్మవారు

త్రిపురాంతకం : బాలాత్రిపుర సుందరిదేవి అమ్మవారి ఆలయంలో దసరా పండుగ రోజున వేదపండితులు మామిళ్లపల్లి నాగఫణి శాస్త్రి, ఫణీంద్రకుమార్‌శర్మ, అర్చకులు ప్రసాద్‌శర్మ, విశ్వ నారాయణశాస్త్రి బలిహరణ పూజలు, పూర్ణాహుతి కార్యక్రమాలను వేద మంత్రోచ్చరణల నడుమ నిర్వహించారు. అనంతరం అమ్మవారిని సింహవాహనంపై రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించి నిర్వహించిన గ్రామోత్సవం కన్నుల పండువగా సాగింది. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి శనివారం స్వామి అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

రథంపై ఊరేగింపుతో..

పెద్ద దోర్నాల : విజయదశమిని పురష్కరించుకుని నిర్వహిస్తున్న దేవీ నవరాత్రుల ముగింపు వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయం, పోలేరమ్మ గుడి, తిమ్మాపురంలోని చౌడేశ్వరీ దేవాలయం, మోట్ల మల్లికార్జున పురంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో దసరా ఉత్సవాలను పదిరోజులు పాటు వైభోపేతంగా నిర్వహించారు. చివరి రోజున ఆయా గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రథంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి గ్రామోత్సవం నిర్వహించారు.

సెమీ దర్శనం - గ్రామోత్సవం

గిద్దలూరు : శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో చండీ హోమం, సీతారామపట్టాభిషేకం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. సాయంత్రం దేవాలయం నుంచి కుసుమ హరనాథ మందిరం వరకు ఆంజనేయ సమేత సీతారామలక్ష్మణ విగ్రహాలతో సెమీదర్శనం నిర్వహించారు. ఆదివారం రాత్రి దేవాలయం నుంచి గ్రామోత్సవం మొదలుపెట్టారు. పట్టణంలోని అన్ని ప్రధాన వీధుల్లో సోమవారం ఉదయం వరకు గ్రామోత్సవం సాగనుంది. వేంకటేశ్వర స్వామి దేవాలయాల నుంచి కూడా దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలతో సెమీదర్శనం నిర్వహించగా మహిళలు కోలాటంతో స్వామికి స్వాగతం పలికారు.


సెమీ దర్శనంలో సీతారాములవారు

మార్కాపురంలో బతుకమ్మ సంబరాలు

మార్కాపురం వన్‌టౌన్ : పట్టణంలోని 9వ వార్డులో తెలంగాణా రాష్ట్ర తరహాలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామాతతో పాటు బతుకమ్మలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి మహిళలు బతుకమ్మ నృత్యాలు చేశారు. తెలంగాణాలోని బతుకమ్మ సాంప్రదాయాన్ని తొలిసారిగా మార్కాపురంలో నిర్వహించటంతో ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తిలకించారు.


9వ వార్డులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సర్కిల్ కార్యాలయంలో ఆయుధ పూజ

మార్కాపురం : విజయ దశమిని పురస్కరించుకుని మార్కాపురం పోలీసు సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయుధ పూజ నిర్వహించారు. మార్కాపురం సీఐ పి.సుబ్బారావు, టౌన్, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమ్మరావు, ట్రైనీ ఎస్సై రాజమోహనరావులు సాంప్రదాయ దుస్తులు ధరించి పూజల్లో పాల్గొన్నారు.

లక్ష్యం ఘనం.. ఆచరణ పూజ్యం!

నత్తనడకన సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నిర్మాణం

పెద్ద దోర్నాల, అక్టోబరు 13 : నిరుపేద చెంచు గిరిజనులకు మెరుగైన వైద్యం అందని ద్రాక్షలా మారింది. ఆర్భాటంగా ప్రారంభించిన సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 30 నెలల్లో పూర్తి కావలసిన వైద్యశాల నిర్మాణ పనులు 40 నెలలు దాటినా కొనసాగుతూనే ఉన్నాయి. ఎప్పటికీ పూర్తవుతాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. నల్లమల అటవీ ప్రాంతంలో నివశించే చెంచు గిరిజనులకు నాణ్యమైన వైద్యం అందిస్తామంటూ గత ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ వైద్యశాలను మంజూరు చేసింది. రూ.49లక్షల నిధులతో అధునాతన సౌకర్యాలను కల్పిస్తూ, పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి నిరుపేదలకు అన్ని రకాల జబ్బులనూ నయం చేయనున్నట్టు గొప్పగా ప్రకటించింది. 2021లో ప్రారంభించిన పనులు ప్రభుత్వం మారేదాకా పనులు పూర్తి చేయలేక పోయింది.

● లక్ష్యమిదీ....

దోర్నాలకు సమీపంలోని అయినముక్కల గ్రామం పరిసర ప్రాంతంలో 8.26 ఎకరాల విస్తీర్ణంలో నాబార్డు నిధులు, ఏపీ మెడికల్ సర్వీస్ ఇన్‌ఫ్రాస్త్రక్చర్ డెవలప్‌మెంట్ సహకారంతో 131 బెడ్లతో మల్టీ స్పెషాలిటీ వైద్యశాలను గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులు హైదరాబాద్‌కు చెందిన ఎన్‌సీసీ దక్కించుకుంది. మే 28వ 2021న ప్రారంభించి 27 నవంబర్ 2023 నాటికి పూర్తి చేసేందుకు ప్రభుత్వంతో అగ్రిమెంటు కుదుర్చుకుంది. ఈ క్రమంలో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి నుండి వైద్యశాల వరకు అనుసంధానించేందుకు ప్రధాన రహదారిని రూ.76 లక్షలతో నిర్మాణం చేపట్టేందుకు అనుమతులిచ్చింది. ఆ క్రమంలో రహదారిని నిర్మించేందుకు మాజీ మంత్రులు ఆదిమూలపు సురేష్, బాలినేని శ్రీనివాసరెడ్డి 2021లో శిలాఫలకం అవిష్కరించారు. నిర్మాణ పనులను వదిలేశారు. వైద్యశాల నిర్మాణం గడువు ముగిసి పది నెలలు దాటినా పనులు మాత్రం శ్లాబ్‌స్థాయి కూడా దాటలేదు. వైద్యశాల నిర్మాణం త్వరగా పూర్తి చేసి వైద్య సేవలు అందించాలని చెంచు గిరిజనులు కోరుతున్నారు.


శ్లాబ్ స్థాయిలో ఉన్న పనులు

అపూర్వ సమ్మేళనం

» పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



వైఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు

కురిచేడు, అక్టోబరు 13: 23 సంవత్సరాల తరువాత కలుసుకున్న వారంతా మళ్లీ చిన్న పిల్లల్లా సరదాగా ఆడుగూ పాడుతూ గడిపారు. తాము చదివిన పాఠశాల తరగతి గదులు, ఆడిపాడిన స్థలాలను చూసుకుని మురిసిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పాదాభివందనం చేసి ఘనంగా సత్కరించారు. ఇదంతా కురిచేడు వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-02 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకుని తమ సంతోషాలను పంచుకున్నారు.

కురిచేడు వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-02 విద్యా సంవత్సరంలో 120 మందికిపైగా విద్యార్థినీ విద్యార్థులు చదువుకున్నారు. వారిలో కొంతమంది ఇక్కడే ఉండగా, మరికొంతమంది దేశ విదేశాల్లో స్థిరపడ్డారు. 23 సంవత్సరాల తరువాత వారంతా కలుసుకున్నారు. అందరకూ సరదాగా గత స్మృతులను నెమరు వేసుకుంటూ గడిపారు. ఆట పాటలతో కేరింతలు కొట్టారు. ఎక్కువ మంది కుటుంబాలతో కలసి వచ్చి తమ గురువులను, పాత స్నేహితులను కుటుంబసభ్యులకు పరిచయం చేశారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు.

వాహనచోదకులు హెల్మెట్ ధరించాలి

ముండ్లమూరు, అక్టోబరు 13: వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ వై.నాగరాజు అన్నారు. అలాగే, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఇవిలేకుండా వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం ముండ్లమూరులో ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా వాహన చోదకులకు, ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రమాదాలకు గురికావద్దన్నారు. డ్రైవర్ సీటుకు ఇరువైపులా ప్రయాణికులను కూర్చోబెట్టవద్దన్నారు. వాహన చోదకులు అతివేగంగా వాహనాలను నడప రాదన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది సూరిబాబు, ప్రేమానిధి, ఎస్కేబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ సర్పంచ్

ముండ్లమూరు, అక్టోబరు 13: మండలంలోని పెదఉల్లగల్లుకు చెందిన వైసీపీ సర్పంచ్ జనమాల నాగేంద్రం పిచ్చయ్య శనివారం రాత్రి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్‌ను కలిశారు. గ్రామ మాజీ సర్పంచ్ జిల్లెలమూడి చౌదరి ఇంట్లో జరిగిన శుభకార్యక్రమానికి వచ్చిన లక్ష్మి, లలిత్‌సాగర్‌ను జనమాల పిచ్చయ్య, మరికొందరు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. త్వరలో టీడీపీలో చేరతామని పిచ్చయ్య తెలిపారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ కొక్కెర నాగరాజు, వరగాని పౌలు, మాజీ సర్పంచ్‌లు బద్రి గోపాలరెడ్డి, చావా బ్రహ్మయ్య, నిడమానూరి శ్రీనివాసరావు, కర్నాటి సాయికుమార్‌రెడ్డి, రెడ్డిమాసు రాఘవులు, కామని పూర్ణ, కొండవీటి బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

దొనకొండ, అక్టోబరు 13: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని స్థానిక గౌతమి డిగ్రీ కాలేజీ అడ్మిన్ ఎఫ్రాయిమ్(నాని) పేర్కొన్నారు. విజయదశమి సందర్భంగా నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. విన్నర్‌గా దొనకొండ జట్టు, రన్నర్ ఇండ్లచెరువుకు జట్టు నిలిచాయి.

రేపు కేవీపల్లిలో ఖోఖో జట్ల ఎంపిక

కనిగిరి, అక్టోబరు 13: మండలంలోని కంచర్లవారిపల్లి హైస్కూల్‌లో ఈనెల 15న ఉమ్మడి ప్రకాశం జిల్లా జూనియర్, సీనియర్ ఖోఖో జట్టు ఎంపిక జరుగుతుందని ఖోఖో సంఘం కార్యదర్శి బి.కాశీవిశ్వనాథ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ విభాగంలో బాలబాలికల వయస్సు, ఎత్తు, బరువు అన్నీ కలిపి 250 పాయింట్స్ మించరాదని పేర్కొన్నారు. నవంబరు 21, 2006 సంవత్సరం తర్వాత పుట్టినవారు మాత్రమే అర్హులని తెలిపారు. ఎంపికకు వచ్చే విద్యార్థులు పుట్టినతేదీ సర్టిఫికెట్‌తో పాటు ఆధార్‌కార్డు తప్పనిసరిగా వెంట తీసుకు రావాలని కోరారు.

ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25, 26, 27 తేదీల్లో చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరిగే 33వ రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీల్లో జిల్లా తరుపున పాల్గొంటారని తెలిపారు. సీనియర్ విభాగంలో ఎంపికైన వారు నవంబర్ చివరి వారంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9848219080 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 13: సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. స్వామివారికి మహా నైవేద్యాన్ని మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణలు చేసి సమర్పించారు. అనంతరం గోశాలలోని గోవులకు గోపూజలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఛైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, దారపనేని సుబ్బారావు దంపతులు, పచ్చవ బాబు దంపతులు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగ.. సరిచేసిన సిబ్బంది

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 13: సీఎస్‌పురం మండలం కోవిలంపాడు గ్రామంలోని ముస్లిం కాలనీకి వెళ్లే ఎల్‌టీ లైన్ తీగ తెగిపడింది. ఆసమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈసమస్యను టీడీపీ ఒంగోలు పార్లమెంట్ తెలుగుయువత అధికార ప్రతినిధి షేక్ రజ్జబ్‌బాషా లైన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌కు, జేఎల్ఎం నారాయణకు సమాచారం తెలిపారు. స్పందించిన విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ తీగలను సరిచేసి సమస్యను పరిష్కరించారు.

బొద్దికూరపాడులో పోలేరమ్మకు పొంగళ్లు



పొంగళ్లతో గుడికి వెళుతున్న మహిళలు

తాళ్లూరు, అక్టోబరు 13: మండలంలోని బొద్దికూరపాడు గ్రామంలో ఆదివారం పోలేరమ్మ చద్ది పొంగళ్లు ఘనంగా జరిగాయి. ప్రతి ఇంటిలో పొంగళ్లు పెట్టుకుని ఊరేగింపుగా పోలేరమ్మ గుడి వద్దకు వెళ్లి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పులి అంజిరెడ్డి, పోలం సూరారెడ్డి, పోలం రమణారెడ్డి, పులి బ్రహ్మారెడ్డి, ఎస్.అంజిరెడ్డి, సంపున రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పోలేరమ్మకు ఎల్‌జీపిగ్ ఫారం వారు ఆభరణాల కోసం గ్రాము బంగారం అందజేశారు.

మండలంలోని లక్కవరం గ్రామంలో శనివారం జరిగిన దుర్గామాత ఊరేగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. నవరాత్రుల సందర్భంగా ఏర్పాటుచేసిన దుర్గామాతను ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, తూము శివశంకర్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాటాల కోసం రహస్య ఒప్పందాలు!

» దర్శి నియోజకవర్గంలో 23 షాపులు

» 382 దరఖాస్తులు

» ఎవరికి దక్కినా భాగానికి వ్యాపారుల వ్యూహాలు

దర్శి, అక్టోబరు 13: దర్శి నియోజకవర్గంలో మద్యం షాపుల్లో వాటాల కోసం కొంతమంది వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఎవరికి షాపులు దక్కిన అందులోభాగం సంపాదించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. నియోజకవర్గంలో 23 షాపులు ఉండగా, 382 దరఖాస్తులు దాఖలయ్యాయి. మద్యం షాపులకు సోమవారం లాటరీ తీస్తున్న విషయం తెలిసిందే. ఈ లాటరీలో షాపులు ఎవరికి దక్కుతాయోనన్న ఉత్కంఠత నెలకొంది. నియోజకవర్గంలో అత్యధిక దరఖాస్తులు టీడీపీ సానుభూతిపరులు వేశారు. కొందరు వ్యాపారులు, వైసీపీ సానుభూతిపరులు దరఖాస్తులు వేశారు. కొంతమంది వైసీపీ సానుభూతిపరులు, టీడీపీ నాయకులు వ్యక్తిగత పరిచయాల ద్వారా అంతర్గతంగా వారి మనుషుల ద్వారానే దరఖాస్తులు వేయించారు. షాపులు ఎవరికి దక్కినా అనుకున్న ప్రకారం వాటాలు తీసుకునే విధంగా కొంతమంది మధ్య రహస్య ఒప్పందం కుదిరినట్లే తెలుస్తుంది.

దర్శిలో రియల్ ఎస్టేట్ నుంచి అన్నీ వ్యాపారాలు ఇక్కడ పార్టీలతో సంబంధం లేకుండా అందరూ కలిసి చేస్తుంటారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ సానుభూతిపరులు వ్యాపారం చేయకుండా అడ్డుకున్న విషయం తెలిసిందే. గత ఎన్నికల్లో కొందరు వైసీపీ నాయకులు దురుసుగా ప్రవర్తించి టీడీపీ వర్గీయులపై దాడులుచేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున దూకుడుగా వ్యవహరించిన వైసీపీ నేతలు దరఖాస్తులు వేయలేదు. మిగిలిన కొందరు వైసీపీ నాయకులు టీడీపీ వారితో మిలాఖత్ అయి దరఖాస్తులు వేశారు. ఈక్రమంలో మద్యం షాపులు ఎవరికి దక్కుతాయో, ఆతర్వాత వాటాలు ఎలా పంచుకుంటారో వేచి చూడాలి.

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

పామూరు, అక్టోబరు 13: వాసవీమాత దయ ఉంటే అంత మంచే జరుగుతుందని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక వాసవీమాత దేవస్థానంలో విజయదశమి సందర్భంగా శనివారం సాయంత్రం సతీమణి డాక్టర్ కవితతో కలిసి డాక్టర్ ఉగ్ర వాసవీమాతను దర్శించుకున్నారు. దేవస్థాన ఛైర్మన్ యేల్చూరి బాల కొండలరావు ఆధ్వర్యంలో ఉగ్ర దంపతులకు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఉగ్ర దంపతులను శాలువాతో సత్కరించారు. వాసవీమాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు ఉగ్ర దంపతులు తెలిపారు.

కార్యక్రమంలో బొల్లా నరసింహారావు, సయ్యద్ అమీర్‌బాబు, ఉప్పలపాటి హరిబాబు, కేవీ రమణయ్య, ఇర్రి కోటిరెడ్డి, పందిటి హరీష్, మెంటా నరసింహారావు, గోళ్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విజయదశమి వేడుకలు

» దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

» పోలీసు స్టేషన్లలో ఆయుధపూజలు

» పలుచోట్ల అన్నదానాలు

కనిగిరి, అక్టోబరు 13: మండలంలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహించారు. కనిగిరి పట్టణంలోని దొంతులమ్మ, దొరువులో వెలసిన దుర్గాదేవీ ఆలయాల్లో అమ్మవార్లు విజయదుర్గాదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ సమీపంలోని కేటీఆర్ స్కూల్‌లోని శ్రీలక్ష్మీ నరసింహాస్వామి దేవస్థానంలో నవరాత్రులు ముగింపు సందర్భంగా విజయదశమి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. స్కూల్ ఛైర్మన్ కుందురు తిరుపతిరెడ్డి సతీసమేతంగా చండీహోమం, శమీవృక్ష పూజలు నిర్వహించారు.



ముండ్లమూరు: శంకరాపురంలో ప్రత్యేక అలంకరణలో అద్దంకి నాంచారమ్మ అమ్మవారు

విజయదశమి అందరికీ విజయం చేకూర్చాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శనివారం ఉదయం తిరుపతి శ్రీవెంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మీదేవిలను ఎమ్మెల్యే దంపతులు దర్శించుకున్నారు. సాయంత్రం కనిగిరి పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

దసరా పండుగ సందర్భంగా కనిగిరి సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లలో శని వారం ఆయుధ పూజలు నిర్వహించారు. సీఐ ఖాజావలి కనిగిరి పోలీస్ స్టేషన్‌లో పూజలు చేశారు. ఈ పూజల్లో ఎస్‌ఐ టి.శ్రీరాం, హెచ్ఎంపాడు ఎస్‌ఐ కె.మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దర్శిలో..

దర్శి దసరా ఉత్సవాలు మండలంలో వైభవంగా జరిగాయి. దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో చివరిరోజు శనివారం స్థానిక కనకదుర్గమ్మ గుడి, పోలేరమ్మ గుడి, వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి గుడి, దాద్దాలమ్మ గుడిలో రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. ఈ ఉత్సవాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చివరిరోజు అమ్మవారికి నగరోత్సవం నిర్వహించారు. ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేశారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరు: మండలంలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహించారు. చివరిరోజు శనివారం విజయదశమిని పురస్కరించుకొని భక్తులు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదఉల్లగల్లులోని శివాలయంలో పార్వతిదేవిని, పులిపాడు శివాలయంలో భ్రమరాంబ అమ్మవారిని, పసుపుగల్లులో అన్నపూర్ణదేవి, ఈదర రాజరాజేశ్వరిదేవి, ఈదరలో అష్టపద్మాలం కామమ్మ, శంకరాపురంలో అద్దంకి నాంచారమ్మల కు ప్రత్యేక అలంకరణలు చేశారు. సాయంత్రం పూట అమ్మ వార్లకు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయుధాలను పూజించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దొనకొండలో..



తాళ్లూరులో గ్రామోత్సవం

దొనకొండ: మండలంలో విజయదశమి వేడుకలను శని వారం ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. స్థానిక ఆనంద ఆశ్రమంలో శ్రీ ఈశ్వర మహదేవి రాజరాజేశ్వరీ, జగజ్జననీదేవిగా దర్శనమిచ్చారు. ఈసందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, మండపారాధన, కలశపూజ, లక్ష్మీగణపతి హోమం, చండీ హోమాలు నిర్వహించారు.

తాళ్లూరులో..

తాళ్లూరు: మండలంలో పలుగ్రామాల్లో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. తాళ్లూరులోని కన్యకాపరమేశ్వరి అమ్మవారికి శనివారం గ్రామోత్సవం జరిపారు.ఈ సందర్భంగా కేరళ కళాకారులు నిర్వహించిన కథాకళి డప్పువాయిద్యాలు అలరించారు. బొద్దికూరపాడులో శ్రీగంగా పార్వతి వర్ధిని సమేత సోమేశ్వరస్వామి దేవాలయం, మాధవస్వాముల ఉత్సవిగ్రహాలను అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం రాత్రి తాళ్లూరులోని పార్వతీ సమేతరామలింగేశ్వరస్వామి, రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయాల్లో స్వాములదేవతా మూర్తుల విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి పారువేట వద్దకు వెళ్లి జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఐ.వెంకటేశ్వరరెడ్డి, ఐ.సుబ్బారెడ్డి, కోట క్రిష్ణారెడ్డి, చందోలు రామారావు, కోట మన్నేరెడ్డి, చందోలు అంజనేయులు, అనపర్తి లక్ష్మయ్య, ఆలయకమిటీ ఛైర్మన్ పులి అంజిరెడ్డి, పులి ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



దర్శిలో రాజరాజేశ్వరీ దేవిగా పూజలందుకుంటున్న అమ్మవారు



కనిగిరి: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర దంపతులు

కురిచేడులో..

కురిచేడు: దేవీ నవరాత్రులు మండలంలో వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాల్లో నవరాత్రులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దసరా పండుగ రోజు శనివారరం భక్తుల తో ఆలయాలు పోటెత్తాయి. ఉదయాన్నే ఆలయాలకు వెళ్ళి అమ్మవార్లను దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కురిచేడులో జ్ఞాన ప్రసూనాంబ సమేత కాళ హస్తీశ్వర ఆలయం, వాసవీ ఆలయంలో నవరాత్రులు నిర్వహించారు. వాసవీ అమ్మవారి ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం భారీ ఎత్తున ఏర్పాటుచేశారు. శ్రీనివాస నగర్‌లో ని కనకదుర్గా ఆలయంలో శనివారం గ్రామోత్సవం నిర్వహిం చారు.

పామూరులో..

పామూరు: మండలంలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరిగాయి. స్థానిక శ్రీవల్లీ దేవి సమేత భుజంగేశ్వరస్వామి దేవాలయంలో ఈవో శ్రీగిరిరాజు నర్సింహ బాబు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా శనివారం సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. మాజీ సర్పంచ్ ఎన్వీ నారాయణ ఆర్థిక సహకారంతో పారువేట నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం నిర్వహించి దసరా ఉత్సవాలను ముగించారు.

కార్యక్రమంలో ఛైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, మిట్టపాలెం ఛైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు. వాసవీమాత దేవస్థానంలో ప్రత్యేకపూజలు నిర్వమించారు. శనివారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. అప్పయ్యబావి వద్ద అమ్మవారికి చక్రస్నానాలు నిర్వహించారు.

కార్యక్రమాల్లో దేవస్థాన గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, అధ్యక్షుడు బాలకొండలరావు, తదితరులు పాల్గొన్నారు. అమ్మవారిని బంగారు చీరతో అలంకరణచేశారు.



పామూరులో జరిగిన గ్రామోత్సవం

తూర్పుగంగవరం-తాళ్లూరు

రోడ్డుకు మోక్షం



ప్రారంభమైన ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు

» గత ప్రభుత్వంలో టెండర్ పూర్తయినా వెనకడుగువేసిన కాంట్రాక్టర్

» 'కూటమి' రాకతో పనుల ప్రారంభం

» త్వరలో తీరనున్న ప్రజల అవస్థలు

తాళ్లూరు, అక్టోబరు 13: ఎంతోకాలంగా తాళ్లూరు ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న తూర్పుగంగవరం-తాళ్లూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి చొరవ తీసుకుని ఆశాఖ అధికారులతో మాట్లాడి పనులు ప్రారంభింపజేశారు. తూర్పుగంగవరం- తాళ్లూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు డబుల్ రోడ్డు నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు రూ.6 కోట్ల నిధులకు కృషి చేశారు. 2019 ఎన్నికల కోడ్ రావటంతో ఆ నిధులు విడుదల కాలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఈమార్గంలో బీటీ రోడ్డు నిర్మాణానికి కృషి చేశారు. గత ఏడాది జూలై మాసంలో రూ 4కోట్ల 80లక్షల నిధులు మంజూరయ్యాయి. పనులు చేపట్టేందు టెండర్ వేయగా ఓ సంస్థ టెండర్ దక్కించుకుంది.

అయితే, గత వైసీపీ ప్రభుత్వంలో పనులు చేపట్టినా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటం, తమ మాట ప్రకారం పనులు చేయకపోతే బిల్లులు నిలిపి వేస్తారన్న భయంతో కంటాక్టర్ దాదాపు ఏడాదిన్నర కాలంగా పనులు చేయకుండా మిన్నకున్నారు. కూటమి ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి పనులను వేగవంతం చేశారు. తూర్పుగంగవరం- తాళ్లూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు (సింగిల్‌రోడ్డు) నిర్మాణానికి నిధులు ఉన్నాయని, పనులకు టెండర్ కూడా పూర్తయిందన్న విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆర్‌అండ్‌బీ అధికారులతో, కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. ప్రజలు ఈమార్గం గుండా ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బం దులు పడుతున్నందున వెంటనే పనులు చేపట్టాలని తెలిపారు. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు అప్రమత్తమై పనులు ప్రారంభించారు.

తూర్పుగంగవరం- తాళ్లూరు నడుమ గుంతలమయమైన రోడ్డును ఎక్స్‌కవేటర్‌తో తొలుత లేయర్‌ను తొలగిస్తున్నారు. ఏడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డుకు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చొరవతో మోక్షం లభించింది.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

వెలిగండ్ల, అక్టోబరు 13: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వెలిగండ్ల ఎస్‌ఐ మధుసూదన్‌రావు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఆదివారం మెగళ్ళూరు మలుపు వద్ద తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. ఈక్రమంలో మెగళ్ళూరు గ్రామానికి చెందిన రామ సుబ్బారెడ్డి మోటారుసైకిల్‌పై వెళుతుండగా తనిఖీచేయగా 48 మద్యం సీసాలు పట్టుబడినట్లు చెప్పారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని, మోటారు సైకిల్‌ను సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

పారిశుధ్య కార్మికుడికి ఆర్థికసాయం

పామూరు, అక్టోబరు 13: పామూరు పంచాయతి పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన పంచాయతీ పారిశుధ్య కార్మికుడు కొలసీడి నారాయణ ప్రమాదశాత్తు కాలును పోగొట్టుకున్నాడు. తల్లీదండ్రులులేక మంచానికే పరిమితమై ఉన్న నారాయణ దీనస్థితికి స్పందించిన మానవత సేవా సంస్థ తరుపున రూ.5వేలు, దాతల సహకారంతో రూ.25 వేలు సమకూర్చారు.

మొత్తం రూ.30 వేల నగదును ఆదివారం బాధితుడు నారాయణకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్ కె.రామిరెడ్డి, కన్వీనర్ వి.వెంకటేశ్వరరెడ్డి, అధ్యక్షుడు ఎం.మునలయ్య, ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, కోశాధికారి తోట రమేష్ పాల్గొన్నారు.

అలాగే, టి.వెంకటేశ్వర్లు, ఏ.వెంకటసుబ్బయ్య, ఎం.తిరుపతిరెడ్డి, ఆకుల మాల్యాద్రి, అంచూరి సత్యం రెడ్డి, మితికెల నారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రెండు మద్యం దుకాణాలకు 37 దరఖాస్తులు

పీసీపల్లి, అక్టోబరు 13: మద్యం షాపులకోసం దరఖాస్తుల దాఖల గడువు ఈనెల 11తో ముగిసింది. సోమవారం దుకాణాల కేటాయింపు కోసం ఒంగోలులో లాటరీ తీయనున్నారు. ఈక్రమంలో షాపులు దక్కించుకునేందుకు దరఖాస్తులు చేసుకున్న ఆశావహులు లాటరీలో తమకు అదృష్టం వరిస్తుందో, లేదోనని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. మరికొందరైతే గుడికి వెళ్లి దేవుడిని మొక్కుకుని పూజలు చేయిస్తున్నారు. పీసీపల్లి మండలానికి ప్రభుత్వం రెండు మద్యం షాపులు కేటాయించింది. వీటిని పెదయిర్లపాడు, పీసీపల్లికి కేటాయించారు. ఈ రెండు దుకాణాలకు గాను పెదయిర్లపాడుకు 19 దరఖాస్తులు, పీసపల్లికి 18 దరఖాస్తులు కలిపి మొత్తం 37 దాఖలయ్యాయి.

దాఖలయిన 37 దరఖాస్తులు కూడా వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి దాఖలుచేశారు. ఎవరిపేరున లాటరీ తగిలినా అందరూ కలిసి వ్యాపారం చేసుకోవాలని చర్చించుకుని దరఖాస్తులు చేసినట్లు సమాచారం.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

సోమవారం 14 అక్టోబరు 2024

ముగిసిన దసరా ఉత్సవాలు

ఈ నెల 3న ప్రారంభమైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు శమీ వృక్ష పూజలతో శనివారం రాత్రి ముగిశాయి. తొమ్మిది రోజులు వివిధ అలంకారాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు పదో రోజైన శనివారం శాంతమూర్తి అవతారమైన రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టువస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. దేవతామూర్తులకు ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. జిల్లావాసులు విజయదశమి పర్వదినాన్ని వైభవంగా జరుపుకున్నారు. వేకువజామునుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దీంతో ఆలయాలు కిటకిట లాడాయి. అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి.

- బాపట్ల



బాపట్ల ఎస్పీ కార్యాలయంలో అమ్మవారి విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన ఆయుధాలు



అమృతలూరులో అమ్మవారికి ప్రత్యేక అలంకారం



చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయంలో లలితా త్రిపురసుందరీదేవిగా దుర్గమ్మ

- రేపల్లె



కన్యకా పరమేశ్వరదేవాలయంలో బాలత్రిపురసుందరీదేవిగా కన్యకాపరమేశ్వరి



మరో రెండు రైలు మార్గాలు

- కేంద్రం సూత్రప్రాయంగా అంగీకారం
- సర్వేల దశలో ఉన్న రెండు రైల్వే ప్రాజెక్టులు
- ఇవి ఏర్పాటైతే ఉమ్మడి గుంటూరు జిల్లాకు నలువైపులా కనెక్టివిటీ
- రైల్వే మంత్రి వైష్ణవ్‌తో ఇటీవల సీఎం చంద్రబాబు సమావేశంలో చర్చ

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాకు మరో రెండు కొత్త రైలు మార్గాలు మంజూరు కానున్నాయి. ఇప్పటికే ప్రిలిమి నరీ-కమ్-ట్రాఫిక్, ఫైనల్ లొకేషన్ సర్వేలు పూర్తి చేసుకున్నాయి. అయితే ఈ ప్రాజెక్టులు గత కొన్నేళ్ల నుంచి రైల్వే శాఖ అటకెక్కించింది. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాలు అధికారంలో ఉండటం, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ, జనసేన ఎంపీలపై కేంద్ర ప్రభుత్వం ఆధార పడటంతో అటకెక్కించిన ఆ ప్రాజెక్టులను చేపట్టేందుకు రైల్వే శాఖ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సీఎం చంద్రబాబునాయుడు జరిపిన సమావేశంలోనూ ఈ రెండు ప్రాజెక్టులపై చర్చ జరగడం సానుకూల వాతావరణాన్ని ఏర్పరుస్తున్నది. సాధ్యమైనంత త్వరగా వీటిని రైల్వే కేటాయింపులు (పింక్‌బుక్)లో చేర్చి నిధులు మంజూరు చేస్తే మూడు, నాలుగేళ్లలో ప్రాజెక్టులు పూర్తి అయ్యే అవకాశం ఉన్నది.

మచిలీపట్నం - రేపల్లె - బాపట్ల

మచిలీపట్నం-రేపల్లె నూతన రైలుమార్గం నిర్మాణం చేయాలన్నది దశాబ్దాలుగా తీర ప్రాంతాల ప్రజల ఆకాంక్ష. ఈ రెండు పట్టణాల మధ్య కేవలం 45.30 కిలోమీటర్ల దూరం ఉన్నది. రైలుమార్గంతో కలిపితే పలు రైళ్లని చుట్టూ తిరిగి విజయవాడ వైపునకు వెళ్లకుండా రేపల్లె-తెనాలి మీదగా మళ్లించొచ్చు. పైగా చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రముఖ నగరాలకు ప్రయాణ దూరం కూడా తగ్గుతుంది. అయితే ఈ మార్గంలో క్లిష్టమైన కృష్ణా నదిపై మూడు కిలోమీటర్ల దూరం పైగా వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకు కారణం ఇక్కడ కృష్ణానది వెడల్పు పాయలు గా విడిపోయి ఎక్కువగా ఉంటుంది. అయినా ఎట్టకేలకు గత ఆగస్టు నెల 20న ఫైనల్ లొకేషన్ సర్వేని రైల్వేశాఖ మంజూరు చేసింది. ఈ సర్వే పూర్తి అయితే రైలు మార్గం నిర్మాణం చేపట్టడానికి వీలు కలుగుతుంది. రేపల్లె - బాపట్ల నూతన రైలుమార్గం ప్రిలిమినరీ ఇంజనీరింగ్- కమ్- ట్రాఫిక్ సర్వే కూడా మంజూరైంది. దీనిని నిజాంపట్నం పోర్టు మీదగా సర్వే చేసి రిపోర్టు కూడా పంపించారు. రూ.792.33 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. రేట్ ఆఫ్ రిటర్న్స్ చూసుకుంటే -8.72 శాతంగా రావడంతో రైల్వే శాఖ 2017లోనే దీనిని అటకెక్కించింది. ఇప్పుడు సరుకు రవాణాకు సదుపాయాలను పెంచుతుండటంతో ఈ ప్రాజెక్టుని చేపట్టేందుకు రైల్వే మంత్రి అంగీకరించినట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు.

తెనాలి - రేపల్లె మధ్య డబ్లింగ్..

తెనాలి-రేపల్లె మధ్యన డబ్లింగ్, విద్యుద్దీకరణ ప్రాజెక్టుకు సంబంధించి ప్రిలిమినరీ ఇంజనీరింగ్ కమ్ ట్రాఫిక్ సర్వే 2015 లోనే పూర్తి అయింది. దీనికోసం రూ.259.91కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే రేట్ ఆఫ్ రిటర్న్స్ -25.35 శాతంగా ఉండటంతో రైల్వేశాఖ పక్కన పెట్టేసింది. దీనిని కూడా ఇప్పుడు చేపట్టేందుకు రైల్వేశాఖ అంగీకారం తెలిపింది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాకు రెండు కొత్త రైలు మార్గాలతో పాటు ఒక డబ్లింగ్ రాబోతున్నది.

లిక్కెవరికో?

- దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ
- మద్యం షాపులకు నేడు లాటరీ
- ఉదయం 7 నుంచి ప్రక్రియ ప్రారంభం
- బాపట్లలో 117 షాపులకు 2149 దరఖాస్తులు
- పల్నాడు జిల్లాలో 129 దుకాణాలకు 2639..
- గుంటూరులో 127 షాపులకు 4448 దరఖాస్తులు

బాపట్ల, నరసరావుపేట(ఆంధ్రజ్యోతి), గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 13: ఇప్పటివరకు మద్యం విక్రయాలను ప్రభుత్వం చేపట్టగా ఆ స్థానంలో వ్యాపారులు రానున్నారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో మద్యం వ్యాపారంపై ఆసక్తి ఉన్న వారి నుంచి ప్రభుత్వం దుకాణాల వారీగా దరఖాస్తులను స్వీకరించింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో దుకాణాలకు పలువురు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ నెల 1 నుంచి ప్రారంభమైన ఈ దరఖాస్తుల ప్రక్రియ సోమవారం జరగనున్న లాటరీ అంకంతో ఓ కొలిక్కి రానుంది. సిండికేట్ మంతనాలు.. స్థానికేతరుల అంశంలో బెదిరింపులు.. ఇలా ఎన్నో ప్రతిబంధకాల మధ్య పది రోజులకు పైగా దరఖాస్తుల ప్రక్రియ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సాగింది. శుక్రవారం రాత్రితో దరఖాస్తుల అంకం ముగియగా శని, ఆదివారాల్లో పరిశీలనలు జరిగాయి. ఆయా దరఖాస్తుల లాటరీ సోమవారం జిల్లా కేంద్రాల్లో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే అదృష్టం ఎవరిని వరిస్తోందోనని రూ2 లక్షలు ఫీజు కట్టి దుకాణాలకు దరఖాస్తులు చేసుకున్న వారిలో ఉత్కంఠ నెలకొంది. దరఖాస్తుదారులు ఉదయం 7 గంటలకే లాటరీ తీసే కేంద్రాలకు రావాలని 8 గంటల నుంచి ప్రక్రియ ప్రారంభమవుతుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. దరఖాస్తుదారులు మాత్రమే రావాలని బయటవారెవరికీ దానిలోకి ప్రవేశం లేదని అధికారులు తెలిపారు. మొత్తం ప్రక్రియ కలెక్టర్, జేసీల సమక్షంలో జరుగుతుందని,



ప్రసంగిస్తున్న గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు, పక్కన ఏసీ రవికుమార్ రెడ్డి, ఈఎస్ అరుణకుమారి

వీడియోగ్రఫీ కూడా తీస్తామని చెప్పారు. లాటరీలో షాపు దక్కించుకున్న వారికి 15న లైసెన్సులు అందిస్తామన్నారు. లాటరీలో అదృష్టం వరించిన వ్యాపారి రెండు రోజుల్లో షాపు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు తెలిపారు.

16 నుంచి ప్రైవేట్ మద్యం షాపులు ప్రారంభం

కానున్నాయి. లాటరీ తీసే కేంద్రాల వద్ద ప్రత్యేకంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. లాటరీ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ చర్యలు చేపట్టారు. బాపట్ల జిల్లాలోని 117 షాపులకు 2149 దరఖాస్తులు వచ్చాయి. సగటున ఒక్కో షాపునకు 18 దరఖాస్తులు వచ్చినట్లైంది. గుంటూరు జిల్లాలోని 127 షాపులకు అత్యధికంగా 4448 దరఖాస్తులు వచ్చాయి. సగటున ఒక్కో షాపునకు 35 దరరఖాస్తులు వచ్చినట్లైంది. పల్నాడు జిల్లాలో మొత్తం 129 షాపులకు 2,639 దరఖాస్తులు దాఖలు కాగా సగటున ఒక్కో షాపునకు 20 దరఖాస్తులు వచ్చినట్లైంది. మద్యం షాపుల కేటాయింపులో నెలకొన్న ఉత్కంఠకు మరి కొద్ది గంటల్లో తెరపడనున్నది. పల్నాడు ప్రాంతంలో ఒక్కో వ్యాపారి పది షాపుల వరకు దరఖాస్తులు దాఖలు చేశారు. కొందరు వ్యాపారులు గ్రూపుగా ఏర్పడి దరఖాస్తులు వేశారు. ఏ షాపు ఎవరికి దక్కుతుందోన్న ఉత్కంఠ దరఖాస్తుదారుల్లో నెలకొంది.

- బాపట్ల జమ్ములపాలెం రోడ్డులోని ఎమ్మెస్సార్ కల్యాణ మండపంలో లాటరీ ప్రక్రియ సోమవారం జరగనున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ దేవదత్తు తెలిపారు. స్టేషన్ల వారీగా లాటరీ తీయడం జరుగుతుందని, ఇందుకు 2 కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. కల్యాణమండపం వద్ద 120 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేశారు.
- నరసరావుపేట ప్రకాష్‌నగర్‌లోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో మద్యం షాపుల లాటరీ తీయనున్నారు. లాటరీ నిర్వహణ ఏర్పాట్లను ఎక్సైజ్ ఈఎస్ మణికంఠ పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు లాటరీ తీయనున్నారు.
- గుంటూరు జిల్లాకు సంబంధించి గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో లాటరీ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు గుంటూరు ఎక్సైజ్ డీసీ డాక్టర్ కే శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు కౌంటర్ల ద్వారా లాటరీ నిర్వహిస్తామన్నారు. ఒక కౌంటర్‌కు కలెక్టర్, మరో కౌంటర్‌కు జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ ప్రక్రియ జరుగుతుందన్నారు. సమావేశంలో ఏసీ రవికుమార్‌రెడ్డి, గుంటూరు ఈఎస్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



బాపట్ల: ఎమ్మెస్సార్ కల్యాణమండపం వద్ద లాటరీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

విజేతలు వెంటనే ఫీజు చెల్లించాలి..

దుకాణాలకు వచ్చిన దరఖాస్తుల నుంచి లాటరీ తీసి లైసెన్సు పొందిన వారి పేర్లను అధికారులు ప్రకటించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. లాటరీతో పాటు లైసెన్సుల జారీ చేసే ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని ఎక్సైజ్ శాఖ చెబుతోంది. లైసెన్సులు జారీకి షాపుల వారీగా వచ్చిన దరఖాస్తులను లాటరీ తీసి విజేతను ఎంపిక చేస్తారు. దీనితో పాటు మరో ఇద్దరిని రిజర్వుగా ఎంపిక చేయనున్నారని తెలిసింది. లాటరీలో లైసెన్సు దక్కించుకున్న వారు వెంటనే నిర్దేశిత మొత్తాన్ని ఎక్సైజ్ శాఖకు చెల్లించాలి. ఇలా సకాలంలో ఎవరైనా నగదు చెల్లించకపోవడంతో పాటు ఏదైనా అత్యవసర కారణాల వల్ల లాటరీలో షాపు వరించిన వ్యక్తి పక్కకు తప్పుకుంటే నిబంధనల ప్రకారం రిజర్వులో ఉన్న తొలి వ్యక్తికి అవకాశం కల్పించనున్నారు. బ్యాంకర్లను కూడా ఆయా వేదికల వద్దే ఏర్పాటు చేశారు. లాటరీలో గెలుపొందిన వ్యక్తి షాపు దరావత్ ఫీజులో 1/6 వంతు అప్పటికప్పుడు అక్కడే చెల్లించే విధంగా సౌకర్యం కల్పించామన్నారు.

లైసెన్సును మార్చడానికి వీల్లేదు

తెరవెనక బేరసారాలతో లాటరీలో విజేత నుంచి లైసెన్సును పొందడం సాంకేతికంగా చెల్లదని ఎక్సైజ్ శాఖ చెబుతోంది. ఒక వేళ ఏదైనా సహేతుక కారణాలతో లైసెన్సును వేరే వారిపేరు మీదకు మార్చాలనుకున్నా అది జీపీఏ రూపంలోనే వర్తిస్తుందని దానికి కూడా దరఖాస్తుదారుడు లక్షల్లోనే అదనపు రుసుం చెల్లించాల్సి వస్తుందని అధికారులు తెలిపారు. లాటరీ, దుకాణం ఏర్పాటు ప్రక్రియ మార్గదర్శకాలకు అనుగుణంగానే జరుగుతుందని ఎలాంటి అవకతవకలకు ఆస్కారం ఉండదన్నారు. లాటరీలో విజేతలుగా నిలిచినవారు మాత్రమే షాపు పెట్టుకోవడానికి అర్హులని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

బేరసారాలకు రంగం సిద్ధం..

మద్యం వ్యాపారాన్ని చేజిక్కించుకునేందుకు దుకాణాల దరఖాస్తుల ప్రక్రియలో పాలకపార్టీ నేతలు జోక్యం చేసుకున్నారు. దీంతో చాలాదగ్గర్ల దరఖాస్తులు వేసేందుకు వ్యాపారులు వెనుకంజ వేశారు. ఈ పరిస్థితుల్లో నేతల తీరుపై టీడీపీ అధిష్టానం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో సిండికేట్ ప్రతిపాదనల నుంచి నేతలు వైదొలిగారు. దాని ఫలితమే గడువు పొడిగించిన చివరి రెండు రోజుల్లో దరఖాస్తుల సంఖ్య పెరిగింది. అయితే ఆయా నేతల కన్ను ప్రస్తుతం లాటరీలో షాపు దక్కించుకునే వారిపై పడినట్లు తెలిసింది. బాపట్ల జిల్లాలో నేతల దృష్టంతా లైసెన్సుల దక్కేవారిపై ఉన్నట్లు సమాచారం. లైసెన్సును టోకుగా కైవశం చేసుకోవడమో లేదంటే తాము సూచించిన వ్యక్తులను భాగస్వాములుగా చేర్చుకునే విధంగా విజేతలతో మంతనాలు జరపడానికి జిల్లాలో నేతలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

పల్లెల్లో అభివృద్ధి పండుగ

- నేటి నుంచి 20 వరకు వారోత్సవాలు
- ప్రతీ గ్రామంలో వివిధ పనులకు శంకుస్థాపనలు
- బాపట్ల జిల్లాలో 600 పనులకు రూ.72 కోట్లతో శ్రీకారం
- పల్నాడు జిల్లాలో 9,397 పనులు.. వ్యయం రూ.286.15 కోట్లు
- గుంటూరు జిల్లాలో 166 పనులకు రూ.14.35 కోట్ల మంజూరు

బాపట్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యం.. నిధుల లేమి.. కేంద్రం నిధుల దారిమళ్లింపు.. సచివాలయాలతో ఉత్సవ విగ్రహాలుగా మారిన పంచాయతీలు.. మొత్తం మీద వైసీపీ పాలనలో పల్లెలు అభివృద్ధి లేక కుంటుపడిపోయాయి. ఈ పరిస్థితుల్లో పంచాయతీలను పురోగమన బాట పట్టించడానికి కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులేస్తోంది. పంచా యతీలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా ఆగస్టులో ఒకేరోజు గ్రామసభల నిర్వహణ.. సమస్యలపై వినతుల స్వీకరణ.. అభివృద్ధి పనులపై తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమానికి కొనసాగింపుగా సోమవారం నుంచి వారం రోజులు పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ పండుగ వారోత్సవాల్లో గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేయనున్నారు. పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల నిర్వహణకు గ్రామాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి 20వ తేదీ వరకు ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం రోజుకు 15 గ్రామాలకు తగ్గకుండా అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు ప్రణాళికలు రూపొందించారు. రోడ్లు, మురుగుకాల్వలు, తాగునీరు వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించనున్నారు. 15వ ఆర్థిక సంఘం, ఉపాధి హామీ పథకం కింద పల్లెలో ప్రగతి పనులకు సోమవారం నుంచి శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటికే ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పనులను గుర్తించి అంచనాలను కూడా అధికారులు రూపొందించారు. గ్రామాల వారీగా మొత్తం 46 రకాల పనులకు ఆమోదం తీసుకున్నారు. ఆయా పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేసి ప్రారంభోత్సవాలు చేస్తామని అధికారవర్గాలు తెలిపాయి. ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణ నిమిత్తం ఆగస్టు 23న జరిగిన గ్రామసభల్లో ప్రజాభిప్రాయం మేరకు తీర్మానాలు కూడా చేశారు.

- గుంటూరు జిల్లాలోని 166 గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ.14.35 కోట్లను ప్రభుత్వం విడుదల చేయనుంది. తొలి రోజున మంగళగిరి నియోజకవర్గంలో గొడవర్రు, పెదకొండూరు, వీర్లపాలెం, పొన్నూరు నియోజకవర్గంలో మాచవరం, ములుకుదురు, నండూరు, శేకూరు, వీరనాయకునిపాలెం, ప్రత్తిపాడు నియోజకవర్గంలో జొన్నలగడ్డ, ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గంలో దామరపల్లి, కంతేరు, ఫణిదరం, పొన్నెకల్లు, తెనాలిలోని అంగలకుదురు, చావావారిపాలెం గ్రామాల్లో జరగనున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు స్థానిక ఎమ్మెల్యేలు హాజరౌతారని డ్వామా అధికారులు తెలిపారు.
- బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న 458 పంచాయతీల పరిధిలో 600 పనులకు రూ.72కోట్ల వ్యయం చేయనున్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో సంతమాగులూరు మండలం ఏల్చూరులో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొననున్నారు. చుండూరు మండలం యడ్లపల్లిలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు పలు పనులకు భూమి పూజ చేయనున్నారు
- పల్నాడు జిల్లాలో రూ.286.15 కోట్లతో 9,397 పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.



దుష్టశిక్షణ.. శిష్టరక్షణకు కట్టుబడాలి

- దసరా ఆయుధ పూజలో ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల, అక్టోబరు 13: దుష్ట శిక్షణ.. శిష్టరక్షణకు కట్టుబడి ఉండాలని పోలీసులకు ఎస్పీ తుషార్‌డూడీ సూచించారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలోని ఏఆర్ విభాగంలో శనివారం జరిగిన ఆయుధ పూజలో ఎస్పీ పాల్గొన్నారు. అమ్మవారి విగ్రహం వద్ద ఆయుధాలు ఉంచి శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. పోలీసు వాహనాలకు కూడా పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా వ్యవహరించాలన్నారు. విజయాలకు చిహ్నమైన విజయదశమి అందరికీ సుఖసంతోషాలు కలిగించాలని ఎస్పీ ఆకాంక్షించారు. అన్ని విషయాలలో విజయవంతంగా ముందుకు సాగుతూ పోలీసుశాఖ ప్రతిష్ఠను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎస్.చంద్రమోహన్, ఎస్‌టీ సీఐ జి.నారాయణ, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, సీసీ హరికృష్ణ, పట్టణ, రూరల్ సీఐలు, అధికారులు పాల్గొన్నారు.



పోలీసు కార్యాలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ



పోలీసు వాహనాల వద్ద పూజలు చేస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

ఊరూరా అభివృద్ధి సంబరం



నేటి నుంచి పల్లె పండుగ

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యక్రమం

వారం రోజులపాటు భారీగా శంకుస్థాపనలు

జిల్లాలో సుమారు రూ.126 కోట్ల పనులు

సిమెంటు రోడ్లు, డ్రైన్లు అధికం

పెట్లూరులో ప్రారంభించనున్న మంత్రి స్వామి

ఎక్కడికక్కడ పాల్గొననున్న ప్రజాప్రతినిధులు

సంక్రాంతి నాటికి పనుల పూర్తే లక్ష్యం

గ్రామీణ ప్రాంతాల్లో పెద్దఎత్తున మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పల్లె పండుగ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించింది. సోమవారం నుంచి ఊరూరా సంబరంలా ప్రారంభమయ్యే కార్యక్రమం వారంరోజులపాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా రోడ్లు, డ్రైన్లు, ఇతరత్రా అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేయనున్నారు. అందుకోసం జిల్లాకు ప్రభుత్వం సుమారు రూ.126 కోట్లు మంజూరు చేసింది. పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని నిర్దేశించింది. డ్వామా పర్యవేక్షణలో పంచాయతీరాజ్, డ్వామా అధికారులు, సిబ్బంది ఈ పనులు చేపట్టనున్నారు.

ఒంగోలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్లు, ఇతరత్రా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. యంత్రాంగం గ్రామాల వారీ పనులు గుర్తించి అంచనాల తయారు చేయగా వాటిని అనుమతులు కూడా ఇచ్చింది. వీటిని సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని నిర్దేశించింది. వీటి ప్రారంభం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 14నుంచి20 వరకు వారం రోజులపాటు పల్లె పండుగ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. విధివిధానాలు, వారం రోజులపాటు కార్యక్రమ నిర్వహణ, పనుల పూర్తి తదితర అంశాలపై ఇటీవల ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మార్గదర్శకం చేశారు. సోమవారం కొండపి మండలం పెట్లూరులో మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఎక్కడికక్కడ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

గ్రామ సభల్లో 31వేలకుపైగా పనుల గుర్తింపు

ఉపాధి హామీ పథకం మెటీరియల్ నిధుల అనుసంధానంతో సిమెంటు, తారురోడ్లు, డ్రైన్లు ఇతర భూ, నీటి సంరక్షణ పనులు చేయాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. వీటి గుర్తింపు కోసం ఈ ఏడాది ఆగస్టు 23న రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజు గ్రామసభలు నిర్వహించింది. అప్పుడు గుర్తించిన పనులకు అధికారులు గత నెల 2 వరకూ అంచనాలు రూపొందించారు. వాటికి కలెక్టర్ ఆమోదం తెలిపి పరిపాలనా ఉత్తర్వులు ఇచ్చారు. అలా జిల్లాలోని 729 గ్రామాల్లో సభలు నిర్వహించగా అన్ని రకాలు కలిపి సుమారు రూ.286.22 కోట్ల విలువైన 31వేలకు పైగా పనులు చేపట్టాల్సి ఉందని గుర్తించారు. అందులో దాదాపు రూ.112 కోట్ల విలువైన వెయ్యి వరకు సిమెంట్ రోడ్లు ఉన్నాయి.

ఉపాధి మెటీరియల్ నిధుల కేటాయింపు

జిల్లాలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ నిధులు సుమారు రూ.170 కోట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో నియోజకవర్గానికి రూ.15 కోట్ల వంతున గత నెలలో కలెక్టర్ కేటాయించారు. పనులను మంజూరు చేశారు. వాటిలో రూ.126.19కోట్ల విలువైన 1,168 పనులకు పల్లెపండుగ సందర్భంగా భూమి పూజ చేయనున్నారు. అందులో సిమెంట్ రోడ్లు, బీటీ రోడ్లు, డబ్ల్యూఎంరోడ్లు, కల్వర్టులు తదితర పనులు ఉన్నాయి. దీంతో తక్షణం ఆ పనులు చేపట్టే విధంగా క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై డ్వామా, పంచాయతీ రాజ్ అధికారులు దృష్టి సారించారు.

ప్రజాప్రతినిధులు సూచించిన వారికే పనులు

ప్రతిపాదిత పనుల్లో అత్యధికం రూ.5 లక్షల నుంచి 20 లక్షల విలువైనవి ఉన్నాయి. వీటిని ఎక్కడికక్కడ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సూచించిన వారికి కట్టబెట్టే అవకాశం ఉంది. ఎక్కువ పనులకు పల్లె పండుగలో ఎమ్మెల్యేలే నేరుగా శంకుస్థాపనలు చేసేలా వారం రోజుల షెడ్యూల్‌ను డ్వామా అధికారులు రూపొందిస్తున్నారు. వీటిని సంక్రాంతి నాటికి పూర్తి చేసి అప్పుడు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఒకేసారి భారీగా పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఇసుక, సిమెంటు, ఇతరత్రా సామగ్రి కొరత లేకుండా చూడాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు.

నేడు జిల్లాలో 170 పనులకు భూమి పూజ

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో జిల్లాలోని 57 గ్రామ పంచాయతీల్లో 170 పనులకు సోమవారం భూమి పూజ నిర్వహిస్తున్నట్లు డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పల్లె పండుగలో భాగంగా ఈ పనులను కొండపి, కనిగిరి, దర్శి, సంతనూతలపాడు, ఒంగోలు, గిద్దలూరు, ఎర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గాల్లో జిల్లాకు చెందిన మంత్రి స్వామి, శాసనసభ్యులు ప్రారంభిస్తారన్నారు.



మద్యం దుకాణాలకు దరఖాస్తుల వెల్లువ

- **చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 24 షాపులకు 451**
- **పలువురు మహిళలూ దాఖలు**

చీరాల, అక్టోబరు 13 : మద్యం దుకాణాల లైసెన్స్‌లకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. అందులో మహిళలు కూడా దరకాస్తుదారులుగా ఉండడం విశేషం. తొలుత సిండికేట్లుగా మారి ఎక్కువ దరఖాస్తులు రాలేదని, దరఖాస్తు గడువును ప్రభుత్వం రెండు రోజులు పెంచింది. ఈ క్రమంలో నిర్ణీత అంచనాలకు దగ్గరదగ్గరగా దరఖాస్తులు అందాయి. చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో చీరాల అర్బన్, చీరాల, వేటపాలెం, చినగంజాం, కారంచేడు మండలాల పరిధిలో మొత్తం 24 మద్యం దుకాణాల లైసెన్స్‌కు దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ క్రమంలో కొన్ని దుకాణాలకు మహిళలు కూడా దరఖాస్తు చేయడం విశేషం. మొత్తం 24 దుకాణాలకుగాను 451 దరఖాస్తులు అందాయని, అందులో 41 ఆఫ్‌లైన్లో, 410 ఆన్‌లైన్‌లో అందాయని, వీటిలో మహిళల పేరుపై కూడా దరఖాస్తులు అందాయని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం లాటరీ పద్ధతిలో దుకాణాల లైసెన్స్‌లను ఎంపిక చేస్తారు. వెంటనే తాత్కాలిక లైసెన్స్‌ను మంజూరు చేస్తారు. 16వ తేదీ నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి వస్తుంది. నిర్ణీత నిబంధనలన్నీ పూర్తయిన తరువాత పూర్తి లైసెన్స్‌లు మంజూరు చేస్తారు. ఈ క్రమంలో తమకే తాము కోరుకున్న షాపులకు లైసెన్స్ రావాలని వారివారి ఇష్టదైవాలను దరఖాస్తుదారులు వేడుకుంటున్నారు. ఇదిలావుంటే కొందరు లాటరీ పద్ధతిలో చేతివాటం ప్రదర్శించి తమ పేర్లు వచ్చేలా ఏమన్నా మార్గం ఉందా అనే కోణంలో కూడా చర్చలు జరుపుకుంటున్నారు.

ఆ షాపు మాకే వస్తుంది.. మేమే తీసుకుంటాం

చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఉన్న 24 మద్యం దుకాణాలకు సంబంధించి కొన్ని దుకాణాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆ దుకాణాల్లో ప్రతి రోజు అత్యధికంగా మద్యం కొనుగోళ్లు జరుగుతాయి. దీంతో కమీషన్ ద్వారా వచ్చే ఆదాయం ఎక్కువగా ఉంటుంది. ఆ దుకాణాలను తామే తీసుకుంటామని కొందరు ముందస్తుగా ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. కొందరు అడ్వాన్స్‌లు కూడా ఇస్తున్నారు. ఆ షాపు లైసెన్స్ అడ్వాన్స్ ఇచ్చిన వారికి వస్తేసరి. లేదంటే అడ్వాన్స్ తిరిగి ఇచ్చే పనిలేదు. దీంతో అత్యధిక సేల్స్ ఉండే వాటి గిరాకీని దృష్టిలో పెట్టుకొని ఆయా దుకాణాల యజమానులు వీలైనంత ఎక్కువ మొత్తం రాబట్టుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. లాటరీ అనంతరం ఏ షాప్ ఎవరికి వస్తుందో తేలనుంది.

లక్కీ లాటరీ

నేడు మద్యం దుకాణాల కేటాయింపు

ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో రెండు కౌంటర్లు ఏర్పాటు

డమ్మీ విధానాన్ని పరిశీలించిన కలెక్టర్ అన్సారియా, అధికారులు

ఒంగోలు (క్రైం), అక్టోబరు 13 : మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ ప్రక్రియను సోమవారం నిర్వహించనున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను ఎక్సైజ్ అధికారులు పూర్తి చేశారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో ఉదయం 8 గంటలకు ప్రక్రియను ప్రారంభించనున్నారు. లక్కీ లాటరీ తగిలిన వారికి షాపులను కేటాయించనున్నారు. తొలుత నగరంలోని ఎన్‌జీవో హోంలో ఏర్పాట్లు చేశారు. అక్కడ ప్రైవేటు కార్యక్రమాలు ఉండటంతో వేదికను అంబేడ్కర్ భవన్‌కు మార్చారు. లాటరీ నిర్వహణ కోసం రెండు టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఆదివారం కలెక్టర్, ఎక్సైజ్ అధికారులు డమ్మీ లాటరీ తీసి పరిశీలించారు.

171 దుకాణాలకు 3,466 దరఖాస్తులు

జిల్లాలో మొత్తం 171 దుకాణాలకు నోటిఫికేషన్ ఇవ్వగా 3,466 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు ఫీజు ద్వారా రూ 69.32 కోట్ల మేర ఆదాయం లభించింది. లాటరీకి రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఒంగోలు, చీమకుర్తి, సింగరాయకొండ, పొదిలి, దర్శి సర్కిళ్లకు ఒకటో నంబర్ టేబుల్, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, కంభం, యర్రగొండపాలెం రెండో నంబర్ టేబుల్‌పై లాటరీ తీయనున్నారు. అదృష్టం వరించిన వారికి అక్కడిక్కడే దుకాణాన్ని కేటాయించనున్నారు. వీరు ఈనెల 14 నుంచి షాపును తెరిచి వ్యాపారం చేసుకోవచ్చు. మద్యం దుకాణం కోసం దరఖాస్తు చేసుకున్న వారి అనుమతితో ఎవరినైనా లాటరీకి అనుమతిస్తారు. వారికి టోకెన్లు ఇస్తారు. కలెక్టర్‌తో కలిసి ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్‌నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఏఈఎస్‌లు డి.బాలయ్య, వై.వెంకట్, ఎ.జనార్దన్‌రావు సిబ్బంది అబేడ్కర్ భవన్‌లో ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు.

సింగరాయకొండ సర్కిల్‌లో ఎక్కువ దాఖలు

జిల్లాలో మొత్తం 171 మద్యం దుకాణాలకు 3,466 దరఖాస్తులు వచ్చాయి. అంటే ఒక్కో షాపుకు సగటున 27.57 దరఖాస్తులు అందాయి. సింగరాయకొండ సర్కిల్‌లో 14 దుకాణాలకు ఒక్కోదానికి సగటున 27.57 చొప్పున అత్యధికంగా 386 వచ్చాయి. అతి తక్కువగా దర్శి సర్కిల్‌లో 23 దుకాణాలకు 382 (సగటున 16.60) దాఖలయ్యాయి. ఒంగోలులో 34 దుకాణాలకు 607, గిద్దలూరులో 13 షాపులకు 232 దరఖాస్తులు అందాయి. ఈ రెండు సర్కిళ్లలోనూ ఒక్కో షాపునకు సగటున 17.85 దాఖలయ్యాయి. మార్కాపురంలో 13 దుకాణాలకు 327 (25.15), కంభంలో 10 షాపులకు 240 (సగటున 24) దరఖాస్తులు వచ్చాయి. కనిగిరి సర్కిల్ పరిధిలో 19 దుకాణాలకు 391 (20.57), చీమకుర్తి సర్కిల్‌లో 16 మద్యం దుకాణాలకు 353 (22.06) దరఖాస్తులు సమర్పించారు. పొదిలి సర్కిల్ పరిధిలో 16 దుకాణాలకు 297 (18.56), యర్రగొండపాలెంలో 13 షాపులకు 255 (20.27) దాఖలు చేశారు.

అన్ని ఏర్పాట్లు చేశాం

మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ ప్రక్రియ సోమవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజామొహిద్దీన్ తెలిపారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. ప్రాంగణమంతా వాటర్ ప్రూఫ్ టెంట్లు వేయించడంతోపాటు దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని లాటరీ ప్రక్రియను తిలకించేందుకు ఎల్ఈడీ స్ర్కీన్‌లను కూడా ఏర్పాటు చేశామన్నారు.

- ఈఎస్, ఖాజామోహిద్దీన్

అధికారుల ఆదేశాలు బేఖాతర్

- **నూనె ధరలు పెంచి విక్రయం**

చీరాలటౌన్, అక్టోబరు 13 : అనూహ్యంగా పెరిగిన వంట నూనెల ధరలను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు తక్కువ ధరకే అందించాలని అధికారులు కంకణం కట్టుకున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఇది అమలు జరగడం లేదు. ప్రత్యేక కౌంటర్లలో సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.125, పామాయిల్ రూ.115కు విక్రయించాలని సూచించారు. దీనిపై ఆంధ్రజ్యోతి పరిశీలించగా పట్టణంలోని మహాలక్ష్మీ ఆయిల్ అండ్ జనరల్ ట్రేడర్స్, సాయి ఆయిల్ ట్రేడర్స్ వారు రూ.125కు బదులు రూ.135కు విక్రయిస్తున్నారు. దీనిపై నిర్వాహకులను వివరణ కోరగా అధికారుల సూచనలను తోసిపుచ్చారు. గిట్టుబాటు కాని ధరలకు అమ్మకాలు చేయలేమంటూ సమర్థించుకుంటున్నారు. అధికారులు సూచించిన ధరలకు నాణ్యత లేని ఆయిల్ మాత్రమే ఇవ్వగలమని చెప్తున్నారు. అధికారులు వీటిపై దృష్టి సారించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నీటి కుంటలో పడి ఉన్న మృతదేహం (ఇన్‌సెట్లో) పులి శ్రీనివాసరావు (ఫైల్)

వ్యక్తి అనుమానాస్పద మృతి

- **వేర్వేరుగా పరామర్శించిన ఎమ్మెల్యే కొండయ్య, మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం**

వేటపాలెం(చీరాల)/చీరాలటౌన్, అక్టోబరు 13 : చీరాల మండలం కీర్తివారిపాలెం సమీపంలో నిర్మాణంలో ఉన్న వాడరేవు, పిడుగురాళ్ల రోడ్డు కల్వర్టు పక్కనున్న నీటి కుంటలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో ఆదివారం మృతి చెందాడు. అతడిని వేటపాలెం మండలం పాపాయిపాలెంకు చెందిన పులి శ్రీనివాసరావు(42)గా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ శేషగిరిరావు తెలిపారు. మృతిపై కుటుంబ సభ్యులు, గ్రామస్థులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం జరిగింది. కుమారుడు చదువుకుంటున్నాడు. మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యలు వేర్వేరుగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఘటనపై విచారణ జరపాలి : మాజీ ఎమ్మెల్యే

ఈ ఘటన బాధాకరమని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పోలీసులను కోరారు. కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులతో కలసి బలరాం ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

అండగా ఉంటాం : ఎమ్మెల్యే కొండయ్య

పులి శ్రీనివాసరావు మృతదేహానికి ఆదివారం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అన్ని విధాలా అండగా అండగా ఉంటామని, అధైర్యపడొద్దని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిడ్డకు జన్మనిచ్చి మృత్యు ఒడిలోకి తల్లి

చీరాలటౌన్, అక్టోబరు 13 : బిడ్డ పుట్టినట్లు తల్లికి తెలియదు..తల్లి కానరాని లోకానికి చేరిందని బిడ్డకు తెలియదు.. ఈ హృదయ విదారక ఘటన వేటపాలెం మండల పరిధిలోని సర్వోదయ కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మఠం కోటేశ్వరి(30) వెంకటేశ్వర్లు దంపతులు. వీరు ఒంగోలు బాలాజీనగర్‌కు చెందిన సంచార జాతికి చెందిన వారు. ఇప్పటికే వీరికి ముగ్గురు పిల్లలు. కొంతకాలంగా వీరు వేటపాలెం మండలంలోని సర్వోదయ కాలనీలో ఉంటున్నారు. నెలల నిండిన గర్భిణి ఇంట్లో ఉండగా గత శుక్రవారం భర్త బయట పనికి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి తీవ్ర రక్తస్రావంతో భార్య మగ బిడ్డకు జన్మనిచ్చి మృతి చెందింది. దీంతో భర్త దిక్కుతోచని స్థితిలో ఉండగా సమాచారం అందుకున్న స్థానిక ఆరోగ్య సిబ్బంది వేటపాలెం పోలీసుల సహకారంతో మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అలాగే బిడ్డకు ఏరియా హాస్పిటల్‌లో చికిత్స అందిస్తున్నారు. ఘటనపై వేటపాలెం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది, చైల్డ్ హెల్ప్‌లైన్ వారు సోమవారం హాస్పిటల్‌కు చేరుకుని విషయాన్ని సంయుక్తంగా పరిశీలిస్తున్నారు.



చిన్నారి

'ప్రకాశం'కు భారీ వర్ష సూచన

రేపు, ఎల్లుండి కురిసే అవకాశం

వాతావరణ శాఖ హెచ్చరిక

యంత్రాంగం అప్రమత్తం

తీరప్రాంత మండలాలకు ప్రత్యేకాధికారుల నియామకం

కలెక్టరేట్‌లో 1077తో కంట్రోల్ రూం

నాలుగు రోజులుగా ముసురు వాతావరణం

ఒంగోలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనాలు సోమవారం నాటికి అల్పపీడనం, ఆతర్వాత వాయుగుండంగా మారతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. వాటి ప్రభావంతో మంగళ, బుధవారాల్లో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తీర ప్రాంత మండలాల అధికారులను కలెక్టర్ అన్సారియా అలర్ట్ చేశారు. ఆయా మండలాలకు జిల్లా అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించి తక్షణ చర్యలకు ఆదేశించారు. ఆ వెంటనే రంగంలోకి దిగిన కొందరు మండలాల్లో సమావేశాలు కూడా నిర్వహించారు.

కలెక్టరేట్‌లో కంట్రోలు రూం ఏర్పాటు

జిల్లాకు భారీ వర్ష సూచన నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. దానికి టోల్‌ఫ్రీ నంబర్ 1077 కేటాయించారు. రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ, పశుసంవర్థక, మత్స్య, రోడ్లు భవనాలు, విద్యుత్, వైద్యశాఖ అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలు ఈ కంట్రోలు రూంలో నిరంతరం విధులు నిర్వహించనున్నారు.



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలో ఉద్యోగులు

నాలుగు రోజుల నుంచి జల్లులు

జిల్లా వార్షిక వర్షపాతంలో నాల్గోవంతుకు పైగా ఈనెలలోనే కురుస్తుంది. అలా ఈనెలలో సాధారణ వర్షపాతం 205.50 మి.మీ. కాగా ఇప్పటి వరకు 61.4 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అందులో గడిచిన నాలుగు రోజుల్లోనే సుమారు 46.0మి.మీ కురిసింది. జిల్లా అంతటా నాలుగు రోజులుగా వాతావరణం పూర్తిగా చల్లబడి తెరలు, తెరలుగా జల్లులు పడుతున్నాయి. కొన్ని చోట్ల ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఈనెల 11,12,13తేదీల్లో జిల్లాలో సగటున 36.0 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈమూడు రోజుల్లో ఒంగోలులో గరిష్ఠంగా 106.0 మి.మీ వర్షం కురిసింది. టంగుటూరులో 92.20. మద్దిపాడులో 79.0, నాగులుప్పలపాడులో 76.0. సీఎస్‌పురంలో 65.20, తర్లుపాడులో 56.2, మార్కాపురంలో 51.0, తాళ్లూరులో 50.60, చీమకుర్తిలో 50.0 మి.మీ నమోదైంది. ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, దొనకొండ, ముండ్లమూరు, పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి, హనుమంతునిపాడు, కనిగిరి, సంతనూతలపాడు, కొత్తపట్నం, జరుగుమల్లి, సింగరాయకొండ మండలాల్లో 25నుంచి 50 మి.మీ కురిసింది.

నేడు 'మీ కోసం' రద్దు

ఒంగోలులోని కలెక్టరేట్‌లో ప్రతి వారం నిర్వహించే మీ కోసం (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని ఈ సోమవారం తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో మద్యం షాపుల కేటాయింపు కోసం సోమవారం లాటరీ ప్రక్రియ నిర్వహించాల్సి ఉందన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియాతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొనాల్సి ఉన్నందున మీ కోసం కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించి దూర ప్రాంతాల నుంచి ఒంగోలు రావద్దని శ్రీలత కోరారు.

విస్తారంగా వర్షాలు

నాగన్నవాగులో కారుతో సహా కొట్టుకుపోయిన వ్యక్తి

రక్షించిన స్థానికులు

నాగులుప్పలపాడు అక్టోబరు 13: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఉప్పుగుండూరు గ్రామీణ ఆరోగ్యకేంద్రం వద్ద నున్న నాగన్న వాగు నేలచప్టాపైకి వరద నీరు చేరింది. చప్టాకి ఇరువైపులా ఉన్న రైయిలింగ్ దిమ్మెలు సైతం నీట మునిగాయి. శనివారం బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం నీలాయిపాలెం గ్రామానికి చెందిన గుడివాడ రాజేంద్ర ఉప్పుగుండూరులో పనులు ముగించుకొని వినుకొండలో వివాహానికి వెళ్లేందుకు తన కారులో నాగన్న వాగు దాటేందుకు ప్రయత్నించాడు. అయితే వరద ఉధృతికి కారుతో సహా రాజేంద్ర వాగులో కొద్ది దూరం కొట్టుకుపోయాడు. స్థానికంగా ఉన్న ఓ మహిళ గమనించి కేకలు వేయగా చుట్టుపక్కల వారు పరుగులు తీసి తాడు సాయంతో అతి కష్టం మీద రాజేంద్రను కారులో నుంచి బయటకు తీసి రక్షించారు. అనంతరం స్థానికులే వాగుకు ఇరువైపులా ఆటోలను అడ్డుగా పెట్టి ఎవరినీ అటుగా వెళ్లకుండా పర్యవేక్షించారు. కాగా వాగులో చిక్కుకున్న కారును క్రేన్ సహాయంతో బయటకు తీసే సహాయచర్యలను తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షించి పంచనామ నమోదు చేశారు.

పొంగిన వాగులు

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు నాగులుప్పలపాడు-తిమ్మనపాలెం రహదారిలోని హనుమాపురం, కొత్తకోట వాగులు పొంగి ప్రవహించడంతో అటుగా రాకపోకలు నిలిచిపోయాయి. ఆ రెండు వాగుల వద్ద పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. విస్తారంగా కురిసిన వర్షాలకు మండల పరిధిలోని పలు ప్రాంతాలలో పొలాలు చెరువులను తలపించాయి.



వాగులో కొట్టుకుపోయిన కారు



భవనాసి చెరువు నీటిని చేపల చెరువులకు పంపింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లు



మోటార్ల ద్వారా చేపల చెరువులలోకి వస్తున్న నీరు



చెరువు నుంచి కాలువను ఏర్పాటు చేసి అక్కడ నుంచి పైపుల ద్వారా పంపుతున్న నీరు

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు దుర్వినియోగం

- చేపల చెరువులకు నీటి పంపింగ్
- వ్యవసాయ బోర్లు, భవనాసి చెరువుల నీరు యథేచ్ఛగా వాడకం
- కోళ్ల మాంసం వ్యర్థాల వినియోగంపై గ్రామస్థుల హెచ్చరిక
- తాత్కాలికంగా వెనక్కి తగ్గిన నిర్వాహకులు

అద్దంకి, అక్టోబరు 13 : ప్రభుత్వం రైతులకు కల్పిస్తున్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లను చేపల చెరువుల నిర్వాహకులు దుర్వినియోగం చేస్తున్నారు. అద్దంకి మండలం శింగరకొండపాలెం సమీపంలో సుమారు 100 ఎకరాలలో చేపలు, రొయ్యల చెరువులు ఉన్నాయి. చేపలు, రొయ్యల చెరువులకు నీటిని భవనాసి చెరువు, వ్యవసాయ బోర్ల నుంచి పంపింగ్ చేస్తున్నారు. అయితే నీటి పంపింగ్‌కు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు వినియోగిస్తూ విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లే విధంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం చేపల చెరువులుగా ఉన్న ప్రాంతం గతంలో పంట భూములుగా ఉండడం, అప్పట్లో వ్యవసాయ బోర్లకు తీసుకున్న విద్యుత్ కనెక్షన్‌లను సంవత్సరాల తరబడి చేపల చెరువులకు నీటిని పంపింగ్ చేసేందుకు వినియోగిస్తున్నారు. పనిలో పనిగా మరి కొందరు నేరుగా చేపల చెరువుల వద్దనే బోర్లు వేసి, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల ద్వారా అనుమతులు పొంది వినియోగిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. దీంతో ప్రతి నెలా లక్షల రూపాయలు విద్యుత్ సంస్థకు నష్టం వాటిల్లుతున్నట్లు తెలుస్తుంది. ఇక చేపల పెంపకానికి కోళ్ల మాంసం వ్యర్థాలను కూడా వినియోగిస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతుందని, ఇటీవల శింగరకొండపాలెం గ్రామస్థులు కోళ్ల మాంసం వ్యర్థాలను తరలించే ఆటోలను అడుకొని హెచ్చరించినట్లు తెలుస్తుంది. దీంతో తాత్కాలికంగా కోళ్ల మాంసం వ్యర్థాల వినియోగానికి బ్రేక్ పడినట్లు సమాచారం. భవనాసి చెరువు నీటిని యథేచ్ఛగా పంపింగ్ చేస్తున్నా, నీటి పంపింగ్ కు వ్యవసాయ విద్యుత్ కనెక్షలు వినియోగిస్తున్నా అధికారులు పట్టించుకోకపోడం పట్ల విమర్శలు వస్తున్నాయి. అదే సమయంలో చెరువుల నుంచి వచ్చే వ్యర్థాలను భవనాసి చెరువులోకి వదులుతుండడంతో భవనాసి చెరువు నీరు కూడా కలుషితమయ్యింది. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



నగదును అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల విరాళం

చినగంజాం, అక్టోబరు 13 : సోపిరాల రైల్వే గేటు సెంటర్‌లో కాపు నాయకుడు వంగవీటి మోహనరంగా విగ్రహ ఏర్పాటుకు 1994-1995 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు విరాళాన్ని అందజేశారు. సోపిరాల గ్రామానికి చెందిన 1994-95 పదో తరగతి పూర్వ విద్యార్థులు మోహనరంగా విగ్రహం ఏర్పాటుకు స్థలం ఇచ్చిన అనుమాలశెట్టి బాజీకి ఆదివారం గ్రామపెద్దల సమక్షంలో రూ.2,01,150 నగదును అందజేశారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న రంగా విగ్రహానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ నెల 16న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భూమి పూజ చేయనున్నట్లు చినగంజాం గ్రామ టీడీపీ అధ్యక్షుడు చెరుకూరి రాఘవయ్య తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి పల్లె పండుగ

బల్లికురవ, అక్టోబరు 13 : అన్ని గ్రామాలలో సోమవారం నుంచి 20వ తేదీ వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాలకు కేటాయించిన రూ.3.90కోట్ల నిధులతో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణాలకు భూమి పూజ కార్యక్రమాలు జరుగుతాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమాలు 14వ తేదీన వేమవరం, ఉప్పుమాగులూరు, కొప్పెరపాలెం, 15న బల్లికురవ, చెన్నుపల్లి, నక్కబొక్కలపాడు, 16న గుంటుపల్లి, పెద అంబడిపూడి, వల్లాపల్లి, 17న కొమ్మినేనివారిపాలెం, వైదన, ముక్తేశ్వరం, 18న వెలమవారిపాలెం, కొత్తూరు, కొప్పెరపాడు, 19న గొర్రెపాడు, కూకట్లపల్లి, ఎస్‌ఎల్ గుడిపాడు, కె.రాజుపాలెం గ్రామాల్లో జరిగే సభల్లో పాల్గొనాలని ఎంపీడీవో కోరారు.

పంగులూరు : పంచాయతీ వారోత్సవాలలో భాగంగా ఈ నెల 14 పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.స్వరూపారాణి తెలిపారు. సోమవారం నుంచి జరిగే కార్యక్రమాల షెడ్యూల్‌ను ఆమె ప్రకటించారు. ఆయా సభలకు నోడల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఎంపీడీవో కోరారు.

అద్దంకిటౌన్ : అన్ని గ్రామాల్లో ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో డి. సింగయ్య తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో కొత్తగా మంజూరైన వివిధ పనులను ప్రారంభించడం, ఉపాధి హామీ పనులు గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తారని తెలిపారు.

బస్ షెల్టర్‌కు శంకుస్థాపన

చీరాల, అక్టోబరు 13 : మసీద్ సెంటర్‌లోని స్కూల్ వద్ద బస్ షెల్టర్ నిర్మాణానికి వాసవీ, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ షెల్టర్ నిర్మాణానికి పూర్వి స్కాన్ సెంటర్ వైద్యులు డాక్టర్ పేట శ్రీకాంత్ రూ.2.50 లక్షలు విరాళంగా అందజేశారన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు వల్లంపట్ల వెంకటేశ్వరరావు, సుదర్శన, సత్యనారాయణ, బాలాజీ రామకృష్ణ, కౌన్సిలర్లు లలిత రాజశేఖర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం

రూ.2.10 లక్షల వ్యయంతో నిర్మాణం



బస్సు షెల్టర్‌ను ప్రారంభిస్తున్న పురోహితులు నరసింహచార్యులు, గ్రామస్థులు

అద్దంకిటౌన్, అక్టోబరు 13 : విదేశాలలో ఉన్నా సొంత ఊరు అభివృద్ధికి తన వంతు సహకరించాలనే ఉద్దేశంతో సహకారాలను అందిస్తున్న ఎన్నారై నలజల నాగరాజు సేవలు అభినందనీయమని గ్రామ పురోహితులు నారాయణం నరసింహాచార్యులు, పలువురు గ్రామ పెద్దలు అన్నారు. అద్దంకి మేదరమెట్ల రోడ్డులోని ధేనువ కొండ పునరావాస కాలనీ అయిన బలరామకృష్ణపురం వద్ద గ్రామానికి చెందిన నలజల నాగరాజు అమెరికాలో స్థిరపడ్డారు. శుభం ఫౌండేషన్ సహకారంతో ధేనువ కొండ పునరావాస కాలనీ వద్ద ఆయన తండ్రి, మాజీ సర్పంచ్ నలజల వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం రూ2.10 లక్షలతో బస్ షెల్టర్‌ను నిర్మించారు. శనివారం పురోహితులు నరసింహాచార్యులు చేతుల మీదుగా దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజు తండ్రి వెంకటేశ్వర్లు గ్రామానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన విద్యార్థి ఉన్నత చదువుకు ఆర్థిక సాయాన్ని నాగరాజు తల్లి పార్వతి వర్ధనమ్మ అందించారు. ముందుగా నలజల వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగినేని రామకృష్ణ, నలజల గోపీకృష్ణ, ఉపాధ్యాయుడు చప్పిడి కేశవరావు, గ్రామస్థులు నలజల శ్రీనివాసరావు, బోడపాటి వెంకయ్య, హరిబాబు, అనుబాబు, గుంజి రామాంజనేయులు, శ్రీనువాసరావు, కోటయ్య పాల్గొన్నారు.

వైభవంగా బాబా మహాసమాధి ఉత్సవం

చినగంజాం, అక్టోబరు 13 : హనుమ సాయి కుటీరంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో బాబా మహా సమాధి ఉత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి ఆధ్వర్యంలో సాయిబాబాకు అభిషేకాలు నిర్వహించి, నూతన వస్త్రాలు, పలు రకాల పూలమాలలతో విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు. ఆదివారం వేకువజామున అంకిత సాయి భక్తులు సాయినాథుని చిత్రపటంతో గ్రామ పుర వీధులలో నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సమీప గ్రామాలకు చెందిన భక్తులు బాబాకు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు ధునిలో కొబ్బరి కాయలు వేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హనుమసాయి కుటీరమ్ ట్రస్టు సభ్యులు, అంకితసాయి భక్తులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముగిసిన దసరా ఉత్సవాలు





ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి, కన్యకాపరమేశ్వరి అమ్మవారి నగరోత్సవంలో పాల్గొన్న చైర్మన్ రామకోటేశ్వరరావు

అద్దంకి, అక్టోబరు 13 : అద్దంకిలో చక్ర సహిత వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి 53వ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి జరిగిన నగరోత్సవం కనులపండువగా సాగింది. కోలాటం, కేరళ వాయిద్యాల మధ్య నగరోత్సవం సాగింది. దేవాలయం వద్ద దేవాలయం చైర్మన్ ఊటుకూరు రామకోటేశ్వరరావు దంపతులు, కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి నగరోత్సవం ప్రారంభించారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యనిర్వాహక అధ్యక్షుడు చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు, అర్వపల్లి హనుమంతరావు, పోకూరి వెంకట శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. రాత్రి 8గంటలకు ప్రారంభమైన నగరోత్సవం వేకువజాము వరకు సాగింది.

శింగరకొండలో పోటెత్తిన భక్తజనం

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానానికి శనివారం భక్త జనం పోటెత్తారు. దసరా పండుగ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. వాహన పూజలు పెద్ద సంఖ్యలో జరిగాయి. అనంతరం లక్ష్మీనరశింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. మండపం వద్ద జమ్మి పూజ నిర్వహించారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి, దత్తపాదుకాక్షేత్రం, వేయి స్తంభాల ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలకరించి పూజలు నిర్వహించారు.

బల్లికురవ : దసరా నవరాత్రుల సందర్భంగా మండలంలో పలు గ్రామాలలో తొమ్మిది రోజులుగా పూజలు అందుకున్న అమ్మవారి ఉత్సవాలు శనివాంతో ముగిశాయి. గొర్రెపాడు గ్రామంలో ఉన్న అంకమ్మ తల్లి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన దసరా నవరాత్రుల పూజలు వైభవంగా జరిగాయి. విచిత్ర వేషధారణలతో గ్రామంలో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. కొత్తపాలెం గ్రామంలో మహిళల కొలాట ప్రదర్శన ఆకట్టుకొంది. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నక్కబొక్కలపాడు, కొణిదెన, వేమవరం, మల్లాయపాలెం, అంబడిపూడిలో దేవాలయాలలో ప్రత్యేక పూజలు అనంతరం అన్నదాన కార్యక్రమాలను భక్తులు నిర్వహించారు.

పంగులూరు : అన్ని గ్రామాల్లో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. జమ్మిపూజ అనంతరం గ్రామాలలో దేవతామూర్తులను ఊరేగించారు. భక్తులు హారతులిచ్చి పూజలు చేశారు.

అద్భుతం పార్వేట ఉత్సవం

చీరాల : దసరా సందర్భంగా శనివారం రాత్రి ఎస్‌ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలో పార్వేట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, బాలకొండమ్మ దంపతులు జమ్మి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. పేరాల మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన ఉత్సవంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, భూలక్ష్మి దంపతులు జమ్మి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు సుఖసంతోషాలతో తులతూగాలని వేడుకున్నారు. ఆలయాల వద్ద, పందిళ్ల వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు.

ఈపూరుపాలెం(చీరాలటౌన్) : చీరాల మండలం ఈపూరుపాలెం పెద్ద పందిరి వీధిలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి నిమజ్జనానికి కాళిక, గంగానమ్మ, కాంతారా వేషాలతో ఊరేగింపు నిర్వహించారు. కోలాటం అందరిని అలరించింది. భక్తులు పూజలు నిర్వహించారు.

కారంచేడు (పర్చూరు) : నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. కారంచేడులోని శ్రీ వైష్టవీ దుర్గాలయం, పెద్దబజారు శివాలయం, మాదవస్వామి ఆలయంతోపాటు, స్వర్ణ, కుంకలమర్రు, దగ్గుబాడు, కొడవలివారిపాలెం తదితర గ్రామాల్లో విజయదశమి ఉత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఇంకొల్లు : దసరా ఉత్సవాలను వైభవంగా జరుపుకున్నారు. కృష్ణమందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరి అవతారంలో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జమ్మి చెట్టుకు పూజలు చేశారు. బస్టాండు సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

మార్టూరు : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. వాసవీ అమ్మవారిని భక్తులు మహిళలు కోలాటం ప్రదర్శన చేస్తూ ఊరేగింపులో వెంట నడిచారు. శ్రీఘట్టేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి అవతారంలో భక్తులకు దర్శన మిచ్చారు. జొన్నతాళి గ్రామంలో దుర్గాదేవి అవతారంలో అమ్మవారి ఊరేగింపు ఘనంగా జరిగింది. కోలలపూడిలో నీలకంఠేశ్వరస్వామి, చెన్నకేశ్వరసామి ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్‌పై ఊరేగిస్తూ, జమ్మి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం దుర్గామాతను మహిళలు బోనాలతో ఊరేగించారు.

పర్చూరు : విజయదశమి వేడుకలను మండలంలోని ఆయా దేవాలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పర్చూరులోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరిగిన పూజల్లో బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఎంపీని ఆలయ కమిటీ ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు ఘనంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు మామిడిపాక హరిప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరామ్ సుబ్బారావు, మహిళా నాయకులు ఊటుకూరి నిర్మల, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, తంగెళ్ల మల్లికార్జునరావు పాల్గొన్నారు. శ్రీ అద్దంకి నాంచారమ్మ, వేణుగోపాలస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా ముగిశాయి.

చినగంజాం : విజయదశమి పండుగను వైభవంగా నిర్వహించారు. శనివారం వేకువజామున నుంచే ఆలయాల్లో అమ్మవార్లకు పట్టు వస్త్రధారణ. పత్ర్యేక అలంకరణలు నిర్వహించి, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. కడవకుదురు గ్రామంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి విగ్రహాలను శరన్నవరాత్రులు అనంతరం గ్రామ పుర వీధులలో ఊరేగింపు నిర్వహించి మోటుపల్లి తీరంలోని గంగమ్మ ఒడికి చేర్చారు. వాసవీమాత, సోపిరాల రామకోటేశ్వరస్వామి ఆలయంలో లలితాపరమేశ్వరి ఆలయంలో శమీ పూజ నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. చినగంజాం పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ శీలం రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆయుధ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.







జమ్మి మొక్కకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య దంపతులు, పర్చూరులో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ కృష్ణప్రసాద్, మార్టూరులో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు

ఉధృతంగా నాగన్న వాగు



నాగన్న వాగును పరిశీలిస్తున్న అధికారులు, సర్పంచ్

చినగంజాం, అక్టోబరు 13 : నీలాయపాలెం, ఉప్పుగుండూరు గ్రామాల మధ్య గల నాగన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పెద గంజాం, నీలాయపాలెం గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మూడు రోజులుగా ఉపరితల ఆవర్తనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు నాగన్న వాగుకు వరద రావడంతో గ్రామాలకు రాకపోకలు శనివారం నుంచి నిలిచిపోయాయి. శనివారం కురిసిన భారీ వర్షానికి నాగన్న వాగుకి ఉధృతంగా వరద రావడంతో అధికారులు పరిశీలించి, ప్రమాదాలు జరగకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. నీలాయపాలెం గ్రామ సమీపంలోని వాగు వద్ద రాకపోకలు సాగించకుండా ఇన్‌చార్జి తహసీల్దార్ యూ.శ్రీనివాసరావు, ఎస్ఐ ఎస్.రమేష్ బారికేడ్లను ఏర్పాడు చేసి, బందోబస్తు ఏర్పాటు చేశారు. నాగన్నవాగు, మట్టికుంటవాగు కలిసే రైల్వేబ్రిడ్జి నెంబరు 605 దగ్గర రైల్వే మూడవ లైను నిర్మాణ సమయంలో సిమెంట్ దిమ్మలు, మట్టిని అలాగే వదలి వేయడంతో వరద నీరు సముద్రంలోనికి వెళ్లే అవకావం లేక గ్రామాల వైపు వస్తుందని నీలాయపాలెం గ్రామ సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఇటీవల వాటిని తొలగించాలని రైల్వే అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లినా ఇంతవరకు పట్టించుకోలేదని తెలిపారు. కాలువకు అడ్డుగా ఉన్న వాటిని తొలగించకపోతే వరదల సమయంలో మరింత ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు పరిశీలించి అడ్డుగా ఉన్న వాటిని తొలగించాలని గ్రామ సర్పంచ్ కోరారు. శనివారం నుంచి రాకపోకలకు అంతరాయం కలిగినా ఆదివారం సాయంత్రానికి వరద తగ్గిపోవడంతో రాకపోకలు యథావిధిగా సాగుతున్నాయి.

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నందున మత్స్యకారులు ఎవరూ సముద్రంలో వేటకు వెళ్లొద్దని ఇన్‌చార్జి తహసీల్దార్ యూ.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దపల్లెపాలెం, పటమటి పల్లెపాలెం, బాపయ్య నగర్, తూర్పు పల్లెపాలెం గ్రామాల్లోని మత్స్యకారులతో ఆదివారం ఆయన మాట్లాడారు. అల్పపీడనం కారణంగా సోమవారం నుంచి బుధవారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాతావరణశాఖ సూచనలు పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ సూచించారు. బోట్లు, వలలు సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నా రు. గ్రామ వీఆర్వో పద్మ, మత్స్యకారులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న భక్తులు

అద్దంకి, అక్టోబరు13: మండలంలోని గోవాడలో అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, రామాలయం వద్ద ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ శనివారం వైభవంగా జరిగాయి. ఆంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటుకు రిటైర్డ్ హౌసింగ్ డీఈ పావులూరి నాగేశ్వరరావు కుటుంబసభ్యులు పూర్తి సహకారం అందించారు. ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. బంధువులతో గోవాడలోని అన్ని ఇళ్ల వద్దా సందడి కన్పించింది.

విజేతలకు బహుమతుల ప్రదానం

అద్దంకిటౌన్, అక్టోబరు 13 : జామియా సుబులుస్సలాం లిల్ బనాత్ వారి ఆధ్వర్యంలో ఆదివారం అద్దంకిలో ముస్లిం విద్యార్థినులకు దుఆ ఆటలపోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 40 మంది విద్యార్థినులు పాల్గొన్నట్లు సభ్యులు అన్నారు. ఈ పోటీలో మొదటి బహుమతి ఆసియా, రెండవ బహుమతి నాసిహ, మూడవ బహుమతి నాజిహకు సభ్యులు అందజేశారు. మరో పది మంది పిల్లలకు నగదు బహుతులను అందజేయడంతో పాటు పాల్గొన్న పిల్లలందరికీ పుస్తకాలను ఇచ్చారు.

కడప దర్గా ఉరుసు ఉత్సవాలను జయప్రదం చేయాలి

పర్చూరు, అక్టోబరు 13 : ప్రఖ్యాతి గాంచిన కడప అమీన్ పీర్ దర్గాలో ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయాలని పీఠాధిపతి ఆరిఫుల్లా ముస్లింలకు పిలుపు నిచ్చారు. మాలిక్ కోరారు. అందరినీ ఆహ్వానించేందుకు ఆదివారం పర్చూరులోని షేక్ కాలేషా నివాసానికి చేరుకున్నారు. అయనతోపాటు షేక్ అహ్మద్‌బాషా, షేక్ అమానుల్లా, బుల్లా మేస్త్రీ, షేక్‌ఖాజావలి, షేక్ సలీమ్, షేక్ హుస్సేన్, షేక్ గౌస్ (ఫ్రూట్స్), నాగూర్, అమన్, అసిమ్ ఉన్నారు.

యువకునికి గాయాలు

వేటపాలెం(చీరాల), అక్టోబరు 13 : రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడ్డాడు. ఘటనా స్థలానికి చేరుకున్న వేటపాలెం ఎస్ఐ వెంకటేశ్వర్లు అతడికి ప్రథమ చికిత్సను చేసి వెంటనే ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. శనివారం రాత్రి జరిగిన ఈ ప్రమాద వివరాలివి. యువకుడు వేటపాలెం నుంచి బైక్‌పై హైవే వైపు వెళ్లే క్రమంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. తలకు గాయమైంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని ఆ యువకునికి ప్రథమ చిక్సిత చేసి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సుబ్బయ్య (ఫైల్)

మార్టూరు, అక్టోబరు 13 : ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో వాహనాన్ని నడుపుతున్న కొప్పుల సుబ్బయ్య (48) అనే వ్యక్తి రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమై సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఈ ఘటన శనివారం రాత్రి సర్వీస్ రోడ్‌లో జరిగింది. సుబ్బయ్యతోపాటు వెనుక కూర్చున్న గారపాటి శ్రీనివాసరావుకు గాయపడగా, అతనిని గుంటూరులోని కాటూరు ఆసుపత్రికి తరలించారు. వీరు వలపర్లలోని ఎస్సీ కాలనీకి చెందినవారు. సొంత పని నిమిత్తం వారు మార్టూరు వచ్చి తిరిగి వెళ్లుండగా ఈ ప్రమాదం జరిగింది. సోదరుడు బుచ్చిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఆదివారం మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఏఎస్ఐ సైదా తెలిపారు.

నేడు మద్యం షాపులకు డ్రా

పర్చూరు, అక్టోబరు 13 : మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్న పర్చూరు సబ్ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల దరఖాస్తు దారులు సోమవారం ఉదయం 8గంటలకు హాజరు కావాలని ఎక్సైజ్ సీఐ భుజంగరావు తెలిపారు. బాపట్ల జిల్లా కేంద్రంలోని జమ్ములపాలెం రోడ్డులోని ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో డ్రా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ సమక్షంలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పారదర్శకంగా డ్రా తీస్తున్నట్లు తెలిపారు. పర్చూరు ఎక్సైజ్ సబ్‌డివిజన్ పరిధిలోని పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు, యద్దనపూడి మండలాలకు సంబంధించి మొత్తం 15 మద్యం దుకాణాలకు గాను 449 మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఊరేగింపులో అపశ్రుతి

ట్రాక్టర్ పైనుంచి జారిపడి బాలుడి మృతి

కావూరివారిపాలెం(చీరాలటౌన్), అక్టోబరు 13 : దసరా ఊరేగింపులో అపశ్రుతి చోటుచేసుకుంది. ఈ ఘటన చీరాల మండలం కావూరివారి పాలెం పంచాయతీ తులసీనగర్‌లో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. గ్రామానికి చెందిన పాలిబోయిన వెంకటేశ్వర్లు, జ్యోతి దంపతులకు అఖిల్(7) మరో పాప సంతానం. దసరా పండుగ సందర్భంగా గ్రామంలో శనివారం రాత్రి అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. అఖిల్‌ను ట్రాక్టర్ ఇంజన్‌పై కూర్చోబెట్టారు. నిద్ర మత్తులోకి జారుకుని ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. దీంతో వెనుక వస్తున్న డీజే వాహనం చక్రాల కింద పడి అఖిల్ తీవ్రంగా గాయపడ్డాడు. నివ్వెరపోయిన బంధువులు, కుటుంబ సభ్యులు చిన్నారిని హుటాహుటీన చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా కన్నుమూశాడు.

పగులగొట్టారు.. వదిలేశారు

- కొణిదెన - మార్టూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో ప్రయాణికుల అవస్థలు
- మరమ్మతుల కోసం తారు లేపి పనులు చేపట్టడంలో జాప్యం
- ఆందోళనలో వాహనచోదకులు



రోడ్డును పగులగొట్టడంతో ఏర్పడిన గుంతల్లో ఉన్న నీరు

బల్లికురవ, అక్టోబరు 13 : రోడ్డు మరమ్మతులు చేస్తున్నారని అందరూ ఆనందపడ్డారు. అయినా ప్రయాణికులకు నిరాశే మిగిలింది. నెల రోజుల కిందట బల్లికురవ, కొణిదెన, మార్టూరు రోడ్డు మర్మత్తులు చేపట్టేందుకు ఉన్న తారు రోడ్డును పూర్తిగా పగలగొట్టారు. మరమ్మతు పనుల్లో మాత్రం తీవ్ర జాప్యం చేయడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి అధ్వానంగా ఉన్న కొణిదెన - మార్టురు రోడ్డును బాగు చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ పనులను దక్కించుకొని పనులు మెదలు పెట్టారు. రోడ్డును పగులగొట్టి నెలలు అవుతున్నా పనులు పూర్తి చేయలేదు. దీంతో ఈ రోడ్డున రాకపోకలు సాగించే ప్రయాణికులు నరకం చూస్తున్నారు. తారు రోడ్డు పెచ్చులు లేపి మార్జిన్‌లో పడవేయడంతో మట్టి రోడ్డుగా మారింది. వర్షం కురిస్తే ఈ రోడ్డు వాగులను తలపిస్తుందని వాహన చోదకులు వాపోతున్నారు. ఈ రోడ్డు పనులు పూర్తి అవుతాయని అనుకున్నామని కానీ పనులు మాత్రం మెదలు కాలేదని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న వానకే గోతులలో ఉన్న నీటిలో ప్రమాదాలు జరుతున్నాయని వారు తెలిపారు. సంబంధిత అధికారులు కొణిదెన రోడ్డు మరమ్మతు పనులు పూర్తికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వారం రోజుల్లో పనులు మొదలవుతాయి :బాజ్జీ, అర్‌అండ్‌బీ జేఈ

బల్లికురవ - కొణిదెన - మార్టూరు రోడ్డుకు నిధులు మంజురయ్యాయి. ఈ నిధులతో కొణిదెన - మార్టూరు మధ్య పూర్తిగా దెబ్బతిన్న చోట రోడ్డు మరమ్మతులు చేసేందుకు కాంట్రాక్టర్ పగులగొట్టారు. వారం రోజుల్లో ఈ రోడ్డు పనులు మొదలు పెట్టేలా చర్యలు చేపడతాం.



నగరోత్సవంలో రాజరాజేశ్వరి అమ్మవారు

నెల్లూరు రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు





నెల్లూరులో కన్యకాపరమేశ్వరి నగరోత్సవం



అల్లూరు : పోలేరమ్మకు నిర్వహించిన పల్లకీసేవ



బుచ్చి : అశ్వవాహనంపై గ్రామోత్సవంలో జొన్న వాడ కామాక్షితాయి



సంగం : బాలచౌడేశ్వరిదేవి గ్రామోత్సవం

విజయలక్ష్మిగా అమ్మణ్ణుల దర్శనం

సంప్రదాయబద్ధంగా విజయదశమి వేడుకలు

నూతన వ్యాపారాల ప్రారంభం ● ఆలయాల వద్ద వాహన పూజలు

దేవాలయాలకు భారీగా తరలివచ్చిన భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం)

అక్టోబరు 13 : జిల్లా వ్యాప్తంగా ప్రజలు శనివారం విజయదశమిని వైభవంగా జరుపుకున్నారు. అధర్మంపై విజయానికి గుర్తుగా ప్రతి ఒక్కరూ ఈ పండుగను నిర్వహించారు. విజయదశమి సందర్భంగా వివాహముహూర్తాలతోపాటు నూతన గృహాలు, కల్యాణ మండపాలు, నూతన వ్యాపార సంస్థలు ప్రారంభమయ్యాయి. పోలీస్ స్టేషన్లలో ఆయుధ పూజలు, వ్యాపార సముదాయాల్లో యంత్రాలకు పూజలు నిర్వహించారు. భారీగా కొత్త వాహనాల కొనుగోళ్లతోపాటు ఆలయాల వద్ద వాహన పూజలు జరిగాయి. జిల్లాలోని వివిధ ఆలయా ల్లో అమ్మవార్లు విజయలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా దేవాలయాల్లో శమీ పూజలు, చిన్నారులకు కన్య పూజలు, అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాలు, బాణసంచా వేడుకలు, మంగళవా యిద్యాలు, నృత్యాలు, తీన్‌మార్ మ్యూజిక్కులు, కన్నుల పండువగా నగరోత్సవాలు నిర్వహించారు. నగరంలోని పలు ఆలయాలను మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ దంపతులు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, ఇతర ప్రజా ప్రతినిధులు సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పేదలకు వస్త్ర, అన్నదానం నిర్వహించారు. అమ్మవార్ల చల్లని చూపులతో సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడి పంటలతో అభివృద్ధి చెందేలా ఆశీర్వదించాలని అమ్మవార్లకు సంకల్పం చేసుకున్నారు. మొత్తం మీద జిల్లాలో దసరా సంబరాలు అంబరాన్ని అంటాయి.



కావలిటౌన్ : గౌరీదేవి అలంకారంలో దుర్గాభ్రమరాంబ



ఉదయగిరి రూరల్ : ఆయుధ పూజలో ఎస్ఐలు, సిబ్బంది



కన్యకా పరమేశ్వరి నగరోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు



కందుకూరు : స్వర్ణాభరణాలతో భక్తులకు దర్శనమిచ్చిన అంకమ్మతల్లి



నెల్లూరు కస్తూర్బా కళాక్షేత్రంలో వైన్ షాపుల డ్రా కోసం చేసిన ఏర్పాట్లు

నేడే మద్యం షాపులకు డ్రా

- 182 దుకాణాలకు 3872 దరఖాస్తులు
- కస్తూర్బా కళాక్షేత్రంలో కలెక్టర్ ఏర్పాట్ల పరిశీలన
- ఉదయం 8 నుంచి లాటరీ ప్రక్రియ ప్రారంభం

నెల్లూరు(క్రైం), అక్టోబరు 13: జిల్లా వ్యాప్తంగా 182 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించగా, 3872 దరఖాస్తులు వచ్చాయి. సోమవారం ఉదయం 8గంటలకు నెల్లూరు నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో అధికారులు డ్రా తీసి వ్యాపారులకు దుకాణాలను కేటాయించనున్నారు. జిల్లాలోని వైన్‌షాపులకు అందిన దరఖాస్తులతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.77.44కోట్లు ఆదాయం వచ్చింది.

● జిల్లా కలెక్టర్ ఏర్పాట్ల పరిశీలన

నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో వైన్‌షాపుల లాటరీ ప్రక్రియకు ఎక్సైజ్ అధికారులు ఏర్పాట్లు చేయగా, ఆదివారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్కీ డ్రాలో ఎలాంటి అవకతవకలకు, వివాదాలకు తావులేకుండా ప్రశాంతంగా పూర్తి చేయాలన్నారు. ఎక్సైజ్ అధికా రులు ఉదయం 8గంటలకు డ్రా ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. ఆయా ప్రాంతాల వారీగా ఉన్న దుకాణాలు, వాటికి వచ్చిన దరఖాస్తులు, వాటికి కేటాయించిన నెంబర్ల ఆధారంగా లక్కీ డ్రా తీసే బాక్సులో వేసి అధికారుల సమక్షంలో ఒక్కో షాపునకు ఒక్కో టోకన్ తీసి వ్యాపారులకు లైసెన్సును అందజేయనున్నారు. ఈప్రక్రియను అంతా వీడియో రికార్డింగ్ చేస్తారు. డ్రాలో వ్యాపారులు షాపు పొందిన తరువాత బ్యాంకు కౌంటరుకు వెళ్లి లైసెన్సు ఫీజు చెల్లించి షాపును ఏర్పాటు చేసుకునేందుకు చర్యలు చేపడతారు. దుకాణం ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారన్న సమాచారాన్ని మంగళవారం ఎక్సైజ్ అధికారులకు తెలియజేస్తే, వారు ఆప్రాంతాలను పరిశీలించి దుకాణం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. 16వతేదీ ఉదయం నుంచి మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు. కస్తూర్బా కళాక్షేత్రం వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ట్రాఫిక్, సివిల్ పోలీసులతో ఎక్సైజ్ అధికారులతో సమావేశమయ్యారు.



కళాక్షేత్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్

ఎక్సైజ్ పోలీసు స్టేషన్ వారీగా దుకాణాలు, దరఖాస్తుల వివరాలు

ఎక్సైజ్ స్టేషన్	మొత్తం షాపులు	వచ్చిన దరఖాస్తులు	ఒక షాపునకు వచ్చిన దరఖాస్తుల శాతం
ఆత్మకూరు	13	320	24.62
నెల్లూరు-1	30	733	24.43
కలిగిరి	11	257	23.36
పొదలకూరు	17	387	22.76
కందుకూరు	17	378	22.24
ఇందుకూరుపేట	18	398	22.11
నెల్లూరు-2	12	265	22.08
కోవూరు	21	406	19.33
బుచ్చి	14	259	18.5
కావలి	17	277	16.29
ఉదయగిరి	12	192	16
మొత్తం	182	3872	21.27

మూడు రోజులపాటు కురిసే అవకాశం

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

తుఫాన్ ప్రభావంతో నేటి నుంచి భారీ వర్షాలు

- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు
- వెబెక్స్ సమావేశంలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 13: బంగాళాఖాతంలో అల్పపీడనం, తుఫాన్ ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిందని కలెక్టర్ ఆనంద్ చెప్పారు. ఆదివారం ఆయన వెబెక్స్ ద్వారా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం (నేటి నుంచి) బుధవారం వరకు మూడు రోజులపాటు జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాలు, తుఫాన్ వచ్చినట్లయితే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోడానికి అధికారులంతా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

● పెన్నానది గట్లను పరిశీలించాలి

పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖల అధికారులు పెన్నానది గట్లను పరిశీలించాలన్నారు. గట్లు బలహీనంగా ఉన్నా, గండ్లు పడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పెన్నాకి వరద వస్తే నదీ పరివాహక ప్రాంతంలో ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. యజమానులతో మాట్లాడి బోట్లు, ఎక్స్‌కవేటర్లను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. వాటి తరలింపునకు వాహనాలను, మనుషులను సిద్ధంగా చేసుకోవాలన్నారు. ప్రాణనష్టంకాని, పశునష్టం కాని జరకుండా చూడాలన్నారు.. నిత్యావసరాలు, ఆహార పదార్థాలు, పాలు, కూరగాయల వాహనాలు, డీజిల్‌ను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. గ్రామాల్లోని తాగునీటి ట్యాంకుల్లో ముందుగా నీటిని నింపుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

● తీరప్రాంత గ్రామాల్లో..

తీరప్రాంత గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా, మైకేలద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. భారీ వర్షాలు సంభవిస్తే సురక్షిత ప్రాంతాలకు ప్రజలు చేరుకోవాలన్నారు. తీర ప్రాంతాల్లో పూరి గుడిసెలు, తాటాకు ఇళ్లలో ఉండే ప్రజలు పక్కా భవనాల్లోకి, తుఫాన్ షెల్లర్లలోకి వెళ్లాలన్నారు. వైద్యశాలల్లో అత్యవసర మందులు, పాముకాటుకు మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఆర్‌అండ్‌బీ, విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో పాటు ఇతర శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదన్నారు. వేటకు వెళ్లి ఉంటే ఆదివారం సాయంత్రానికి తిరిగి సముద్రం బయటకు రావాలన్నారు.

● సెలవుల రద్దు

జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు సెలవుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేసుకుని హెచ్‌క్వార్టర్లలో అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.



వెబెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

● కంట్రోల్ రూము ఏర్పాటు

నెల్లూరు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ మూడు షిఫ్టులలో సిబ్బందికి డ్యూటీలు వేశామన్నారు. కంట్రోల్ రూమ్ నెంబర్లు 0851-2331261, 7995576699, 1077గా పేర్కొన్నారు. డివిజన్, మం డల కేంద్రాల్లో కూడా కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని ఆర్డీవోలు, తహసీల్దార్‌లను కలెక్టర్ ఆదేశించారు.

● నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు :

తుఫాన్ కారణంగా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కావేదిక కార్యక్రమాన్ని రద్దు చేశామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఈ వెబెక్స్ సమావేశంలో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

● మూడు మిల్లీమీటర్ల వర్షం

జిల్లాలో ఆదివారం మూడు మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా మర్రిపాడులో 32 మి.మీ, అత్యల్పంగా గుడ్లూరులో 2.2 మిమీ వర్షపాతం నమోదైంది.

విద్యుత్ శాఖ అప్రమత్తం : ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ) : జిల్లాకు తుఫాన్ ముప్పు ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో అధికారులందరినీ అప్రమత్తం చేసి, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ తెలిపారు. ఆదివారం ఆయన చాంబర్ నుంచి జిల్లాలోని అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం జిల్లాపై అధికంగా ఉంటుందని, వాతావరణ శాఖ నుంచి హెచ్చ రికలు ఉన్నందున అన్ని ప్రాంతాల్లో అధికా రులంతా పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. షిఫ్ట్ అపరేటర్లు, కాంట్రాక్ట్, ప్రైవే టు సిబ్బందిని అందుబాటులో ఉంచు కోవాలన్నారు. ఏ ప్రాంతంలో ఇబ్బంది జరిగిన వెంటనే స్పందించేలా అధికారులందరూ అందుబాటులో ఉండాలన్నారు.



వేంకటేశ్వరస్వామికి వెండి కిరీటం బహూకరణ

లింగసముద్రం, అక్టోబరు 13 : స్థానిక ప్రసన్న వేంకటేశ్వరస్వామికి ఆదివారం అదే గ్రామానికి చెందిన వేంకటేశ్వర బేకరి యజమాని రాయళ్ల ప్రసాద్, ఆయన సతీమణి యామినిలు వెండి కిరీటం బహూకరించారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అడపా రంగయ్య, ప్రధాన అర్చకులు వెల్లటూరి రాధాకృష్ణ పాల్గొన్నారు.



ప్రసన్న వేంకటేశ్వరుడికి వెండి కిరీటం ఇస్తున్న రాయళ్ల ప్రసాద్ దంపతులు

గ్రామాలకు మహర్దశ పట్టించేందుకు 'పల్లె పండుగ' పేరుతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. మంచినీటి ఎద్దడి, మురుగు, రోడ్లు తదితర సమస్యలను పరిష్కరించి పట్టణాలకు దీటుగా పల్లెలను దీర్చిదిద్దేందుకు రాష్ట్రవ్యాప్తంగా బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సోమవారం (14వ తేదీ) నుంచి 'పల్లె పండుగ' కార్యక్రమాన్ని ప్రారంభిస్తుండగా ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేశారు. ఇందుకోసం దాదాపు రూ.80 కోట్ల మేర పనులు చేపట్టేందుకు అధికారులు ప్రణాళికలను రూపొందించారు.

- నెల్లూరు (జడ్పీ)

'పల్లె పండుగ'తో గ్రామాలకు మహర్దశ

- నేటి నుంచి వారోత్సవాల నిర్వహణ
- ఏర్పాట్లపై అధికారుల ముమ్మర కసరత్తు
- జిల్లాలో రూ.80 కోట్ల పనులకు ప్రతిపాదనలు
- నియోజకవర్గాల వారీగా వర్క్‌ల గుర్తింపు

గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు ఈనెల 14 (నేటి) నుంచి పల్లె పండుగ పేరుతో వారోత్సవాలను నిర్వహించనున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చే నిధులతో ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించి పల్లెల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. దీనిపై ఇప్పటికే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. జిల్లావ్యాప్తంగా 735 గ్రామ పంచాయతీల్లో వారోత్సవాల నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. రోజువారీగా ఏ ఏ కార్యక్రమాలు నిర్వహించాలి, ఏ పనులకు శంకుస్థాపనలు చేయాలన్న ప్రణాళికలను సిద్ధం చేసి, స్థానిక ఎమ్మెల్యేలతో చర్చించారు. ఉపాధి హామీ, పంచాయతీ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు సమన్వయంతో ఈ ఏర్పాట్లను చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో చేపట్టే పనులు, పల్లెపండుగ కార్యక్రమాలు తదితర వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక బోర్డులు కూడా ఏర్పాటు చేయనున్నారు.



● భారీగా ప్రతిపాదనలు

ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.80 కోట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు పెద్దఎత్తున చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో నియోజవర్గాల వారీగా చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు తయారు చేసి అధికారులకు పంపుతున్నారు. మంచినీటి ఎద్దడిని నివారణకు చెక్ డ్యాంలు, నీటి గుంతలు, వాటర్ షెడ్లు, గ్రామాల్లో సిమెంటు రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, సాగునీటి పంట కాలువల అభివృద్ధి చేయడం తదితర పనులు చేసేలా ప్రభుత్వం సూచించింది. వచ్చే మార్చి నాటికి ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో జనవరి కల్లా పనులను పూర్తి చేసేలా ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది.

వైభవంగా దసరా వేడుకలు

● అమ్మవారికి ప్రత్యేక పూజలు
● ఊరూరా గ్రామోత్సవాలు


ఆత్మకూరు: శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకరణలో జ్వాలాముఖి అమ్మవారు


ఏఎస్ పేటలో అమ్మవారి గ్రామోత్సవం


అనంతసాగరం : సీతారామలక్ష్మణ ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

కావలి టౌన్, అక్టోబరు 13: పట్టణంలో జరిగిన దేవి శరన్నవరాత్రోత్సవాలు శనివారంలో ముగిశాయి. ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారి ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించారు. కలుగోళశాంభవి అమ్మవారు గజవాహన సేవలందుకున్నారు. పాతూరు శివాలయం దుర్గా భ్రమరాంబ గౌరీదేవిగా రాత్రి దర్శనం ఇచ్చారు. పరాశక్తి పరాత్పరుల శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. విష్ణాలయం రాజ్యలక్ష్మీ విజయలక్ష్మీగా వడ్డెపాలెం కనకదుర్గాదేవి రాజరాజేశ్వరిదేవిగా, ముసునూరు మహాలక్ష్మమ్మ ధనలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ముసునూరు హనుమత్ క్షేత్రంలో దుర్గాదేవి రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు.

●బిట్రగుంట: కోవూరుపల్లిలోని పోలేరమ్మకు నెల్లూరు వేదాయపాలెంకు చెందిన దువ్వూరు గోవర్దన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శివజ్యోతిలు పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో మాజీ సర్పంచు చిట్టిమూరి నీలిమ్మ మల్లికార్జునరెడ్డి దంపతులు భక్తులకు అన్నసంతర్పణ చేపట్టారు. బోగోలు సాయిమందిరలో రాజరాజేశ్వరికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయిబాబా సమాధి కార్యక్రమ ఉత్సవాలు సాయి సేవకులు నిర్వహించారు. విశ్వనాథరావుపేట కోదండరామాలయంలో రాజరాజేశ్వరికి భక్తులు పూజలు చేశారు.

●కందుకూరు: దసరా ఉత్సవాలలో భాగంగా శనివారం రాత్రి అంకమ్మ తల్లి పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అంతముందు అంకమ్మ తల్లి స్వర్ణాభరణాలతో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కాను కుల రూపంలో ఇచ్చిన 330 గ్రాముల బంగారం ఇచ్చారు.

●ఆత్మకూరు: విజయదశమి సందర్భంగా శనివారం పట్టణంలోని సత్రం సెంటర్‌లో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు కన్యకాపరమేశ్వరి అలంకరణలో శోభిల్లారు. ఉదయం భక్తులు, ఆలయ అర్చకులు జమ్మిచెట్టుకు పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి ఊరేగింపు మేళతాళాలు, బాణాసంచాతో పురవీధుల్లో కొనసాగింది. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. జ్వాలాముఖీ ఆలయంలో జగన్మాత శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకరణలో శోభిల్లారు. కాశీనాయన ఆశ్రమంలో అమ్మ వారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

●ఉదయగిరి రూరల్: విజయదశమి సందర్భంగా ఉదయగిరి పట్టణంలోని పార్వతీపరమేశ్వరాలయం, సంతానలక్ష్మీదేవి ఆలయాల్లో రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించి గోత్రనామాలతో అర్చనలు చేయించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా, స్థానిక పోలీస్ స్టేషన్‌లో విజయదశమి పర్వదినం సందర్భంగా ఎస్‌ఐలు ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాసుల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆయుధపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఉన్న ఆయుధాలు, వాహనాలను శుభ్రం చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ప్రజలకు ప్రసాదాలు పంచిపెట్టారు.

●అనంతసాగరం: మండలంలోని సోమశిల, అనంతసాగరం, అగ్రహారం, రేవూరు తదితర గ్రామాల్లో దసరా వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈసందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరికుంటపాడులో సీతారామలక్ష్మణ ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించి అనంతరం పారువేట నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

●సంగం : స్థానిక సంగమేశ్వరాలయంలో శనివారం రాత్రి కామాక్షిదేవి రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీసేవ నిర్వహించారు. స్థానిక రాళ్లచెలిక, కొత్తూరులో శ్రీ బాలచౌడేశ్వరిదేవి ఆలయాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రాళ్లచెలికలో జ్యోతి మహోత్సవం నిర్వహించారు. అదేవిధంగా బాలచౌడేశ్వరిదేవిని సింహ వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. గంగమ్మ ఆలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయంలో ఎస్‌ఐ రాజేష్, సీఐ వేమారెడ్డి శనివారం ఆయుధ పూజ నిర్వహించారు. అదేవిధంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ మన్మధరావు ట్రాన్స్‌ఫార్మర్‌లకు పూజలు నిర్వహించారు.

●ఏఎస్ పేట : స్థానిక శ్రీకృష్ణ మందిరంలో శనివారం దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రీలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

●అల్లూరు : శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. పట్టణ పరిధిలోని కన్యకా పరమేశ్వరి, పార్వతీ అమ్మవారు, కలుగోళమ్మ, పోలేరమ్మ, ఆలయాలతోపాటు శివాలయం, వేణుగోపాలస్వామి ఆలయం, నార్తుమోపూరులోని శివాలయం, మహాలక్ష్మమ్మ ఆలయం, ఇస్కపల్లిలోని గంగమ్మ ఆలయాల్లో శనివారం విజయదశమి పండుగను పుస్కరించుకొని ఆయుధ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకీసేవలు, గ్రామోత్సవాలు నిర్వహించారు.

●జలదంకి : మండలంలోని అన్ని ఆలయాల్లో శనివారం ప్రత్యేకపూజలు జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సంస్థల్లో దసరా వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఆయుధపూజలో ఎస్‌ఐ లతీఫున్నీసా సిబ్బంది పాల్గొన్నారు.

●కొండాపురం: భీమవరప్పాడు గ్రామదేవతలు పోలేమ్మ, బంగారమ్మ, పోతురాజులకు ఆదివారం భక్తులు పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సాయిపేట పంచాయతీ కొత్తపాలెంలో మహాలక్ష్మమ్మకు భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు.

●కలిగిరి : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని భద్రకాళి అమ్మవారు రాజరాజేశ్వగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులు సింహ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించచారు. ఆలయ ప్రాంగణంలో నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

బహిరంగ ప్రకటన

మా మేనత్త గారు **అయిన పచ్చవ పుల్లమ్మ, W/O నారయ్య** గారికి పిల్లలు లేనందున ఆమెకు ఒకేఒక తమ్ముడు మా తండ్రి గారు అయిన **మందవ వెంకటస్వామి నాయుడు S/O చిన్నప నాయుడు** అయినందున ఆమె జీవిత భరోసా కొరకు మరియు ఆమె భర్త తో కలసి మా కుటుంబములు రెండు ఉమ్మడిగా కలసి జీవించుచూ **వున్నందువలన పుల్లమ్మ** గారికి ఆమె తమ్ముడు వెంకటస్వామి నాయుడు గారు పసుపు, కుంకుమల క్రింద కొనియించి ఇచ్చినందు వలన ఆమె తదనంతరము ఆమె ఏకైక తమ్ముడు వెంకటస్వామి నాయుడు గారికి చెందునట్లుగా ఆమె యాపదాస్తిని,ఆమెకు చెందిన అయిన పల్లి రెవిన్యూ గ్రామ సర్వే **నంబర్ -180/1-2 మరియు 463/1-2ల** లో గల ఎకరంలు 4-59 సెంట్లు పొలమును, మరియు నందిపాడు గ్రామము లో ఉన్న ఉమ్మడి ఇల్లులోని ఆమె భాగము ఆమె తన యాపద ఆస్తి మొత్తము ను తన తమ్ముడు కి ఇచ్చినందువలన ఆమె మరణానంతరం రెవిన్యూ రికార్డులలో **వెంకటస్వామి నాయుడు S/O చిన్నప నాయుడు** పేరు నమోదైవున్నది (దాదాపు 25 సంవత్సరములుగా) సం 2005-2007 మధ్యకాలములో కొందరి వ్యక్తులకు కొంతపొలము అమ్మియున్నారు ఆయన తదనంతరము నుండి నేను అనగా మందవ **వెంకట శ్రీనివాస నాయుడు S/O వెంకటస్వామి నాయుడు,** గారికి ఏకైక వారసుడు నైనందువలన 2007-2024 మధ్యకాలమున మరికొందరికి కొంత పొలము అమ్మియున్నాను కావున నా పేరున యిప్పుడు 1బి లో నమోదయినందువలన నా తండ్రి **వెంకటస్వామి నాయుడు** మరియు నేను **(వెంకట శ్రీనివాస నాయుడు)** అమ్మిన పొలము ను మా యిద్దరి సంతకములు తో వున్న అగ్రిమెంటులు ధ్రువీకరించిన తరువాత మీ ఖర్చులతో రిజిస్ట్రేషన్ చేసి యివ్వగలవాడను (అగ్రిమెంట్ల మీద మా యిద్దరి సంతకం ధ్రువీకరణ ముఖ్యమైన అంశముగ పరిగణించబడును) నా ఈ ఆస్తి విషయములో ఉదయగిరి కోర్టు లో **OS no.172/2008 కేసులో తేదీ 31-10-2014న** గౌరవ జడ్జి గారు యిచ్చిన జడ్జ్‌మెంటు లో నా యజమానత్వం ధ్రువీకరించబడి వున్నది మరియు నేను వ్యాపారనిమిత్తము దూరప్రాంతములలో ఉంటున్నందువలన కోర్టుని ఆశ్రయించి **OS.39/2024 కేసులో తేదీ 11-07-2024న** ఉదయగిరి కోర్టు శాశ్వత ఇంజక్షన్ ఆర్డరు ఇచ్చివున్నారు కావున ఈ పై పొలములో ఎవరు ఎలాంటి అమ్మకములు ,దురాక్రమణ, అక్రమ కట్టడములు కట్టుటకు ప్రయత్నించినా నేను నా లాయరు ద్వారా తీసుకోను సివిల్ మరియు క్రిమినల్ కేసులకు చట్టపరిధిలో చట్టబద్ధముగా చర్యలకు భాద్యులు అవుదురు.

పిటిషనర్ అడ్వకేట్
శ్రీనివాసులు సాలపక్షి., MBA., LL.B.,
Advocate,Nellore. Cell No. 99489 56437.

మాలకొండ ఆదాయం రూ. 14,90,441

వలేటివారిపాలెం, అక్టోబరు 13: మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుండి రూ.14.90లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.బి సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్లకు రూ. 12,450, కుంకుమార్చనతో రూ. 24,960, వివాహముల ద్వారా రూ.18 వేలు, తలనీలాలకు రూ. 65,650, వాహన పూజలతో రూ. 11,360, ప్రత్యేకదర్శనాకి రూ. 5,37,900, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ.660, రూముఅద్దెలు ద్వారా రూ.32,620, కవర్లు ద్వారా రూ. 10,500, లడ్డుప్రసాదానికి రూ. 2,44,220, అన్నదానం ద్వారా రూ. 4,66,889, విరాళాలతో రూ.65,232 ఆదాయం వచ్చినట్లు డీసీ సాగర్‌బాబు తెలిపారు.

మాలకొండ సన్నిధిలో ఎమ్మెల్సీ శ్రీకాంత్

మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చౌదరి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ సకల మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ ప్రత్యేక పూజలు చేసి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు మెరుగైన వసతులు కల్పనకు కృషి చేయాలని ఎమ్మెల్సీ కోరారు.



కమనీయం శ్రీవారి పుష్పయాగం


శ్రీవెంకటేశ్వర స్వామికి నిర్వహించిన పుష్పయాగం

కావలి టౌన్, అక్టోబరు 13: స్థానిక బృందావనం కాలనీలోని శ్రీవెంకటేశ్వర స్వామికి ఆదివారం ఉదయం పుష్పయాగం పూజలు నిర్వహించారు. సాయంత్రం వివిధ వాహనాలపై శ్రీవారి గ్రామోత్సవం చేపట్టారు. టీటీడీ అర్చక బృందం సభ్యులు చేపట్టిన ఉత్సవాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరామ్‌మాల్యాద్రి పర్యవేక్షించారు. శనివారం ఉదయం శ్రీవారికి పుష్కరిణిలో చక్రస్నాన సేవలందించారు. సాయంత్ర పల్లకీ ఉత్సవం, తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం, తిరుమంజనం తదితర పూజలు చేపట్టారు.

వైభవంగా వెంగమాంబ పల్లకీసేవ


పేరంటాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 13: విజయదశమి పర్వదినం సందర్భంగా శనివారం మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ అమ్మవారి పల్లకీ సేవను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, కార్యనిర్వాహణాధికారి ఆధ్వర్యంలో అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన, మహానైవేద్యం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజులు చేపట్టి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా దమ్మచక్ర పరివర్తన్ దిన్

కావలి టౌన్, అక్టోబరు 13: స్థానిక అంబేద్కర్ కాలనీలోని బుద్ధవిహార్ వద్ద శనివారం (అశోక విజయదశమి) దమ్మచక్ర పరివర్తన్ దిన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా బ్లూ జెండాలు, పంచశీల జెండాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం బుద్ధవిహార్ వద్ద నున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి నినాదాలు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బౌద్ధచార్య సంఘజ్యోతి పాల్గొని మాట్లాడారు. కావలి బుద్ధవిహార్ సంఘం బాధ్యులు జయప్రకాష్ దమ్మచక్ర పరివర్తన్ దిన్ విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో బీసీఎఫ్ కుడారి మస్తాన్, జేఏసీ అంబటి కొండలరావు, ఆంజనేయులు, శివప్రసాద్, మాలమహానాడు జేఏసీ ఛైర్మన్ దేవిప్రసాద్, మాలమహానాడు మహిళా ఛైర్మన్ మంచ మల్లీశ్వరి, ఉద్యోగ సంఘం ఛైర్మన్ అశోక్‌బాబు, పండు అశోక్‌బాబు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

జలదంకి, అక్టోబరు 13: వేములపాడులో పేకాట స్థావరంపై ఎస్‌ఐ లతీఫున్నీసా ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.6,300 నగదును స్వాధీనం చేసుకున్నారు.

గడ్డివామి దగ్ధం

బిట్రగుంట, అక్టోబరు 13: బోగోలు మండలం పాతబిట్రగుంటలో రేమాల క్రిష్ణారెడ్డికి చెందిన 12 ఎకరాల గడ్డివామి శనివారం మధ్యాహ్నం దగ్ధమైయ్యింది. గడ్డివామిలో మంటలు చెలరేగడం గుర్తించిన స్థానికులు పక్కన ఉన్న గడ్డివాములకు నిప్పు అంటకుండా చర్యలు తీసుకున్నారు. వెంటనే కావలి అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి : సీపీఎం


ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 13: రాష్ట్ర ప్రభుత్వం ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని ఆదివారం మండలంలోని బిజ్జంపల్లి గ్రామస్థులు ఖాళీ దబర్లు, బక్కెట్లు పట్టుకొని సీపీఎం ఆధ్వర్యంలో ఆం దోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ ఓవైపు వ్యవసాయం కలిసిరాక, మరోవైపు నిరుద్యోగ సమస్యలతో గ్రామీణప్రాంత ప్రజల జీవనం కష్టతరమైందని, ఈతరుణంలో అన్ని ర కాల వస్తువులు, నూనెల ధరలు మండుతుండంతో పేద, మధ్యతరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ఆహార ధాన్యాలు సమృద్ధిగా ఉన్నప్పటికీ ఎన్నడూలేని విధంగా బియ్యం ధరలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ధరలను నియంత్రించాలని, లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

నిర్వాసితులకు అన్ని వసతులు కల్పించాలి


ఇస్కపల్లి పీహెచ్‌సీని పరిశీలిస్తున్న ఆర్డీవో

అల్లూరు, అక్టోబరు 13: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఆదివారం కావలి ఆర్డీవో ఎం వంశీకృష్ణ మండలంలో పర్యటించారు. ఈసందర్భంగా ఇస్కపల్లి అనంతరం అల్లూరు రామకృష్ణ జూనియర్ కళాశాల గదులను పరిశీలించారు. కలెక్టరు ఆదేశాల మేరకు తుఫాను హెచ్చరికల నేపథ్యంలో తీరప్రాంతవాసులను ముందస్తు జాగ్రత్తగా అల్లూరుకు తరలిస్తామన్నారు. ఈ క్రమంలో వారికి అవసరమైన మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ ప్రభుదీప్, వీఆర్వోలు మల్లికార్జున, మనోహర్ పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే

కందుకూరు: అల్పపీడనం ప్రభావం ఉన్నందున రెండుమూడు రోజులు తీవ్ర ఈదుర గాలులతో పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తినా రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో కార్యచరణ చేపట్టాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు విపత్తు సమయంలో ప్రజలకు అండగా ఉండాలని కోరారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి : ఏఈ

కావలి రూరల్: తుఫాను ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ, రూరల్ విద్యుత్ ఏఈలు వసంత రావు, శ్రీనివాసులురెడ్డిలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీ ప్రాంతాలల్లో ఎక్కడైనా రోడ్ల ప్రక్కన చెట్లు ఒరిగి ఉంటే ఆ ప్రాంత లైన్‌మెన్‌కు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం కోసం సెల్: 94408 14289, 94408 12056 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రత్యేకాధికారుల నియామకం

కలిగిరి: ఈ నెల 16 వరకు జిల్లాలో తుఫాను ప్రభావం దృష్ట్యా కలెక్టర్ల ఆదేశాల మేరకు 18 తేదీ వరకు మండల పరిధిలో ప్రత్యేక అధికారులను నియమించినట్లు తహసీల్దారు సిహెచ్.రవీంద్రబాబు తెలిపారు. లోతట్టు ప్రాంతాల వారిని, పూడి గుడిసెల్లో నివశించేవారిని ముందస్తు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాటు చేశామన్నారు.

కంట్రోల్‌రూం ఏర్పాటు

ఉదయగిరి రూరల్ : తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు సుభద్ర ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా తేదీల్లో కంట్రోల్‌రూంలో ఉద్యోగులు 24 గంటలు అందుబాటులో ఉంటారని, 9989502077 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చన్నారు.

మండల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

సీతారామపురం: రానున్న మూడు రోజులు తుఫాను కారణంగా మండలంలో వర్షాలు పడే అవకాశం ఉందని మండలంలోని అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు కృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ సిబ్బంది తమ సచివాలయాల పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు.

చికిత్స పొందుతూ లారీ డ్రైవర్ మృతి

ఉలవపాడు : స్థానిక బైపాస్ జాతీయ రహదారి కొల్లూరుపాడు వద్ద శనివారం రాత్రి మిరపకాయల లోడుతో వరంగల్ నుంచి తమిళనాడుకు వెళుతున్న లారీ డ్రైవర్ మురుగన్ గుణాలన్ (30)ను వెనుక వైపు నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయపడ్డాడు. క్షతగాత్రున్ని స్థానికులు గుర్తించి అతన్ని 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మరణించినట్లు తెలిపారు. ఎస్‌ఐ అంకమ్మ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా వీరభద్రరావు జయంతి

బిట్రగుంట : సమాజం పచ్చదనం పరిశుభ్రతగా ఉంటే అందరం ఆరోగ్యంగా ఉంటామని పరిమి సీతారామయ్య అన్నారు. పరిమి వీరభద్రరావు 115 జయంతి సందర్భంగా ఆదివారం బోగోలు రాజవీధిలో ఆదివారం ఆయన 250 మామిడి మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పరిమి పద్మశ్రీ, లైన్‌మెన్ రమేష్, స్థానికులు ఉన్నారు.

సమష్టిగా పోరాడితేనే రాజ్యాధికారం : బూదాటి

కావలి టౌన్, అక్టోబరు 13: అడుక్కుంటే అధికారం ఇవ్వరని సమష్టిగా పోరాడితేనే బీసీలకు రాజ్యాధికారం వస్తుందని మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య తెలిపారు. స్థానిక కోఆపరేటివ్ కాలనీలో శనివారం బీసీ ఐక్యతా భవన్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆర్టీసీ కూడలి ట్రంకురోడ్డులోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా కో ఆపరేటివ్‌కాలనీలో ఏర్పాటు చేసిన బీసీ ఐక్యతా భవన్‌కు చేరుకుని కార్యాలయాన్ని ప్రారంభించారు. భవన్ రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షులు పోట్లూరు శ్రీనివాసులు, సోమశిల ప్రాజెక్ట్ కమిటి మాజీ ఛైర్మన్ కండ్లగుంట మధుబాబు నాయుడు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ, బీజేపీ నేత బ్రహ్మానందం, భవన్ కార్యదర్శి చిన్నివరప్రసాద్, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజి పాల్గొన్నారు.

మంగుపల్లిలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

అనంతసాగరం : మండలంలోని మంగుపల్లి ఎస్సీ కాలనీలో శనివారం అంబేద్కర్ విగ్రహాన్ని నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ ఇరుబోతు వెంకటయ్య, నాయకులు దావా పెంచలరావు, నంద ఓబులేసు, వేము పెంచలయ్య, సర్పంచు కత్తి పెంచలయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సహాయం

కందుకూరు : విజయవాడ వరద బాధితులకు తమవంతు సహాయంగా ప ట్టణానికి చెందిన తల్లపనేని నరసింగరావు రూ.10వేలు, పంటవారిపాలెం మన్నం రమణయ్య రూ.10వేలు, మోపాడు తోకల రవికుమార్ రూ.10వేలను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు అందజేశారు.

